

'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 162

శుక్రవారం 1-9-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'వయాకామ్ 18' చేతికి..

రూ. 5,963 కోట్లకు భారత క్రికెట్ మ్యాచ్‌ల మీడియా హక్కులు వశం. - 13లో



'ఎక్స్'లో ఆడియో, వీడియో కాల్స్

ఫోన్ నంబర్‌తో పనిలేకుండానే యూజర్లతో కాల్స్‌ను కనెక్ట్ చేసుకోవచ్చు. - 6లో



దక్షిణాఫ్రికాలో పెను విషాదం

దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో సంభవించిన ఘోర అగ్ని ప్రమాదంలో 73 మంది చనిపోయారు. మరో 52 మంది గాయపడ్డారు.

- వివరాలు 6లో



రైల్వే బోర్డు చీఫ్‌గా జయవర్మ సిన్హా

రైల్వేబోర్డు తొలి మహిళా సీఈవో, చైర్‌పర్సన్‌గా జయవర్మ సిన్హా నియమితులయ్యారు. వచ్చే ఆగస్ట్ 31 వరకు విధుల్లో కొనసాగుతారు.

- వివరాలు 6లో



నకిలీ వెబ్‌సైట్ పట్ల అప్రమత్తం

సైబర్ నేరగాళ్లు సుప్రీంకోర్టు నకిలీ వెబ్‌సైట్‌ను రూపొందించారు. దీనిపై అప్రమత్తంగా ఉండాలని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు.

- వివరాలు 6లో



'ఇండియా' భేటీ ప్రారంభం

'ఇండియా' కూటమి సమావేశం ముంబైలో ప్రారంభమైంది. శుక్రవారం.. ఎన్డీయే ఓటమే ధ్యేయంగా రోడ్‌మ్యాప్ ఖరారు చేయనున్నారు.

- వివరాలు 6లో

హైదరాబాద్‌లోనే సీడబ్ల్యూసీ భేటీ!



సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే

- 16, 17, 18 తేదీల్లో నిర్వహణ!
- 17న మేనిఫెస్టో విడుదల.. సోనియా చేతుల మీదుగా ఆవిష్కరణ! 3లో

కాంగ్రెస్‌లోకి రండి



మాజీ మంత్రి తుమ్మలకు టీపీసీసీ చీఫ్ ఆహ్వానం 3లో

పార్లమెంట్ 'ప్రత్యేక' భేటీ

ఈ నెల 18 నుంచి 5 రోజులపాటు నిర్వహణ

ఎజెండాను బయటపెట్టని కేంద్ర ప్రభుత్వం

ఒకే దేశం–ఒకే ఎన్నిక, మహిళా రిజర్వేషన్, యూసీసీ బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం..

- ముందస్తు ఎన్నికలకు వెళ్లే ఆలోచనలో ఎన్డీయే ప్రభుత్వం ఉందంటూ ప్రచారం
- అర్థవంతమైన, ఫలప్రదమైన చర్చల కోసం ఎదురు చూస్తున్నాం
- పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడి
- 'అదానీ'పై జేపీసీ కోసం డిమాండ్ చేస్తామన్న కాంగ్రెస్ పార్టీ



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. దేశ ప్రజల్లో ఒక్కసారిగా ఆసక్తిని పెంచేసింది. ఐదు రోజులపాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి గురువారం ప్రకటించారు. సెప్టెంబర్ 18 నుంచి 22 దాకా ఈ సమావేశాలు (17వ లోక్‌సభకు 13వ సెషన్, రాజ్యసభకు 261వ సెషన్) జరుగుతాయని అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. ప్రస్తుత అమృతకాలంలో పార్లమెంట్‌లో అర్థవంతమైన, ఫలప్రదమైన చర్చల కోసం తాము ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు. అయితే, పార్లమెంట్ ప్రత్యేక భేటీల ఎజెండా ఏమిటన్నది ప్రభుత్వం బయటపెట్టలేదు. దేశ రాజధాని ఢిల్లీలో సెప్టెంబర్ 9, 10న జీ20 శిఖరాగ్ర సదస్సు జరుగనుంది. కూటమి దేశాల అధినేతలు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. జీ20 సదస్సు తర్వాత

మిగతా 6వ పేజీలో ▶

ఆ బిల్లుల ఆమోదానికేనా?

వన్ నేషన్–వన్ ఎలక్షన్, మహిళా రిజర్వేషన్, ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) బిల్లులను మోదీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుందని ఢిల్లీలో చర్చ జరుగుతోంది. ఇందులో వన్ నేషన్–వన్ ఎలక్షన్ బిల్లు అత్యంత ముఖ్యమైనది. దీన్ని ప్రవేశపెట్టడం వెనుక అసలు ఉద్దేశం వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలను ముందుకు జరపడమేనని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. ఈ ఏడాది నవంబర్, డిసెంబర్‌లో తెలంగాణ సహా 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. వీటితోపాటు సార్వత్రిక ఎన్నికలను నిర్వహించాలన్న ప్రతిపాదనపై బలమైన చర్చ జరుగుతోంది. కేంద్రం ముందస్తుకు వెళ్లే యత్నాల్లో ఉందని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సహా ఇతర ప్రతిపక్షాలు చెబుతున్నాయి. మరోవైపు దేశంలో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు 'వన్ నేషన్–వన్ ఎలక్షన్' విధానమే మార్గమని బీజేపీ నాయకులు అంటున్నారు. దేశమంతటా లోక్‌సభ, అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని సూచిస్తున్నారు. 'వన్ నేషన్–వన్ ఎలక్షన్' అమలుకు కనీసం 5 కీలక రాజ్యాంగ సవరణలు చేయాలి. అందుకు అన్ని పార్టీల మధ్య ఏకాభిప్రాయం కావాలి. 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' అంశం జాతీయ లా కమిషన్ పరిశీలనలో ఉందని కేంద్ర న్యాయ శాఖ మంత్రి మేఘ్వాల్ గతంలోనే చెప్పారు.

రంగుల తెరకు డ్రగ్స్ మరక

- నేవీ మాజీ ఉద్యోగిని పట్టుకుంటే కదిలిన డొంక
- మాదాపూర్‌లో ఫిల్మ్ ఫైనాన్షియర్ అరెస్ట్
- సినీరంగ ప్రముఖులకు మాదకద్రవ్యాలు సరఫరా 14లో
- ఆ 18 మంది కస్టమర్ల కోసం గాలింపు

వీవోఏల గౌరవ వేతనం రూ.8 వేలకు పెంపు

- రాఖీ కానుకగా సీఎం కేసీఆర్ నిర్ణయం 2లో
- ప్రస్తుతం వారికి అందుతున్న వేతనం రూ.5,900
- రాష్ట్రవ్యాప్తంగా 17,608 మంది వీవోఏలకు లబ్ధి
- ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ. 106 కోట్ల భారం

కేటీఆర్‌పై బండి.. కేసీఆర్‌పై ఈటల?

సీఎం, మంత్రులపై బలమైన అభ్యర్థుల పోటీకి బీజేపీ యోచన

కామారెడ్డిలో సీఎంతో అర్వింద్ ఢీ

హరీశ్‌పై మురళీధర్‌రావు..

మిగతా మంత్రులపైనా కీలక నేతలను పోటీ చేయించాలని నిర్ణయం!

త్వరలో విడుదల చేయనున్న తొలి జాబితాలోనే వీరి పేర్ల ప్రకటన

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కమల దళం కొత్త ప్రయోగానికి సిద్ధమవుతోంది. అధికార బీఆర్‌ఎస్ ముఖ్య నేతల ఓటమి లక్ష్యంగా పావులు కదుపుతోంది. సీఎం కేసీఆర్‌తోపాటు కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు మంత్రులపై బీజేపీ నుంచి బలమైన నేతలను పోటీ పెట్టాలని భావిస్తోంది. ఆయా చోట్ల బీజేపీ గెలిస్తే బీఆర్‌ఎస్ ముఖ్యులను ఓడించినట్టు అవుతుందని.. ఒకవేళ

మిగతా 3వ పేజీలో ▶

నెల రోజుల్లోనే బదిలీలు, పదోన్నతులు

- టీచర్ల బదిలీలపై కసరత్తు ముమ్మరం
- మంత్రి, ఉన్నతాధికారుల వరుస భేటీలు
- నేడు షెడ్యూల్ విడుదల.. సెప్టెంబర్ 3 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- కటాఫ్ డేట్ నేటికి పొడిగింపు!

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన అధికారిక కసరత్తు ఊపందుకుంది. విద్యాశాఖ మంత్రి నుంచి ఉన్నతాధికారుల వరకూ అధికారులతో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయి అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో నెల రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు. బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్ శుక్రవారం విడుదల చేయనున్నారు. సెప్టెంబర్ 3 నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టే వీలుంది. వెంటవెంటనే ఎడిట్ ఆప్షన్లు, జాబితాల తయారీ చేపట్టి, సెప్టెంబర్ నెలాఖరుకు ప్రక్రియను ముగించాలని భావిస్తున్నారు. కొన్నేళ్లుగా బదిలీలు, పదోన్నతులు లేకపోవడంతో టీచర్లలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా 1.05 లక్షల మంది టీచర్లుండగా ఎన్నికల

మిగతా 2వ పేజీలో ▶

అర్హులైన టీచర్లకు మెసేజ్‌లు పంపండి



- బదిలీల్లో ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు : మంత్రి సబిత 2లో

క్లుప్తంగా...

విజయనగర శిల్పకళలపై మరిన్ని పరిశోధనలు చేయాలి

మైనాస్వామి పుస్తకావిష్కరణలో బీజేపీ ఎంపీ లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: విజయనగర శిల్పకళలపై మరిన్ని పరిశోధనలు జరగాలని బీజేపీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అభిప్రాయపడ్డారు. దేశచరిత్ర, సంస్కృతి, శిల్పకళ తదితర గొప్ప సంపదలపై పరిశోధనలు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విజయనగర సామ్రాజ్య కాలంనాటి ఆలయాలు, శిల్పకళ వైభవంపై చరిత్రకారుడు మైనాస్వామి రచించిన టెంపుల్ ఆర్కిటెక్చర్ ఆర్ట్ ఆఫ్ విజయనగర లేపాక్షి అనే పుస్తకాన్ని గురువారం ఢిల్లీలో లక్ష్మణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశీయుల దండయాత్రల వల్ల దేశసంపద చాలా కోల్పోయామన్నారు. శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి చరిత్ర, సాంస్కృతిక వైభవాన్ని మైనాస్వామి పుస్తకరూపంలో తీసుకురావడం అభినందనీయమని ఫారిన్ కరస్పాండెంట్ క్లబ్ (ఎఫ్‌సీసీ) అధ్యక్షుడు ఎస్.వెంకట్‌నారాయణ్ పేర్కొన్నారు. రాయల కాలంనాటి ఆలయాలపై నాట్యకళ భంగిమలపై ప్రముఖ కూచిపూడి నాట్యకారులు రాజా రాధారెడ్డి వీడియో సందేశం ద్వారా వివరించారు. కార్యక్రమం విజయవంతం చేసినందుకు అతిథులకు మైనాస్వామి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి నాట్యగురువు రాధారెడ్డి, ఎస్వీబీసీ డైరెక్టర్ వసంత కల్పన తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమణ హామీలను అమలుచేయాలి

జీపీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ

సాక్షి, హైదరాబాద్: కొద్ది రోజుల క్రితం తమ సమ్మె విరమణ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సమస్యలపై సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేసింది. మంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయని పక్షంలో సెప్టెంబర్ 5 నుంచి ఆందోళనలతో పాటు మరోసారి రాష్ట్రవ్యాప్త పోరాటానికి సిద్ధమని వెల్లడించింది. ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో 34 రోజుల సమ్మె, అనంతర పరిణామాలు, భవిష్యత్ ప్రణాళికపై చర్చించినట్లు జేఏసీ నేతలు పాలడుగు భాస్కర్, సీహెచ్.వెంకటయ్య, బి.వెంకటరాజం, పి.అరుణ్‌కుమార్, పి.శివబాబు, ఎస్.దాసు ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 6 నుంచి ఆగస్టు 8 దాకా నిరవధిక సమ్మె సాగాక, 9న సమ్మె విరమణ సందర్భంగా మంత్రి తన పరిధిలోని డిమాండ్లను పరిష్కరిస్తామని, పర్మనెంట్, వేతనాల పెంపు వంటి డిమాండ్లపై సీఎం కేసీఆర్‌తో చర్చిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు.

పాస్‌పోర్ట్‌లపై స్టిక్కర్లు అంటించొద్దు

ట్రావెల్ ఏజెంట్లకు రీజనల్ పాస్‌పోర్ట్ అధికారి డి.బాలయ్య సూచన



సాక్షి, హైదరాబాద్: ట్రావెల్ సంస్థల ప్రకటనల కోసం పాస్‌పోర్టులను వాడుకోవడంపై విదేశీ వ్యవహారాల శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పాస్‌పోర్ట్ కవర్ పేజీపై ట్రావెల్ ఏజెంట్లు తమ ప్రకటనల స్టిక్కర్లు అంటిస్తున్నారని రీజనల్ పాస్‌పోర్ట్ అధికారి దాసరి బాలయ్య తెలిపారు. ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధమే కాకుండా.. పాస్‌పోర్టు గౌరవాన్ని చులకన చేసినట్టేనని బాలయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాస్‌పోర్ట్ కవర్‌పై అశోకచక్రంతో కూడిన జాతీయ చిహ్నంలో అనేక భద్రతాపరమైన అంశాలుంటాయని వివరించారు. ట్రావెల్ ఏజెంట్లు ఈ పాస్‌పోర్టులపై స్టిక్కర్లను అంటించడం వల్ల దానిపై ఉన్న జాతీయ చిహ్నాన్ని, సెక్యూరిటీ ఫీచర్లను ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ చర్యల వల్ల విదేశాలకు ప్రయాణించే భారత ప్రయాణికులకు ఇమ్మిగ్రేషన్ పాయింట్లలో ఇబ్బందులు ఎదురవుతాయన్నారు.



పొత్తు లేకుండా గెలవలేమని తేలికగా చూస్తున్నార్సార్! ఈ సారే సింగిల్‌గా పోటీ చేసి మన సత్తా చూపిద్దాం!



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కోల్డ్ స్టోరేజీ

ఆ కంపెనీకి రైతులే ఓనర్లు!

- విత్తనాల కొనుగోలు నుంచి.. దిగుబడిని విక్రయించే వరకు..
- సమూహంగానే అన్ని పనులను చేసుకునేలా కార్యాచరణ
- దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట.. సొంతంగా మార్కెటింగ్
- ధర వచ్చినప్పుడు అమ్ముకునేలా కోల్డ్ స్టోరేజీలు
- నష్టాలపాలు కాకుండా... లాభాలు వచ్చేలా పక్కా ప్రణాళిక

ఆదర్శంగా నిలుస్తున్న ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ..

సాక్షి ప్రతినిధి, నల్లగొండ

అక్కడ రైతులంతా సంఘటితమయ్యారు. అంతా మాట్లాడుకొని ఓ కంపెనీని ఏర్పాటు చేశారు. రైతులు పంటలు సాగు చేసే క్రమంలో దుక్కి దున్నడం మొదలుకొని పంట చేతికొచ్చాక లాభసాటిగా అమ్ముకునే వరకు అంతా ప్రయోజనం పొందడమే లక్ష్యంగా ఏర్పాటైన కంపెనీ. దీనికి 2019లోనే అడుగులు పడ్డాయి. పది మందితో మొదలై నేడు 900 మంది సభ్యులకు చేరుకున్న ఆ కంపెనీ ద్వారా ఇప్పుడు రైతులు గణనీయ అభివృద్ధిని సాధిస్తున్నారు. అదే నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని 'ఫార్మర్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్'.

పది మందితో మొదలై..

ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (ఐఆర్‌డీఎస్) సహకారంతో కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామపంచాయతీ పరిధిలోని గంగదేవిగూడెంలో 2019లో కట్టంగూర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ కార్యాలయం ఏర్పాటైంది. మొదట్లో పది మంది డైరెక్టర్లుగా ఏర్పడి, ఒక్కొక్కరు 10 మందిని చేర్పించగా, మొత్తంగా ముందుకొచ్చిన 500మంది రైతులతో కంపెనీ ప్రారంభమైంది.

నాబార్డు సహకారంతో

కంపెనీలో చేరిన ఒక్కొక్కరు రూ.1000 చొప్పున రూ.5లక్షలు కూడబెట్టి, నాబార్డు నుంచి మరో రూ.5 లక్షలు ఆర్థిక సహకారం పొంది రూ.10 లక్షలతో తమ పని ప్రారంభించారు. పనితీరును చూసి, నాబ్‌కిసాన్ మరో రూ.20 లక్షలు మంజూరు చేసింది. దీంతో నిత్యం వ్యవసాయ పనుల్లో ఉపయోగపడే ట్రాక్టర్, నానో ట్రాక్టర్, బెయిలర్, రోటో వేటర్లు, డ్రమ్ సీడర్, కల్టివేటర్, ఆప్‌వీల్స్, ప్లవ్, విత్తన డ్రిల్‌తో పాటు పిచికారీ చేసే పంపుసెట్లు కొనుగోలు చేశారు. వాటన్నింటినీ కంపెనీలోని సభ్యులతోపాటు ఇతర రైతులు బయటి కంటే తక్కువ ఖర్చుతో వినియోగించుకునేలా చర్యలు చేపట్టారు. దీనిపై రైతుల్లో అవగాహన పెరుగుతున్న కొద్దీ సభ్యుల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం 900 మందికి చేరుకున్న కంపెనీ ద్వారా రైతు సేవలు విస్తృతం అయ్యాయి. దీంతో నాబార్డు తన 41వ వార్షికోత్సవంలో దీనికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డును ఇచ్చింది.

అందుబాటులోకి విత్తనాలు

నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు కొని మోసపోకుండా కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం నుంచే తమకు విత్తనాలు అందేలా మాట్లాడుకున్నారు. ఎరువులు, పురుగు మందులను సబ్ డీలర్ల వద్ద కొనుగోలు చేసినా, తరువాత కంపెనీ పేరుతో డీలర్‌షిప్ తీసుకొని మార్క్‌ఫెడ్, ఇఫ్‌కో, కోరమాండల్ కంపెనీలనుంచే నేరుగా వాటిని కొనుగోలు చేస్తున్నారు. విత్తనాలు కూడా కంపెనీల నుంచే నేరుగా కొనుగోలు చేస్తుండటంతో మార్కెట్ రేట్ కంటే తక్కువ ధరకు వస్తుండటంతో వారు లబ్ధిపొందుతున్నారు.

ముందుకొచ్చిన దాతలు

రైతుల ఐక్యతను చూసి దాతలు ముందుకొచ్చారు. ముఖ్యసలహాదారుడిగా సేవలు అందిస్తున్న నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి ఎన్‌ఆర్‌లు సహకరించేలా ఒప్పించారు. దీంతో మూడు టన్నుల కెపాసిటీ కలిగిన ఒక ట్రాక్టర్ ట్రాలీ, ఆరు టన్నుల కెపాసిటీ కలిగిన రెండు ట్రాలీలు వారు కంపెనీకి అందజేశారు. ఆ వాహనాలతో రైతులు పండించిన కూరగాయలు, నిమ్మ, బత్తాయి సరుకులను నేరుగా హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లోని మార్కెట్లకు తరలించి విక్రయిస్తున్నారు. రిటైర్డ్ టీచర్ మేరెడ్డి సత్యనారాయణరెడ్డి తన 2.30 ఎకరాల భూమిని కంపెనీకి ఉచితంగా ఇచ్చారు. అందులో ఆర్గానిక్ ఫాంహౌజ్ ఏర్పాటు చేశారు.

ప్రారంభానికి సిద్ధంగా కోల్డ్ స్టోరేజీలు

మార్కెట్‌లో మంచి ధర వచ్చే వరకు నిమ్మ, బత్తాయి తదితర ఉత్పత్తులను నిల్వచేసుకునేలా కోల్డ్ స్టోరేజీ యూనిట్లను (ఒక్కొక్కటి రూ.15 లక్షలతో) జిల్లాలోని వివిధ మండలాల్లో ఏర్పాటు చేసింది. ఒక్కో దాంట్లో 10 టన్నులు స్టోర్ చేసే సదుపాయం కల్పించింది. మండంలోని గంగదేవిగూడెంలో 4 (కంపెనీ కార్యాలయం), అయిటిపాముల -1, బొల్లేపల్లి -1, పామనగుండ్ల-1, నకిరేకల్ మండలం మర్రూర్-1, శాలిగౌరారం-1, నార్కట్‌పల్లి-1, దేవరకొండ మండలం-1. చిట్యాల-1 చొప్పుల ఏర్పాటు చేసి వాటిల్లో నిమ్మ ఉత్పత్తులను పెట్టి పరిశీలిస్తోంది. త్వరలోనే వీటిని ప్రారంభించనుంది. విద్యుత్ బిల్లును అధిగమించేలా సోలార్ సిస్టమ్‌తో వీటిని అనుసంధానం చేసింది.

నిమ్మకు గ్రేడింగ్, ధర వచ్చినప్పుడే విక్రయాలు

కట్టంగూర్ మండలంలో ఎక్కువగా నిమ్మకాయలు పండించే రైతులు ఉండటంతో నిమ్మకాయల గ్రేడింగ్ మిషన్ ఏర్పాటు చేశారు. నాలుగు వేర్వేరు గ్రేడ్లుగా నిమ్మకాయలను విభజిస్తున్నారు. ఆ గ్రేడ్ల ప్రకారం వేర్వేరుగా కోల్డ్ స్టోరేజీ బాక్స్‌ల్లో నిలువ ఉంచి మార్కెట్ ధర వచ్చినప్పుడే అమ్ముకుంటున్నారు. గ్రేడ్ 2, గ్రేడ్-3 రకం నిమ్మకాయలతో నిమ్మ ఒరుగులు తయారు చేసి వాటిని కూడా అమ్ముతున్నారు. నిమ్మకాయలను హైదరాబాద్‌లోని రహేజా, పాలిమేర, విజేత వంటి కంపెనీలకు నేరుగా విక్రయిస్తారు.

ఐక్యంగా ముందుకు..



ఐక్యంగా ముందుకు సాగుతున్నాం. నకిలీ విత్తనాలు, పురుగు మందులతో మోసపోకుండా, దళారులకు పంటలు అమ్మి నష్టపోకుండా ముందుకు సాగుతున్నాం. అభివృద్ధిని సాధిస్తున్నాం.

- చెవుగోని సైదమ్మ, కంపెనీ చైర్మన్



సాగులో ఖర్చు తగ్గించేలా

పంటల సాగులో రైతులకు ఖర్చు తగ్గించేలా కంపెనీ పని చేస్తోంది. పనిముట్లు మార్కెట్ కంటే తక్కువ ధరకు అందుబాటులోకి వచ్చాయి.

- వాడేపల్లి రమేష్, ఐఆర్‌డీఎస్ అధ్యక్షుడు

పదోన్నతులకు 'సర్దుబాటు' గండం

తమ సీనియార్టీని పరిగణనలోకి తీసుకోవాలంటున్న వీఆర్‌వోలు

సాక్షి, హైదరాబాద్: గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్‌వో) సర్దుబాటు ప్రక్రియ కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోంది. వీఆర్‌వోల వ్యవస్థను రద్దు చేసిన తర్వాత కొత్త రెవెన్యూ చట్టం ప్రకారం గతేడాది ఆగస్టులో రాష్ట్రంలోని 5,138 మంది వీఆర్‌వోలను వివిధ ప్రభుత్వ శాఖల్లో ప్రభుత్వం సర్దుబాటు చేసింది. జూనియర్ అసిస్టెంట్ కేడర్‌లో వీరిని నియమించింది. అయితే రెవెన్యూ శాఖలో సుదీర్ఘంగా పనిచేసిన తమ సీనియార్టీని పరిగణనలోకి తీసుకుని తాము వెళ్లిన కొత్త శాఖల్లో పదోన్నతులు కల్పించాలని, అప్పటివరకు ఆయా శాఖల్లో పదోన్నతులు ఇవ్వద్దని పాత వీఆర్‌వోలు కోర్టులకు వెళ్లడం, వీరి అభ్యర్థన మేరకు కోర్టులు స్టేలు ఇస్తుండడంతో పలు శాఖల్లో శాఖాపరమైన పదోన్నతులకు బ్రేక్ పడుతోంది. ఈ తరుణంలో పదోన్నతులకు కోర్టుల రూపంలో రెడ్ సిగ్నల్ పడుతుండడంతో ఆయా శాఖల ఉద్యోగులు, ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఉన్నత విద్య, వైద్య శాఖల్లో ఆటంకాలు

ఉన్నత విద్యాశాఖలో జూనియర్ లెక్చరర్ల పదోన్నతుల్లో అర్హత గల జూనియర్ అసిస్టెంట్లకు 10% కోటా ఉంది. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖలో పనిచేస్తున్న సిబ్బందితో ఆ శాఖ అధికారులు జేఎల్ పదోన్నతుల కోసం సీనియార్టీ జాబితా తయారు చేశారు. అయితే ఇదే శాఖలో సర్దుబాటు అయిన వీఆర్‌వో ఒకరు తనకు కూడా జేఎల్ ఉద్యోగం చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని, రెవెన్యూ శాఖలో పనిచేసిన తన సీనియార్టీని పరిగణనలోకి తీసుకుని సీనియార్టీ జాబితాలో తన పేరు కూడా చేర్చేలా ఆదేశాలివ్వాలని, అప్పటివరకు ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ఆయన అభ్యర్థన మేరకు జేఎల్ పదోన్నతులపై స్టే విధిస్తూ ఆగస్టు నెలలో ఉత్తర్వులు జారీ చేసింది. వైద్య ఆరోగ్య శాఖలో సీనియర్ అసిస్టెంట్ పదోన్నతుల విషయంలోనూ ఇదే జరిగింది. సీనియర్ అసిస్టెంట్ పదోన్నతుల జాబితాలో తమ పేర్లు కూడా చేర్చాలంటూ పలువురు సర్దుబాటు వీఆర్‌వోలు కోర్టును ఆశ్రయించడంతో కోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులు జారీ చేసింది.

3న డ్రై రన్.. 18న పంపింగ్

త్వరలోనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల మోటార్ల ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన మోటార్ల ప్రారంభానికి సాగునీటి శాఖ చర్యలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా నార్లాపూర్‌లోని 145 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మోటార్ డ్రై రన్‌ను ఈ నెల 3వ తేదీన నిర్వహించనున్నారు. ఈ నెల 18న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఈ మోటార్‌ను ప్రారంభించనున్నారు. ఇందుకోసం 18న కేసీఆర్ నార్లాపూర్ వెళ్లనున్నారు. కాగా, నార్లాపూర్‌లో 145 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 8 మోటార్లు ఏర్పాటు చేస్తుండగా, అందులో రెండింటిని మాత్రమే తొలిదశలో అందుబాటులోకి తేనున్నారు. ఈ నెల 18న ఒకటి, అక్టోబర్ రెండోవారంలో మరొకటి అందుబాటులోకి వస్తాయని సాగునీటి వర్గాలు చెబుతున్నాయి. ఇక, ఏదుల పంప్‌హౌస్‌లోని తొమ్మిది మోటార్లలో కూడా తొలిదశలో రెండు ప్రారంభిస్తారని సమాచారం. వట్టెం, ఉద్దండపూర్‌లలోని 14 మోటార్లలో అక్టోబర్, నవంబర్, 2024 మార్చి, ఏప్రిల్‌లో నాలుగు మోటార్లు నడిచేవిధంగా సాగునీటి శాఖ చర్యలు తీసుకుంటోంది.

అంగన్‌వాడీల్లో సమ్మె సైరన్!

11 నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చిన జేఏసీ

- గతంలో ఇచ్చిన హామీలకు.. ఇటీవల చేసిన ప్రకటనకు పొంతన లేదంటూ ఆగ్రహం
- కనీస వేతనం రూ.26వేలు సాధనే లక్ష్యంగా ఉద్యమం

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సమ్మెకు సిద్ధమవుతున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసిన రిటైర్మెంట్ పాలసీ పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న యూనియన్ నేతలు... విధులు బహిష్కరించి ఉద్యమానికి ఉపక్రమిస్తున్నారు. ఈ నెల 11 నుంచి నిరవధిక సమ్మె నిర్వహించనున్నట్లు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇచ్చింది. సమ్మె తేదీ కంటే ముందుగానే డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ల చిట్టాను సమర్పించింది.

చర్చలకు విరుద్ధంగా రిటైర్మెంట్ పాలసీ...

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు సంబంధించి పదవీ విరమణ ప్యాకేజీని ప్రకటించింది. 65 ఏళ్ల వయసును రిటైర్మెంట్ ఏజ్‌గా ఖరారు చేసిన ప్రభుత్వం... పదవీ విరమణ పొందిన టీచర్‌కు రూ.లక్ష, హెల్పర్‌కు రూ.50వేలు చొప్పున ఆర్థిక సాయం ఇవ్వనున్నట్లు స్పష్టం చేసింది. రిటైర్మెంట్ అయిన వెంటనే టీచర్ లేదా హెల్పర్‌కు ఆసరా పెన్షన్ జారీ చేయనుంది. ఇందుకు సంబంధించిన ఫైలుపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు గతవారం సంతకం చేయగా... అతి త్వరలో ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ప్రకటించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల డిమాండ్‌కు పూర్తి విరుద్ధంగా ఉందంటూ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్లు ధ్వజమెత్తుతున్నాయి.

హామీలకు.. అమలుకు పొంతన లేదు

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల డిమాండ్లపై గత నెలలో మంత్రి సత్యవతి రాథోడ్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ నేతలు పలు డిమాండ్లు మంత్రి ముందు ఉంచారు. ఈ క్రమంలో చర్చించి కొన్ని హామీలు ఇవ్వగా... ఇటీవల సీఎం సంతకం చేసిన ఫైలులోని అంశాలపై ఏమాత్రం పొంతన లేదంటూ యూనియన్ నేతలు మండిపడుతున్నారు. మంత్రితో చర్చలు జరిపినప్పుడు టీచర్‌కు రూ.2లక్షలు, హెల్పర్‌కు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం చేస్తామని చెప్పారని, కానీ ఇప్పుడు అందులో సగానికి కోత పెట్టారంటూ యూనియన్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవీ...

- అంగన్‌వాడీ టీచర్ల వేతనం రూ.26వేలుగా నిర్ధారించాలి.
- విరమణ వయసు 60 ఏళ్లకు కుదించాలి.
- విరమణ పొందిన టీచర్‌కు రూ.10 లక్షలు, హెల్పర్‌కు రూ.5లక్షలు ఇవ్వాలి.
- రిటైర్మెంట్ నాటికి తీసుకునే వేతనంలో సగం మేర పెన్షన్‌గా ఇవ్వాలి.
- సీనియారిటీ ఆధారంగా వేతనాలను పెంపుతో పాటు ఇంక్రిమెంట్లు ఇవ్వాలి.
- ఐసీడీఎస్ పథకానికి నిధులు పెంచి మరింత బలోపేతం చేయాలి. కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలి.
- సమాచార నమోదు కోసం కేంద్ర, రాష్ట్రాలు తెచ్చిన యాప్‌ల విషయాన్ని పరిశీలించాలి.



మోసపూరిత ప్యాకేజీ ఇది

అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ల రిటైర్మెంటు ప్యాకేజీ మోసపూరితంగా ఉంది. చర్చల సమయంలో ప్రకటించిన సాయం.... ఇప్పుడు నిర్ణయించిన సాయం సగానికి పడిపోయింది. ఆసరా పెన్షన్ ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదు. పదవీ విరమణ నాటికి తీసుకుంటున్న వేతనంలో సగం మేర పెన్షన్ రూపంలో ఇవ్వాలి. పని భారం పెరుగుతున్న నేపథ్యంలో అంగన్‌వాడీ టీచర్ల విధులను సర్దుబాటు చేయాలి.

- టేకుమల్ల సమ్మయ్య, గౌరవాధ్యక్షుడు, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ)



మహిళా సంఘాల ప్రతినిధులకు వేతనాల పెంపు ఉత్తర్వుల కాపీని అందజేస్తున్న మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి, సబిత, సత్యవతి రాథోడ్

వీవోఏల గౌరవ వేతనం రూ.8 వేలకు పెంపు

- రాఖీ కానుకగా సీఎం కేసీఆర్ నిర్ణయం
- ప్రస్తుతం వారికి అందుతున్న వేతనం రూ.5,900
- రాష్ట్రవ్యాప్తంగా 17,608 మంది వీవోఏలకు లబ్ధి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మహిళా సంఘాల సహాయకు (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్-వీవోఏ)లకు రక్షాబంధన్ కానుకగా వారి గౌరవ వేతనాలను పెంచుతూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు వారి వేతనాలు నెలకు రూ. 8 వేలకు పెరగనున్నాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 17,608 మంది ఐకేపీ మహిళా సంఘాల సహాయకు (వీవోఏ)లకు లబ్ధి చేకూరనుంది. దీనికి సంబంధించి మంత్రులు, మహిళా సంఘాల ప్రతినిధులతో సమావేశమై నిర్ణయం ప్రకటించాలని మంత్రి హరీశ్‌రావును సీఎం ఆదేశించారు. దీంతో సహచర మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, ఉన్నతాధికారులు, పలువురు వీవోఏ మహిళా సంఘాల ప్రతినిధులతో హరీశ్‌రావు సమావేశమై సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలను తెలియజేశారు. ఆ ప్రకారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల కాపీని మహిళా సంఘాల ప్రతినిధులకు మంత్రులు అందజేయగా వారు మంత్రులకు రాఖీలు కట్టి కృతజ్ఞతలు తెలియజేశారు. పెంచిన వేతనాలను ఈ నెల నుంచి అమల్లోకి రానున్నాయి. వేతన పెంపుదల ద్వారా ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ. 106 కోట్ల అదనపు భారం పడనుంది. కాగా, డ్రెస్ కోడ్ అమలు కోసం నిధులు విడుదల చేయాలన్న వీవోఏల అభ్యర్థన మేరకు ఏడాదికి రూ.2 కోట్లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మహిళా సంఘాల సహాయకుల విధులకు సంబంధించి మూడు నెలలకోసారి చేసే రెన్యూవల్ విధానాన్ని ఇకపై ఏడాదికి చేసేలా సవరించాలని సీఎం నిర్ణయించారు. జీవిత బీమా కోసం విధివిధానాలు అధ్యయనం చేసి నివేదిక అందించాలని మంత్రి ఎర్రబెల్లిని ఆదేశించారు.

జీతాల పెంపు ఇలా...

ఉమ్మడి రాష్ట్రంలో గ్రామాల్లో పొదుపు సంఘాలుగా ఏర్పడిన మహిళలకు సహాయకులుగా పనిచేస్తూ సంఘాలకు సంబంధించిన ఆర్థికపరమైన అంశాలు, ఇతర సమాచారాన్ని నమోదు చేసే విధులను వీవోఏలు స్వచ్ఛందంగా నిర్వహించేవారు. వారు సేవ చేస్తున్న మహిళా సంఘాల నుంచి మాత్రమే 'గ్రూపు లీడర్లు'గా నెలకు రూ. 2 వేల గౌరవ వేతనం ఇచ్చేవారు. వీవోఏల కృషిని గుర్తించిన కేసీఆర్ ప్రభుత్వం 2016 నుంచి వారికి నెలకు రూ. 3 వేల గౌరవ వేతనం అందిస్తోంది. ఇటీవలే పెంచిన పీఆర్సీని వీవోఏలకు కూడా వర్తింపజేయడంతో వారి గౌరవ వేతనం రూ. 3900కు పెరిగింది. దీంతో మహిళా సంఘాల నుంచి అందే రూ. 2 వేలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందే రూ. 3,900 కలిపితే వారి వేతనం రూ. 5,900కు పెరిగింది. అయితే వారి కష్టాన్ని గుర్తించిన ప్రభుత్వం మరోసారి వీవోఏలను ఆదుకోవాలని నిర్ణయించి రాఖీ పండుగ కానుకగా వేతనాలను రూ. 8 వేలకు పెంచాలని నిర్ణయించింది.

అర్హులైన టీచర్లకు మెసేజ్‌లు పంపండి

బదిలీలపై తక్షణమే విధివిధానాలు రూపొందించాలి: మంత్రి సబిత

సాక్షి, హైదరాబాద్: టీచర్ల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను న్యాయస్థానం తీర్పుకు లోబడి నిర్వహించాలని మంత్రి సబిత ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. బదిలీకి అర్హత గల ప్రతి ఉపాధ్యాయుడికీ బదిలీల సమాచారం అందించాలని సూచించారు. ఈ మేరకు దరఖాస్తు చేసుకోవలసిందిగా ప్రతి ఒక్కరికీ మెసేజ్‌లు పంపాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలకు హైకోర్టు అనుమతించిన నేపథ్యంలో గురువారం ఎస్సీఈఆర్టీ కార్యాలయంలో ఆమె అధికారులతో సమావేశమయ్యారు. పారదర్శకతతో ఎలాంటి అపోహలకు తావులేకుండా పదోన్నతులు, బదిలీల ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. వెంటనే సంబంధిత విధి విధానాలు రూపొందించాలని సూచించారు. ఆన్‌లైన్ ప్రక్రియలో సాంకేతికపరమైన సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బదిలీల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు వీలుగా రాష్ట్రస్థాయి అధికారులను జిల్లాల్లో పర్యవేక్షకులుగా నియమించాలని సూచించారు. సమావేశంలో పాఠశాల విద్యా సంచాలకులు దేవసేన తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతుల తర్వాత ఖాళీల భర్తీ

పదోన్నతులు, ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) పూర్తయిన తర్వాత విద్యాశాఖలో ఉండే ఇతర ఖాళీలను భర్తీ చేస్తామని సమావేశానంతరం మంత్రి మీడియాకు తెలిపారు. టీచర్ పోస్టుల భర్తీకి కొంతమంది అడ్డుపడే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయ ఖాళీల్లో గెజిటెడ్ హెడ్ మాస్టర్, ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్ పోస్టులను, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రయత్నిస్తున్నదని, ఈ సమయంలో అన్ని పార్టీలు, అన్ని వర్గాలు సహకరించాలని మంత్రి కోరారు.

నెల రోజుల్లోనే బదిలీలు, పదోన్నతులు

▶ మొదటి పేజీ తరువాయి

సమయంలో వీరిని ఆకట్టుకోవడానికి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియనే ప్రధాన ఆయుధంగా ప్రభుత్వం భావిస్తోంది.

డీఈవోలతో దేవసేన టెలికాన్ఫరెన్స్

జిల్లా విద్యాశాఖాధికారులతో పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన హైదరాబాద్ నుంచి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సక్రమంగా చేపట్టేందుకు సన్నద్ధమవ్వాలని కోరారు. అవసరమైన సమాచారంతో సిద్ధంగా ఉండాలని చెప్పారు. బదిలీలకు కటాఫ్ డేట్‌ను గతంలో ఫిబ్రవరి 1గా నిర్ణయించారని, ఇప్పుడు ఆ తేదీని సెప్టెంబర్ 1గా నిర్ణయించాలని భావిస్తున్నట్లు తెలిపారు. గతంలో బదిలీల కోసం దాదాపు 78 వేల దరఖాస్తులు అందాయి. ఇందులో 58 వేలు అర్హమైనవిగా గుర్తించారు. ఇప్పుడీ సంఖ్య మరింత పెరిగే వీలుందని భావిస్తున్నారు. టీచర్లు 8 ఏళ్లు, ప్రధానోపాధ్యాయులు 5 ఏళ్లు ఒకే చోట పనిచేసినట్లయితే బదిలీకి అర్హులవుతారు. కటాఫ్ తేదీని పొడిగించడంతో సెప్టెంబర్ 1 నాటికి 8, 5 ఏళ్లు నిండే వాళ్ల జాబితాను కొత్తగా రూపొందించాల్సి ఉంటుంది. గతంలో దరఖాస్తు చేసిన టీచర్లు సర్వీస్ కాలాన్ని ఆన్‌లైన్‌లో పొందు పర్చడమా? డీఈవోలే ఈ డేటాను అప్‌డేట్ చేస్తారా? అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. మూడేళ్లలో రిటైర్‌కానున్న టీచర్లకు బదిలీల నుంచి మినహాయింపు ఇస్తారు.

చిక్కుముడిగా దివ్యాంగుల వ్యవహారం


దివ్యాంగులకు బదిలీల్లో ప్రత్యేక ప్రాధాన్యమిస్తారు. గతంలో రూపొందించిన నిబంధనల ప్రకారం 70 శాతం అంగవైకల్యాన్ని పరిగణనలోనికి తీసుకుంటారు. అయితే ఇటీవల న్యాయస్థానం ఈ వ్యవహారాన్ని తప్పుబట్టింది. 40 శాతం అంగవైకల్యాన్ని పరిగణలోనికి తీసుకోవాలని ఓ కేసులో తీర్పు ఇచ్చింది. దీంతో బదిలీల్లోనూ దీన్నే కొలమానంగా తీసుకోవాలని దివ్యాంగ ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

సంఘాల హల్‌చల్

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ మొదలవ్వడంతో ఉపాధ్యాయ సంఘాల నేతలు అధికారులను, మంత్రి సబితను కలుస్తున్నారు. పలు సలహాలు సూచనలతో వినతిపత్రాలు సమర్పిస్తున్నారు. సెప్టెంబర్ 1ని కటాఫ్‌గా నిర్ణయించాలని కోరుతూ ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్ మంత్రి సబితకు వినతి పత్రం సమర్పించారు. ప్రక్రియను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని టీఎస్‌యూటీఎఫ్ నేతలు జంగయ్య, చావా రవి అధికారులను కోరారు. 317 జీవో ద్వారా బదిలీ అయిన వారికి సర్వీస్ పాయింట్లలో అన్యాయం జరిగిందని, దీన్ని సరిచేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నేతలు హన్మంతరావు, నవాత్ సురేష్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరపకుండా షెడ్యూల్ విడుదలకు అధికారులు సన్నాహాలు చేయడం అన్యాయమని టీఎస్పీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు షౌకత్ అలీ విమర్శించారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో అన్ని స్థాయిల నేతల సలహాలు, సూచనలు తీసుకోవాలని పీఆర్‌టీయూటీఎస్ నేతలు శ్రీపాల్ రెడ్డి, బీరెల్లి కమలాకర్ రావు సూచించారు.

సాగు పరిశోధనలో అమెరికా సహకారం కావాలి

మంత్రి నిరంజన్ రెడ్డి



వాషింగ్టన్ డీసీలో వ్యవసాయ శాఖ ప్రతినిధులతో మంత్రి నిరంజన్ రెడ్డి టీం

సాక్షి, హైదరాబాద్: పరిశోధన రంగంలో అమెరికా సహకారం ఆశిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగం అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నదే తమ ఆకాంక్ష అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న నిరంజన్ రెడ్డి బృందం మూడో రోజు గురువారం వాషింగ్టన్ డీసీలో వ్యవసాయ శాఖ ప్రతినిధులతో సమావేశమైంది. ఈ సందర్భంగా ఐటీ, ఫార్మ్ ఎకనామిక్స్, సీడ్ టెక్నాలజీ, పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ తదితర రంగాల్లో కలిసి పనిచేసే అవకాశాలపై చర్చించింది. వాషింగ్టన్ డీసీలో ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా రైతు బంధు పథకం ప్రారంభించి రైతులకు పంట పెట్టుబడి ఇస్తున్నామన్నారు. ఎన్‌ఐఎఫ్‌ఏ డైరెక్టర్ మంజిత్ మిశ్రా మాట్లాడుతూ వ్యవసాయ అభివృద్ధికి పరిశోధన చాలా ముఖ్యమన్నారు. కానీ ఆ పరిశోధనను అర్థవంతమైన ఫలితాలుగా మార్చడంలో రాజకీయ నాయకుల పాత్ర చాలా కీలకమని చెప్పారు. నిరంజన్ రెడ్డి వెంట వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ కేశవులు, తెలంగాణ డిజిటల్ మీడియా డైరెక్టర్ కొణతం దిలీప్ ఉన్నారు.

క్లుప్తంగా...

ఈ నెల రోజులయినా 24 గంటల కరెంటు ఇవ్వండి

మీ దగ్గర లేకపోతే ఇతర రాష్ట్రాల నుంచి కొనండి: కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'మీకు రెండు మూడు గంటల కరెంటు ఇచ్చే ప్రభుత్వం కావాలా, 24 గంటల కరెంటు ఇచ్చే ప్రభుత్వం కావాలా' అని సీఎం కేసీఆర్ రైతులను అడుగుతున్నారని, కానీ రాష్ట్రంలో ఎక్కడా 12–13 గంటల కంటే ఎక్కువ కరెంటు రైతులకు ఇవ్వడం లేదని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. గురువారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'కరెంటు కోతల గురించి నాకు ఫిర్యాదులు వస్తున్నాయి. నల్లగొండ మండలం అప్పాజీపేటలో వారం రోజుల నుంచి కనీసం 6 గంటలు కూడా రావడం లేదు. పొలాలు ఎండిపోతున్నాయని రైతులు వాపోతున్నారు' అని చెప్పారు. 24 గంటలపాటు వ్యవసాయానికి ఇచ్చేంత కరెంటు లేకపోతే పక్క రాష్ట్రాల నుంచి కొనుగోలు చేసయినా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మూడు నెలల తర్వాత వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని చెప్పిన కోమటిరెడ్డి, కనీసం ఈ నెలరోజుల పాటైనా 24 గంటల కరెంటు ఇవ్వాలని బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరారు.

నేటినుంచి 'బండి' యూఎస్ పర్యటన



సాక్షి, హైదరాబాద్: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ పది రోజుల అమెరికా పర్యటనకు శుక్రవారం బయల్దేరుతారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 2న అట్లాంటాలో అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ 15వ వార్షికోత్సవంలో ఆయన ప్రసంగించనున్నారు. ఈ పర్యటనలో సంజయ్ వాషింగ్టన్ డీసీ, న్యూయార్క్, న్యూజెర్సీ, డల్లాస్ సహా వివిధ రాష్ట్రాలను సందర్శిస్తారు. ఈ సందర్భంగా ఆయన ఆయా రాష్ట్రాల్లోని ఎన్‌ఆర్‌ఐ సంఘాలతో సమావేశమవుతారు.

కాంగ్రెస్ నేతల రాఖీ సంబురాలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ నేతలు గురువారం రాఖీ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే సీతక్క ఆయనకు రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆ తర్వాత మధుయాష్కీ ఇంటికి వెళ్లి ఆయనకు రాఖీ కట్టి అక్కడే భోజనం చేశారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు నేతృత్వంలో మహిళా కాంగ్రెస్ నాయకులు కూడా రేవంత్‌కు రాఖీలు కట్టారు. నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన సోదరి హితశ్రీ నివాసానికి వెళ్లి రాఖీ కట్టించుకున్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్ కూడా తన సోదరితో రాఖీ కట్టించుకున్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుంది: ఉత్తమ్



బుగ్గమాదారంలో కృష్ణానదికి పూజ చేసి హారతి ఇస్తున్న ఎంపీ ఉత్తమ్

హుజూర్‌నగర్ (చింతలపాలెం): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందని నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం బుగ్గమాదారంలోని రామాలయంలో ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం కృష్ణానదికి పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. అక్కడ నుంచే ఉత్తమ్ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అనంతరం బుగ్గ మాదారం వద్ద కృష్ణానది ఒడ్డున కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఉత్తమ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ గెలుపు కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తను గుర్తుపెట్టుకొని పార్టీ అండగా ఉంటుందన్నారు. హుజూర్‌నగర్ నుంచి తాను పోటీలో ఉంటున్నట్లు తెలిపారు.

'మర్రి జనార్దన్‌రెడ్డి మహిళలకు క్షమాపణలు చెప్పాలి'

సాక్షి, హైదరాబాద్: తాను వచ్చినప్పుడు బతుకమ్మ బోనాలు ఎత్తుకుని హారతులిస్తే డబ్బులు ఇస్తానని దండోరా వేయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి బేషరతుగా మహిళలకు క్షమాపణలు చెప్పాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ..బీఆర్ఎస్ నేతలకు మహిళలను అగౌరవపరిచేలా మాట్లాడటం అలవాటుగా మారిందని, మహిళా హక్కుల గురించి మాట్లాడే ఎమ్మెల్సీ కవిత మహిళలను అవమానపరుస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేల గురించి ఎందుకు నోరెత్తడంలేదని నిలదీశారు.

ఆత్మగౌరవానికి వెలకట్టారు: రేవంత్

'బోనం ఎత్తడం ఆడబిడ్డల ఆత్మగౌరవం. తెలంగాణ సంస్కృతికి సంకేతం. ఇలాంటి ఆత్మ గౌరవానికి వెలకట్టడం బీఆర్ఎస్ నేతల అహంకారానికి పరాకాష్ట. బీఆర్ఎస్ పతనానికి సంకేతం.' అని గురువారం ట్విట్టర్‌లో పోస్టు చేశారు.

12లక్షల ర్యాంకుకు ఎన్నారై కోటా సీటు

- బీ కేటగిరీలో 5.39 లక్షల ర్యాంకు వరకు ఎంబీబీఎస్ సీటు
- ముున్ముందు అధిక ర్యాంకుల వారూ బీ, సీ కేటగిరీల్లో సీట్లు పొందే చాన్స్
- ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో మరో రెండు, మూడు విడతల కౌన్సెలింగ్‌లు
- తొలి విడత కౌన్సెలింగ్ ఎన్నారై కోటాలో సగం సీట్లకే అభ్యర్థుల ఆప్షన్లు
- మెడికల్ కాలేజీలు భారీగా పెరగడంతో ఏ, బీ కేటగిరీ సీట్లపై చూపు
- నేటి నుంచి ఎంబీబీఎస్.. 5వ తేదీ నుంచి పీజీ తరగతులు ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోని మేనేజ్‌మెంట్ సీట్లకు జరిగిన తొలివిడత కౌన్సెలింగ్‌లో.. ఎన్నారై కోటా (సీ కేటగిరీ)లో గరిష్టంగా 12 లక్షల నీట్ ర్యాంకర్ వరకు సీట్లు లభించాయి. అదే బీ కేటగిరీలో 5.39 లక్షల ర్యాంకర్ వరకు సీట్లు వచ్చాయి. తదుపరి జరగనున్న రెండో, మూడో విడత కౌన్సెలింగ్‌లలో ఈ ర్యాంకులు మరింత పెరిగే అవకాశం ఉందని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు చెప్తున్నాయి. ఎంబీబీఎస్ బీ, సీ కేటగిరీల తొలివిడత కౌన్సిలింగ్‌లో సీట్ల కేటాయింపు జాబితాను వర్సిటీ గురువారం ప్రకటించింది. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా కన్వీనర్ కోటా కింద నీట్‌లో 2.38 లక్షల ర్యాంకు వచ్చిన ఓ విద్యార్థికి ప్రైవేట్ మెడికల్ కాలేజీలో కన్వీనర్ కోటా సీటు లభించిన సంగతి తెలిసిందే. కన్వీనర్ కోటాకు సంబంధించిన రెండో విడత కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు జాబితాను ఒకట్రెండు రోజుల్లో ప్రకటించనున్నారు. అందులో రిజర్వేషన్ కేటగిరీల్లో ఇంకా పెద్ద ర్యాంకుకు కూడా సీట్లు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఎన్నారై సీట్లపై అనాసక్తి..

రాష్ట్రంలో వైద్య విద్య అవకాశాలు భారీగా పెరిగాయి. 2023–24లో 56 మెడికల్ కాలేజీల్లో 8,490 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 27 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 3,790 ఎంబీబీఎస్ సీట్లు, 29 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 4,700 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ప్రభుత్వంలోని అన్ని సీట్లను, ప్రైవేటు కాలేజీల్లోని 50శాతం సీట్లను కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తారు. ప్రైవేటులో మిగిలినవాటిలో బీ కేటగిరీ కింద 1,640 సీట్లను, ఎన్నారై కోటాలో 700 సీట్లను భర్తీ చేస్తారు. బీ కేటగిరీలో 85శాతం సీట్లను స్థానిక విద్యార్థులకే కేటాయిస్తుండటంతో మన రాష్ట్ర విద్యార్థులకు అవకాశాలు మెరుగయ్యాయి. ఇక ఎన్నారై కోటాలో సీట్లు ఎక్కువగానే ఉన్నా.. వాటికి ఫీజులు బీ కేటగిరీ ఫీజుల కంటే రెట్టింపుగా ఉంటాయి. అంటే ఎన్నారై కోటా సీటు ఫీజు ఏడాదికి రూ.23 లక్షలు, అంతకుమించి ఉంటుంది. కాలేజీలను బట్టి ఇది మారుతుంది. ఇలా అడ్డగోలు ఫీజులు ఉండటంతో.. 700 సీట్లు అందుబాటులో ఉన్నా.. 330 మంది మాత్రమే వాటికి ఆప్షన్ పెట్టుకున్నారు. చివరివరకు కన్వీనర్, బీ కేటగిరీ సీట్ల కోసం ప్రయత్నించి.. వాటిలో రాని వారు ముున్ముందు ఎన్నారై కోటా కింద చేరే అవకాశాలు ఉంటాయని వైద్యవిద్య వర్గాలు చెప్తున్నాయి. ఎక్కువ ఖర్చు చేసి ఇక్కడ ఎన్నారై కోటాలో ఎంబీబీఎస్ చేసే బదులు.. ఇతర రాష్ట్రాల్లో డీమ్డ్ వర్సిటీల్లో తక్కువ ఫీజుతో చదువుకోవచ్చన్న భావన కూడా ఉందని అంటున్నాయి.

నేటి నుంచి ఎంబీబీఎస్ తరగతులు షురూ

2023–24 వైద్య విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి ఏడాది ఎంబీబీఎస్ తరగతులు శుక్రవారం (సెప్టెంబర్ 1) నుంచి ప్రారంభం అవుతాయని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రకటించింది. పీజీ మెడికల్ తరగతులు ఈ నెల ఐదో తేదీ నుంచి మొదలవుతాయని తెలిపింది. ఇప్పటికే ఎంబీబీఎస్, పీజీలలో కన్వీనర్ కోటా, మేనేజ్‌మెంట్ కోటాలకు తొలి విడత కౌన్సెలింగ్‌లు పూర్తిచేసి విద్యార్థులకు సీట్లు కేటాయించారు. దీంతో తరగతులు ప్రారంభించాలని ఎన్‌ఎంసీ ఆదేశించిన నేపథ్యంలో అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్టు కాళోజీ వర్సిటీ వర్గాలు తెలిపాయి. కాగా.. రాష్ట్రంలో ఈ ఏడాది నుంచి కొత్తగా ప్రభుత్వ ఆధ్వర్యంలో తొమ్మిది మెడికల్ కాలేజీలు ప్రారంభం అవుతున్నాయి. కొమురంభీం ఆసిఫాబాద్, కామారెడ్డి, ఖమ్మం, వికారాబాద్, జనగాం, రాజన్న సిరిసిల్ల, నిర్మల్, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్‌లలోని ఈ కాలేజీల్లోనూ శుక్రవారం నుంచే తరగతులు ప్రారంభం కానున్నాయి.

కాంగ్రెస్‌లోకి రండి

- మాజీ మంత్రి తుమ్మలకు టీపీసీసీ చీఫ్ ఆహ్వానం
- తుమ్మల ఇంట్లో రేవంత్ రెడ్డి, మల్లు రవి తదితరుల భేటీ
- త్వరలోనే కాంగ్రెస్‌లో చేరనున్న మాజీ మంత్రి



గురువారం తుమ్మలతో భేటీ అయిన రేవంత్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మల్లు రవి

సాక్షి, హైదరాబాద్: ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమవుతోంది. ఆయన్ను పార్టీలోకి రావాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని తుమ్మల నివాసానికి రేవంత్‌తోపాటు కాంగ్రెస్ నేతలు సుదర్శన్‌రెడ్డి, మల్లు రవి వెళ్లారు. రాష్ట్ర రాజకీయ పరిణామాలు, సీఎం కేసీఆర్ వ్యవహారశైలి, ఖమ్మం జిల్లా రాజకీయ సమీకరణాలు, రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై తుమ్మలతో రేవంత్ బృందం చర్చించింది. ఖమ్మం జిల్లా రాజకీ య సమీకరణాల్లో భాగంగా పార్టీలోకి రావాలని, తగిన ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పారు. రేవంత్ ఆహ్వానం నేపథ్యంలో తుమ్మల సానుకూలంగా స్పందించారని, త్వరలోనే ఆయన ఏఐసీసీ నేతల సమక్షంలో కాంగ్రెస్‌లోకి వస్తారని చెబుతున్నారు. కాగా, తుమ్మల ఈసారి ఎన్నికల్లో పాలేరు అసెంబ్లీ నుంచి పోటీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవేళ పాలేరులో పోటీ సాధ్యం కాకుంటే ఖమ్మం అసెంబ్లీ నుంచి ఆయన బరిలో ఉంటారని, తుమ్మల ఎక్కడి నుంచి పోటీ చేసినా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్‌కు కొత్త బలం వస్తుందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

ఖమ్మం జిల్లా నేతలను దూరం పెట్టడంపై విమర్శలు...

తుమ్మలతో భేటీకి పార్టీ ఖమ్మం జిల్లా నేతలను రేవంత్ దూరం పెట్టడం కాంగ్రెస్‌లో అంతర్గతంగా తీవ్ర చర్చనీయాంశమవుతోంది. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బదులు నిజామాబాద్ జిల్లాకు చెందిన సుదర్శన్‌రెడ్డి, పాలమూరుకు చెందిన మల్లు రవిని తీసుకెళ్లి తుమ్మలను పార్టీలోకి ఆహ్వానించడంపట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కేటీఆర్‌పై బండి.. కేసీఆర్‌పై ఈటల

▶ మొదటి పేజీ తరువాయి

బీజేపీ నేతలు ఓటమిపాలైనా వారికి తర్వాత జరిగే లోక్‌సభ ఎన్నిక ల్లో పోటీకి అవకాశం ఇవ్వవచ్చని యోచిస్తున్నట్టు తెలిసింది.

బీఆర్ఎస్‌పై తీవ్ర వ్యతిరేకత

తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనపై, కేసీఆర్ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న తీరు, వారి వైఖరితో వివిధ వర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొని ఉందని బీజేపీ జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు పేర్కొంటున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం, పార్టీపరంగా ఇచ్చిన పలు ముఖ్యమైన హామీల (నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితబంధు, ఎస్టీ రిజర్వేషన్ల పెంపు, వ్యవసాయ రుణమాఫీ, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వంటి) అమల్లో వైఫల్యంతో ప్రజల్లో అసంతృప్తి తీవ్ర స్థాయికి చేరుకుందని తేలిందని అంటున్నాయి. ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా మల్చుకోవడంపై దృష్టిపెట్టినట్టు వివరిస్తున్నాయి.

కేసీఆర్, మంత్రులను టార్గెట్ చేస్తూ..

వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌తోపాటు యావత్ కేబినెట్ మంత్రులను ప్రత్యేకంగా టార్గెట్ చేస్తూ ప్రజల్లో మంచి గుర్తింపున్న ముఖ్య నేతలను బీజేపీ అభ్యర్థులుగా పోటీకి దింపాలని ఆ పార్టీ నాయకత్వం ఆలోచనకు వచ్చినట్టు తెలిసింది. త్వరలో విడుదల చేసే తొలి జాబితాలోనే మంత్రులపై పోటీచేసే అభ్యర్థులను ప్రకటించే యోచనలో పార్టీ నాయకత్వం ఉన్నట్టు విశ్వసనీయ వర్గాలు చెప్తున్నాయి.

గజ్వేల్, కామారెడ్డిల్లోనూ సై..

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రెండుచోట్ల నుంచి కేసీఆర్ పోటీచేయనుండటంతో.. గజ్వేల్‌లో ఆయనపై ఈటల రాజేందర్, కామారెడ్డిలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను పోటీకి నిలపాలని పార్టీ యోచిస్తున్నట్టు తెలిసింది. గజ్వేల్‌లో కేసీఆర్‌పై పోటీ చేస్తానని ఈటల గతంలో పలుమార్లు ప్రకటించారు కూడా. ఈ విషయాన్ని ఆయన పార్టీ అగ్రనాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. ఇందుకు తగ్గట్టుగానే ఆయనను గజ్వేల్‌లో, అర్వింద్‌ను కామారెడ్డిలో కేసీఆర్‌పై పోటీకి నిలపాలని పార్టీ నిర్ణయించినట్టు తెలిసింది. ఇక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌పై బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీం నగర్ ఎంపీ బండి సంజయ్‌ను నిలపాలని యోచిస్తున్నట్టు సమాచారం. సిద్దిపేటలో మంత్రి హరీశ్‌రావుపై పార్టీ అగ్రనేత మురళీధర్‌రావు, మహబూబ్‌నగర్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మహేశ్వరంలో మంత్రి సబితారెడ్డిపై మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, వనపర్తిలో మంత్రి నిరంజన్ రెడ్డిపై మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, కరీంనగర్‌లో గంగుల కమలాకర్‌పై మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, నిర్మల్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని పోటీకి దింపాలని నిర్ణయించినట్టు సమాచారం. మిగతా మంత్రులపై కూడా ఆయా ఉమ్మడి జిల్లాల వారీగా బలమైన ముఖ్య నేతలను గుర్తించి పోటీ చేయించాలనే ఆలోచనతో ఉన్నట్టు తెలిసింది.

కాంగ్రెస్ పీఈసీ సమావేశం వాయిదా

- 3న భేటీ కానున్న పీఈసీ....
- ఆశావహుల జాబితా వడపోత
- 4,5,6 తేదీల్లో స్క్రీనింగ్ కమిటీ సమావేశాలు..

సాక్షి, హైదరాబాద్: రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ఖరారు చేసేందుకు ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ) ఆదివారం భేటీ కానుంది. వాస్తవానికి శనివారం ఈ భేటీ జరగాల్సి ఉన్నా ఆదివారానికి వాయిదా పడినట్టు గాంధీభవన్ వర్గాలు గురువారం ఓ ప్రకటనలో తెలిపాయి. ఆదివారం సాయంత్రం 4 గంటలకు పీఈసీ సమావేశమై అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి వాటిని వడపోస్తుందని వెల్లడించాయి. ఈ భేటీ అనంతరం 4,5,6 తేదీల్లో జరగనున్న స్క్రీనింగ్ కమిటీ భేటీలకు కమిటీ చైర్మన్ మురళీధరన్‌తోపాటు సభ్యులు సిద్ధిఖీ, జిగ్నేశ్‌మేవానీ, రేవంత్, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరు కానున్నారు. కాగా, అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ కోసం వీరంతా పీఈసీ సభ్యులతో వ్యక్తిగతంగా మాట్లాడుతారని తెలుస్తోంది. వారి అభిప్రాయాల అనంతరం ప్రతీ నియోజకవర్గం నుంచి రెండు లేదా మూడు పేర్లను అధిష్టానానికి పంపుతారని సమాచారం. ఈనెల 15వ తేదీలోపు 40 నుంచి 50 అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటిస్తారని జోరుగా చర్చ జరుగుతోంది.

హైదరాబాద్‌లోనే సీడబ్ల్యూసీ భేటీ?

- సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే
- 16, 17, 18 తేదీల్లో నిర్వహణ!
- 17న అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల
- భారీ బహిరంగ సభ నిర్వహణ యోచనలో రేవంత్‌రెడ్డి.. ఆ సభలో సోనియా చేతుల మీదుగా మేనిఫెస్టో ఆవిష్కరించే అవకాశం



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో జరగనున్న తొలి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి హైదరాబాద్ వేదిక కానుంది. ఈ మేరకు హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు సీడబ్ల్యూసీ సమావేశాల నిర్వహణకు ఏఐసీసీ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్టు సమాచారం. అంతా సవ్యంగా జరిగితే హైదరాబాద్ శివార్లలో ఈనెల 16,17,18 తేదీల్లో సీడబ్ల్యూసీ సమావేశాలు జరుగుతాయని కాంగ్రెస్ ముఖ్య నేతలు చెపుతున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లకు సంబంధించిన ప్రణాళిక కూడా సిద్ధమైందని వారంటున్నారు. వాస్తవానికి, ఈనెల 17వ తేదీన అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ చాలా కాలంగా అనుకుంటోంది. భారీ బహిరంగసభ నిర్వహించి, ఆ సభకు సోనియా గాంధీని ఆహ్వానించి.. ఆమె చేతుల మీదుగా మేనిఫెస్టోను విడుదల చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రణాళిక రూపొందించారు. ఈలోపే సీడబ్ల్యూసీ సమావేశాల నిర్వహణ అంశం ముందుకు రావడంతో హైదరాబాద్‌లో ఈ సమావేశాలు నిర్వహించి, ఆ సమయంలోనే కాంగ్రెస్ అతిరథ మహారథుల సమక్షంలో ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయాలని ఆయన భావిస్తున్నారు. ఇందుకోసం ఖర్గేను సంప్రదించిన రేవంత్, సీడబ్ల్యూసీ సమావేశాలను తామే నిర్వహిస్తామని కోరినట్టు సమాచారం. అయితే దీనిపై స్పందించిన ఖర్గే.. సీడబ్ల్యూసీ నిర్వహణ అంత ఈజీ కాదని, నిర్వాహకులతోపాటు పార్టీ నేతలు, మీడియా, ఇతరులకు ఇబ్బంది అవుతుందేమో ఆలోచించాలని సూచించినట్టు సమాచారం. కానీ, కచ్చితంగా హైదరాబాద్‌లోనే నిర్వహించాలని, కావాల్సిన ఏర్పాట్లన్నీ తాము చూసుకుంటామని రేవంత్ భరోసా ఇవ్వడంతో ఖర్గే ఓకే చెప్పినట్టు తెలిసింది. ఈ సందర్భంగా భారీ సభ కూడా ఏర్పాటు చేయాలని, ఆ సభలోనే ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయాలనే యోచనలో టీపీసీసీ ఉందని సమాచారం. సీడబ్ల్యూసీ సమావేశాల నిర్వహణపై టీపీసీసీ ముఖ్య నేత ఒకరు మాట్లాడుతూ 'తొలి సమావేశానికి హైదరాబాద్ వేదిక అవుతుంది. అందుకు పార్టీ కూడా ఓకే చెప్పింది. అయితే, పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో తేదీలు మారే అవకాశం ఉంది. తేదీలు మారినా సీడబ్ల్యూసీ ఫస్ట్ మీటింగ్ మాత్రం హైదరాబాద్‌లోనే' అని ఆ నాయకుడు స్పష్టం చేశారు.

వైఎస్ ఆశయాలను ముందుకు తీసుకెళతాం

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- ఇడుపులపాయలో వైఎస్ సమాధి వద్ద నివాళి
- దివంగత నేత ఆశయాలను గౌరవించేవారు సమాజ సేవ చేయాలని పిలుపు



వైఎస్ఆర్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న భట్టి విక్రమార్క, నాయకులు

వేంపల్లె/వైరా/జడ్చర్ల: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నదే తమ లక్ష్యమని తెలంగాణ సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఏపీలోని వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రాజశేఖరరెడ్డి సమాధికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అక్కడే ఉన్న వైఎస్ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నమస్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ప్రారంభం నుంచి చివరి వరకు పాల్గొన్న తమ వ్యక్తి గత సిబ్బంది, నాయకులు అందరూ దివంగత వైఎస్ ఆశీస్సులు తీసుకోవాలని భావించి ఇక్కడకు వచ్చినట్లు చెప్పారు. వైఎస్ఆర్ హయాంలో తాను శాసన సభ్యుడిగా, అసెంబ్లీలో చీఫ్‌విప్‌గా పనిచేసినట్లు తెలిపారు. వైఎస్ఆర్‌కు తాను చాలా సన్నిహితంగా ఉండేవాడినన్నారు. ఆయన ఆశయాలను గౌరవించే అందరూ కూడా సమాజ సేవ చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కమలమ్మ, ఏఐసీసీ సభ్యుడు ధ్రువకుమార్‌రెడ్డి, ఇతర నేతలు నజీర్ అహ్మద్, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థల చేతుల్లో దేశ సంపద

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ సంస్థల చేతులకు అప్పగించిందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర విజయవంతంగా ముగియడంతో తనతో పాటు యాత్రలో పాల్గొన్న నాయకులతో కలసి తిరుమల వెంకన్నస్వామిని దర్శించుకునేందుకు వెళుతూ.. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల శివారులోని ఓ హోటల్ వద్ద ఆయన కాసేపు విలేకరులతో మాట్లాడారు. దేశంలో సాగుతున్న ప్రజావ్యతిరేక పాలనకు అడ్డుకట్ట వేసేందుకు ప్రజలు సిద్ధమయ్యారని, అందులో భాగంగానే హిమాచల్ ప్రదేశ్, కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని భట్టి అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో తాము పేదలకు ఇచ్చిన భూములను సీఎం కేసీఆర్ గుంజుకుని కార్పొరేట్ సంస్థలకు అమ్ముకున్నారని విమర్శించారు. తాము తిరిగి అధికారంలోకి రాగానే ఆ భూములను వెనక్కి తీసుకుంటామని స్పష్టం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 74 నుంచి 75 సీట్లలో గెలిచి అధికారంలోకి వస్తామన్నారు. బీఆర్ఎస్ నేతలు అహంకారంతో వ్యవహరిస్తున్నారని, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలను కాల్చి వేస్తానని బెదిరించడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. అసెంబ్లీ సీట్ల కేటాయింపులో ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను అనుసరిస్తామని తెలిపారు.



సోదరి ఆశీర్వాదం తీసుకుంటున్న సీఎం కేసీఆర్

ప్రగతిభవన్‌లో రాఖీ సంబురాలు

అక్కాచెల్లెళ్లతో రాఖీలు కట్టించుకున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ప్రగతిభవన్‌లో రక్షాబంధన్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. తోబుట్టువుల ప్రేమానురాగాలు, అనుబంధాలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నివాసం వేదికగా నిలిచింది. రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా కేసీఆర్‌కు అక్కలు లక్ష్మీబాయి, జయమ్మ, లలితమ్మ, చెల్లెలు వినోదమ్మ రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ అక్కలకు పాదాభివందనం చేసి ఆశీర్వాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో సీఎం కేసీఆర్ సతీమణి శోభ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ బీ టీం: తరుణ్ ఛుగ్



నల్లగొండలో బీజేపీ నాయకులతో సమావేశమైన తరుణ్‌ఛుగ్

నల్లగొండ టూటౌన్: బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ పార్టీ బీ టీంగా పనిచేస్తోందని బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి, జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్ విమర్శించారు. కేసీఆర్ కుటుంబ పాలనకు వ్యతిరేకంగా ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధమయ్యారని చెప్పారు. తరుణ్‌ఛుగ్ గురువారం నల్లగొండలో వివిధ నియోజకవర్గాల నాయకులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం పట్ల ప్రజలు రాష్ట్రంలో కూడా బీజేపీ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబ పాలనను గద్దెదించాలంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతోనే సాధ్యమన్నారు. కేసీఆర్ చేసిన అవినీతిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, తప్పు చేసింది ఎవరైనా సరే జైలుకు వెళ్లక తప్పదని పేర్కొన్నారు. కేసీఆర్ మైండ్ గేమ్ ట్రాప్ ఈసారి ఎవరూ నమ్మరని, బీఆర్ఎస్, బీజేపీ ఒకటేనని చెప్పి ప్రజల్లో బదనాం చేసేది బీఆర్ఎస్ పార్టీ వాళ్లే అని స్పష్టం చేశారు.

సోనియా, రాహుల్ గాంధీలతో షర్మిల భేటీ

- తెలంగాణ రాజకీయాలపై చర్చ!
- కేసీఆర్ కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది
- భేటీ అనంతరం షర్మిల వ్యాఖ్య



సాక్షి, న్యూఢిల్లీ: ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల భేటీ అయ్యారు. గురువారం ఉదయం ఢిల్లీలోని సోనియా గాంధీ నివాసంలో బ్రేక్‌ఫాస్ట్ సమయంలో ఈ భేటీ జరిగింది. ఈ సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా పాల్గొన్నారు. వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తారన్న వార్తల నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. తెలంగాణ కాంగ్రెస్‌లోకి తాను వస్తే పార్టీకి ఏ మేరకు బలం పెరుగుతుంది.. తన ప్రాథమ్యాలు ఏంటి అనే అంశాలను సోనియా, రాహుల్ గాంధీలకు షర్మిల వివరించినట్లు తెలిసింది. అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడారు. సోనియా, రాహుల్ గాంధీలతో సమావేశమైనట్లు ఆమె చెప్పారు. ''చాలా నిర్మాణాత్మక చర్చ జరిగింది. తెలంగాణ ప్రజలకు మేలు చేసే దిశగా రాజశేఖరరెడ్డి బిడ్డ నిరంతరం పని చేస్తుంది. మీ అందరితో ఒకే విషయం చెబుతున్నా. కేసీఆర్ కౌంట్‌డౌన్ స్టార్ట్ అయింది''అని షర్మిల పేర్కొన్నారు. పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తారా? అన్న ప్రశ్నను ఆమె దాటవేశారు. తెలంగాణలో రాజన్న పాలన తీసుకొస్తానంటూ ఇచ్చిన హామీ నెరవేరుతుందా అన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా 'మీరు మాట్లాడాలని కోరారు. మాట్లాడాను. ఇక నన్ను వెళ్లనివ్వండి. హైదరాబాద్ వెళ్తున్నా'అని షర్మిల సమాధానమిచ్చారు.

సమగ్ర సమాచారంతో ఎన్నికల ప్రచారం

బీజేపీ ఐటీ, సోషల్ మీడియా, డేటా, కాల్‌సెంటర్ విభాగాల భేటీలో నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: సమగ్ర సమాచారం, ప్రచారంతోనే సమర్థవంతంగా ఎన్నికలను ఎదుర్కోవాలని బీజేపీ ఐటీ విభాగం నిర్ణయించింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ ప్రచారం, ఇతర అంశాలకు సంబంధించి సోషల్ మీడియా, ఇతర మాధ్యమాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవడంపై బీజేపీ దృష్టి పెట్టింది. ఇందులోభాగంగా ఇప్పటికే పార్టీ అవసరాలకు ఉపయోగపడేలా, అవసరమైన సమాచారాన్ని, డేటాను సిద్ధం చేసుకోవడం వంటి అంశాలకు సంబంధించి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) టీమ్, సోషల్ మీడియా, డేటా, కాల్‌సెంటర్ విభాగాలకు పార్టీ ఇటీవల బాధ్యులను నియమించిన సంగతి తెలిసిందే. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ విభాగాల తొలిసమావేశంలో నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి, పార్టీనేతలు డా.బూరనర్సయ్యగౌడ్, పోరెడ్డి కిషోర్‌రెడ్డి, జి.యోగానంద్, ఐటీ బృందం, సోషల్ మీడియా టీమ్, డేటా కాల్‌సెంటర్ బృందాల్లోని సభ్యులు పాల్గొన్నారు. ఈ భేటీలో రాబోయే రోజుల్లో ఐటీ, సోషల్ మీడియా, డేటా, కాల్‌సెంటర్ వేటికవే సొంతంగా నిర్వహించాల్సిన కార్యకలాపాలు, అందుకు చేయాల్సిన ఏర్పాట్లు వంటివి చర్చించారు. వీటితోపాటు పార్టీ నాయకత్వం ఆదేశాలమేరకు ఆయా లక్ష్యాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలు, కావాల్సిన సాంకేతిక, ఇతరవనరులు, వాటిని సమకూర్చుకోవడం వంటి అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది.

దుష్కార్యాలు చేసినవానికి, వాటికి సరిపోయే ప్రతీకారం లభిస్తుంది.
విశ్వసించి సత్కార్యాలు చేసేవాడు స్వర్గంలో ప్రవేశిస్తాడు.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 1 సెప్టెంబర్ 2023

మ్యాపులతో మడతపేచీ

నోటితో మాట్లాడుతూ, నొసటితో వెక్కిరించడమంటే ఇదే. భారత్‌తో స్నేహసంబంధాలకు కట్టుబడి ఉన్నట్టు తీయటి కబుర్లు చెప్పే చైనా తన వక్రబుద్ధిని మరోసారి వెల్లడించుకుంది. సోమ వారం నాడు సరికొత్త అధికారిక 'ప్రామాణిక పటం'– 2023 విడుదల చేస్తూ, అందులో భారత్‌లోని పలు ప్రాంతాల్ని తమ దేశంలో భాగమన్నట్టు చూపింది. భారత ఈశాన్య రాష్ట్రం అరుణాచల్ ప్రదేశ్, అక్సాయ్‌చిన్‌లను తన భూభాగాలంటోంది. మొత్తం తైవాన్, వివాదాస్పద దక్షిణ చైనా సముద్ర ప్రాంతాన్ని కూడా ఈ కొత్త జాతీయ పటంలో తమ అంతర్భాగమనేందుకు చైనా తెగించింది. దాదాపు పొరుగు దేశాలన్నిటికీ కోపం తెప్పించడమే కాక, మరోసారి కయ్యానికి కాలు దువ్వింది. పైపెచ్చు, అంతా సవ్యంగానే ఉన్నదన్నట్టు ''జాతీయ సరిహద్దులను గీయడంలో చైనాతో పాటు వివిధ దేశాలు ఉపయోగించే పద్ధతి ఆధారంగా''నే ఈ పటాన్ని రూపొందించినట్టు డ్రాగన్ ప్రకటించుకోవడం విచిత్రం. ఈ వ్యవహారాన్ని ఢిల్లీ ఖండిస్తుంటే, బీజింగ్ మాత్రం మ్యాప్‌ల విడుదల నిత్య కృత్యమేననీ, దీనిపై అతి చేయద్దనీ విషయతీవ్రతను తక్కువ చేసి చెబుతుండడం మరీ విడ్డూరం.

చెప్పేదొకటి చేసేదొకటి జిత్తులమారి చైనా నిత్యకృత్యం. అందుకే, ఈ వ్యవహారాన్ని భారత్ తీవ్రంగా తీసుకోక తప్పదు. వారం క్రితం జొహాన్నెస్‌బర్గ్‌లో 'బ్రిక్స్' సదస్సు జరిగినప్పుడు భారత ప్రధాని, చైనా అధ్యక్షుడు సమావేశమై సంభాషించుకున్నారు. సరిహద్దుల వద్ద పరిస్థితిని చక్కదిద్ది, సత్సంబంధాలకు కృషి చేయాలని చర్చించుకున్నారు. మరోపక్క ఈ 9, 10 తేదీల్లో ఢిల్లీలో జరిగే 'జీ–20' శిఖరాగ్ర సదస్సుకూ చైనా అధినేత హాజరు కావాల్సి ఉంది. సరిగ్గా ఈ సమయంలో ఉరుము లేని పిడుగులా డ్రాగన్ దేశ సరిహద్దులు ఈ 'వక్రీకరించిన' పటంతో బాంబు పేల్చింది. గమనిస్తే మన ప్రాంతాలకు చైనీస్ పేర్లు పెడుతూ, మునుపటి పటంలోనూ చైనా ఇదే తెంపరితనం చూపింది. ఆ దేశ పశ్చిమ హద్దుల్లో ఉన్న ప్రాంతాలను తనవిగా చెప్పుకొంది. అక్సాయ్‌చిన్ 1950–60ల నుంచి మన కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్‌లో భాగం. 1962 యుద్ధంలో చైనా దాన్ని ఆక్రమించుకుంది. అరుణాచల్‌నేమో దశాబ్దాలుగా తమ దక్షిణ టిబెట్‌లోది అంటోంది. ఆ రెండూ భారత అంతర్భాగాలని మన ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తున్నా, తన మూర్ఖవాదన కొనసాగిస్తోంది.

పటంలోని అంశాలు అంతర్జాతీయ అంగీకృత సరిహద్దులను పూర్తిగా ఉల్లంఘిస్తున్నాయి. అరుణాచల్ ప్రదేశ్‌ను 'జంగ్నాన్' (దక్షిణ టిబెట్) అని పిలుస్తూ, అది తమదేననడం బీజింగ్ సిగ్గుమాలినతనం. చరిత్ర చూస్తే టిబెట్‌కూ, బ్రిటీషు ఇండియాకు మధ్య 1914లో సిమ్లా సమావేశం జరిగింది. అప్పుడే సరిహద్దుగా మెక్‌మోహన్ రేఖను అంగీకరించాయి. చైనా చేస్తున్న ప్రకటనలు, చూపుతున్న పటం ఆ అంగీకరించిన సరిహద్దు రేఖ చట్టబద్ధతను ఉల్లంఘించడమే! అలాగే, ద్వీప దేశమైన తైవాన్ ఏడాదిపైగా తీవ్రంగా ప్రతిఘటిస్తున్నా, పట్టువదలని బీజింగ్ 'వన్ చైనా విధానం' అంటూ దాన్ని తమ పటంలో చూపడం దురహంకారం. ఇక, పసిఫిక్, హిందూ మహాసముద్రాలకు ప్రధాన నౌకాయాన అనుసంధానమైన దక్షిణ చైనా సముద్ర ప్రాంతం సైనిక, వాణిజ్యపరంగా అతి కీలకం. వివాదాస్పద ద్వీపాలతో సహా ఈ ప్రాంతమంతా చైనా తమ పటంలో కలిపేసుకుంటోంది. ఈ ప్రాంతంలో డ్రాగన్ సామ్రాజ్యవాద విస్తరణ వైఖరిని ఫిలిప్పీన్స్, వియత్నామ్, మలేసియా, జపాన్ తదితర దేశాలు పదే పదే ఎత్తిచూపుతున్నాయి. అయినా అది తన తీరు మార్చుకోలేదు.

భౌతికంగా తన అధీనంలో లేకున్నా ఈ ప్రాంతాలు తనవేననడం చిరకాలంగా చైనా చూపుతున్న మొండి వైఖరే. తాజా పటం జారీ వల్ల దానికి కొత్తగా కలిసొచ్చేదేమీ లేదు. పైగా, మిగతా ప్రపంచపు సహాయం, సానుభూతి కూడా దక్కవు. అయినా సరే, డ్రాగన్ తన దురహంకారాన్ని చాటుకోవడం గమనార్హం. ఒక్కమాటలో చైనా అధినేత షీ జిన్‌పింగ్ సామ్రాజ్యవాద విస్తరణ వైఖరికి ఈ కొత్త మ్యాప్ ప్రతీక. అధికారిక జాతీయ పటాల జారీ చైనాలో దాదాపు ఏటా జరిగే తంతు అయినా... భారత్ వరకు తీసుకుంటే చంద్రయాన్–3 విజయం, రానున్న జీ–20 సదస్సు నేపథ్యంలో ఇప్పుడీ పటాన్ని ఎందుకు విడుదల చేసినట్టు? ఇరుదేశాల మధ్య ఇలాంటి సరిహద్దు వివాదాలే గతంలోనూ సైనిక ప్రతిష్టంభనకు దారితీశాయి. 2017లో తలెత్తిన డోక్లామ్ సంక్షోభం, 2020లో గల్వాన్ లోయలో సైనిక ఘర్షణలే తాజా ఉదాహరణలు. దీంతో దౌత్య సంబంధాలూ దెబ్బతింటున్నాయి. బలగాల్ని వెనక్కి పిలిచి, ఉద్రిక్త వాతావరణాన్ని తగ్గించుకోవాల్సిన వేళ ఇలాంటి తప్పుడు పటం సాధారణ పరిస్థితుల పునరుద్ధరణకు ఏ రకంగానూ దోహదపడదు.

ఇప్పటికే లద్దాఖ్‌లోని కొంత భాగాన్ని చైనా ఆక్రమించేసుకుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. వివిధ విదేశీ సర్వేలు, ఉపగ్రహ ఛాయాచిత్రాలు సైతం భారత సరిహద్దులో చైనా వివాదాస్పద నిర్మాణాల్ని ధ్రువీకరిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో అనుమానాలు పోగొట్టేలా మన పాలకులు వాస్తవాలను వెల్లడించాలి. నమ్మడానికి వీల్లేని పొరుగుదేశంతో నిక్కచ్చిగానే వ్యవహరించాలి. సార్వభౌమాధికారం, సమగ్రతల్లో రాజీ లేదని మాటల్లో కన్నా చేతల్లో చూపాలి. జీ–20 అధ్యక్షతతో విశ్వగురువులయ్యామని సంబరపడే కన్నా, అంతర్గత ఘర్షణలున్న అన్ని పక్షాలనూ అర్థ వంతమైన సమగ్ర చర్చలతో ఒక తాటిపైకి తేవడమే అసలు విజయమని గ్రహించాలి. చైనాతో సంభాషణకు అన్ని మార్గాల్నీ అన్వేషిస్తూనే, మనకున్న ఆందోళనల్ని కుండబద్దలు కొట్టాలి. అవకాశాన్ని బట్టి అందుకు రానున్న జీ–20ను సైతం వేదికగా చేసుకోవాలి. దౌత్య, వాణిజ్య సంబంధాల మెరుగుదలకు సరిహద్దుల్లో సామరస్య వాతావరణం కీలకమని మరోసారి అందరికీ తలకెక్కేలా చూడాలి.

గణాంక శాస్త్రంలో మన దిగ్గజం

సందర్భం



ఎస్.ఆర్. శ్రీనివాస వరదన్


గణాంకవేత్తగా, గణిత శాస్త్రజ్ఞుడిగా అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్రొఫెసర్ సి.ఆర్.రావు 102 ఏళ్ల వయసులో మొన్న ఆగస్ట్ 22న మరణించారు. గణాంక శాస్త్రంలో ఆయన చేసిన మౌలిక కృషి ఆ ఒక్క రంగాన్నే కాకుండా, ఆర్థిక శాస్త్రం, జన్యుశాస్త్రం, మానవ పరిణామ శాస్త్రం లాంటి వాటిని కూడా ప్రభావితం చేసింది. 1920లో తెలుగు కుటుంబంలో జన్మించిన ఆయన పూర్తిపేరు కల్యంపూడి రాధాకృష్ణారావు. నోబెల్ బహుమానానికి సమానమైనదిగా పిలిచే 'ఇంటర్నేషనల్ ప్రైజ్ ఇన్ స్టాటిస్టిక్స్'ను 2023 సంవత్సరానికి ఆయన అందుకున్నారు. అమెరికన్ స్టాటిస్టికల్ అసోసియేషన్ ఆయనను 'లివింగ్ లెజెండ్' అని అభివర్ణించింది. భారత ప్రభుత్వం ఆయనను పద్మవిభూషణ్ పురస్కారంతో గౌరవించుకుంది.

గణాంక శాస్త్రం (స్టాటిస్టిక్స్)లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సు చేయాలని నిర్ణయించుకున్నప్పుడు, నేనేం చదువుతానో నాకు ఆలోచన లేదు. ఎందుకంటే ఇది కొత్త సబ్జెక్ట్. పైగా దాని గురించి నేను విని ఉండలేదు. తొలి ఏడాది చాలావరకు సంభావ్యత గురించి ఉండేది. నేను ఆ సబ్జెక్టును ఇష్టపడ్డాను. విలియం ఫెల్లర్ రాసిన పుస్తకం అప్పుడే ప్రచురించారు. దాన్ని చదవడాన్ని ఎంతో ఆస్వాదించాను. మేము స్టాటిస్టిక్స్ చదవడం మొదలెట్టినప్పుడు, దానికి సంబంధించిన అసలు పాఠ్య పుస్తకాలు లేవు. కానీ డాక్టర్ సీఆర్ రావు రాసిన 'బయోమెట్రిక్స్ పరిశోధనలో అధునాతన గణాంక పద్ధతులు' (అడ్వాన్స్‌డ్ స్టాటిస్టికల్ మెథడ్స్ ఇన్ బయోమెట్రిక్ రీసెర్చ్) అనే పుస్తకాన్ని చదివాము. ఈ పుస్తకంలో ఎంతో విషయ సంపద ఉంది.

మేము 'క్రామెర్–రావు అసమానతా సిద్ధాంతం' (ఒక అంచనా ఎంత కచ్చితమైనదో మదింపు వేయడంలో ఇది గణాంక నిపుణుడికి ఉపయోగపడుతుంది) గురించీ, దాంతోపాటు 'రావు–బ్లాక్‌వెల్ సిద్ధాంతం' (ఒక అంచనాను మెరుగ్గానూ, మరింత అభిలషణీయంగానూ చేయడానికి ఇది ఒక పద్ధతిని అందిస్తుంది) గురించీ తెలుసుకున్నాము. ఈ రెండు సిద్ధాంతాలూ సరళమైనవి, అదే సమయంలో లోతైనవి. అప్పుడే నేను డాక్టర్ సి.ఆర్. రావు గురించి మొదటిసారి విన్నాను.

నా అండర్ గ్రాడ్యుయేట్ చదువును 1959లో ముగించిన తర్వాత, వృత్తి నిపుణులైన గణాంక శాస్త్రజ్ఞులకు శిక్షణనిస్తూ, పరిశోధన చేయాలనుకునే వారిని ప్రోత్సహించే 'ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్'(ఐఎస్ఐ) గురించి తెలిసింది. పోటీ పరీక్ష రాసి, రీసెర్చ్ స్కాలర్‌గా ఎంపికయ్యాను. తర్వాత కోల్‌కతాకు 1959 ఆగస్టులో రైలులో వెళ్ళాను. అక్కడ నేను ఏం ఆశించాలో లేదా నానుంచి వాళ్లు ఏం ఆశిస్తున్నారో నాకు ఎలాంటి ఆలోచనా లేదు.

కోల్‌కతాకు వచ్చిన మరుసటి రోజే నేను సి.ఆర్. రావును కలిశాను. భారతీయ గణాంక శాస్త్ర సంస్థ చాలా పెద్దది. ఉదాహరణకు, ప్రభుత్వం కోసం డేటాను సేకరించడం, విశ్లేషించడం వంటి బాధ్యత వహించే 'నేషనల్ శాంపిల్ సర్వే' వంటి అనేక విభాగాలు ఇందులో ఉన్నాయి. చాలామంది వివిధ రంగాలలో పనిచేసేవారు. మా కార్యకలాపాలకు 'రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్ స్కూల్' ముఖ్య కేంద్రంగా ఉండేది. దీన్ని సంక్షిప్తంగా ఆర్‌టీఎస్ అని పిలిచేవారు. దీని అధిపతి డాక్టర్ సి.ఆర్.రావు. ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ) సర్వాధిపతి పీసీ మహలనోబిస్. ఈయనను ఎల్లప్పుడూ ప్రొఫెసర్ అని పిలిచేవారు. ఆర్‌టీఎస్‌లో, మేము టీ రూమ్‌లో ఉదయం 11.30, మధ్యాహ్నం 3.30 గంటలకు రోజుకు రెండుసార్లు టీ తాగేవాళ్లం. రీసెర్చ్ స్కాలర్లకు అధ్యాపకులు ఇక్కడ స్వేచ్ఛగా కనిపిస్తారు. పరస్పర చర్చల్లో మునిగి ఉండేవారం. ఈ సంస్థలో జేబీఎస్ హాల్డేన్ లాంటి విఖ్యాత శాస్త్రవేత్త కూడా ఒక సాధారణ మనిషి. లావుపాటి సిగార్ వెలిగించి తాగేవారు. డాక్టర్ రావు ఎక్కువ సమయం అక్కడే ఉండేవారు. సీనియర్ ఫ్యాకల్టీతో పాటు తోటి రీసెర్చ్ స్కాలర్‌లను కలవడానికి ఇది సరైన ప్రదేశంగా ఉండేది.



ప్రొఫెసర్ సి.ఆర్. రావు

నాకు దేనిపై ఆసక్తి ఉందని డాక్టర్ రావు నన్ను ఒకసారి అడిగారు. నేను స్టాటిటిక్స్‌కి సంబంధించిన పారిశ్రామిక అనువర్తనాలపై పని చేయాలనుకుంటున్నానని చెప్పాను. ఆయన ఏమీ మాట్లాడలేదు కానీ, మరొక అధ్యాపకుడిని కలవమని సూచించారు. ఆయన సలహా పాటించి ఆ అధ్యాపకుడిని కలిశాను. కొన్ని విషయాలను చదవడానికి కూడా ప్రయత్నించాను. అయితే అవేం పెద్ద ఆసక్తికరంగా అనిపించలేదు. దాంతో నిరుత్సాహానికి గురయ్యాను.

పరిశోధనలో చక్కటి ప్రోత్సాహం

అప్పట్లో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశం జరిగింది. స్టాటిస్టిక్స్ విభాగానికి డాక్టర్ రావు అధ్యక్షత వహించారు. ఆయన ఒక పరిశోధనా సంస్థగా మా ఇన్‌స్టిట్యూట్ శక్తిని చూపించాలనుకున్నారు. రీసెర్చ్ స్కాలర్లు అందరినీ వారి పనిని ప్రదర్శించమని ప్రోత్సహించారు. నేను నా పరిశోధనా జీవితంలో కొన్ని నెలలు మాత్రమే ఉన్నాను కాబట్టి ప్రత్యేకంగా చూపించడానికి ఏమీ లేదు.

అలాంటి తరుణంలో మరో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ రఘురాజ్ బహదూర్ నన్ను ఆదుకున్నారు. సైద్ధాంతిక గణాంకాలలో చదవవలసిన కొన్ని విషయాలను సూచించారు. ఇప్పుడు రాబిన్స్–మన్రో ప్రొసీజర్ అని పిలుస్తున్న రంగం చాలా ఆసక్తికరంగా అనిపించింది. నేను సమావేశానికి నావంతు తోడ్పడగలనని డాక్టర్ రావు సంతోషించారు. అదే సమయంలో, కేఆర్ పార్థసారథి, వీఎస్ వరదరాజన్, ఆర్. రంగారావులను కలిశాను. పారిశ్రామిక గణాంకాల కంటే సంభావ్యతా సిద్ధాంతంలో పనిచేయమని వారు నన్ను ఒప్పించారు. వరదరాజన్ అమెరికా వెళ్లిపోయినప్పటికీ, తర్వాత ఏడాదిన్నర పాటు మిగతా ఇద్దరితో కలిసి పనిచేశాను. నాకు ఆసక్తి కలిగిన అంశాన్ని నేను ఎంచుకోవడం డాక్టర్ రావు గమనించారు. దానికి ఆయన అసంతృప్తి చెందలేదు. మా బృందం ఏం పని చేస్తోందో అప్పుడప్పుడూ మమ్మల్ని అడిగేవారు. మమ్మల్ని ఎంతో ప్రోత్సహించేవారు.

స్కాలర్లకు అందుబాటులో...

మా ఇన్‌స్టిట్యూట్‌కి సందర్శకులు ఎల్లప్పుడూ ప్రవాహంలా కదిలి వచ్చేవారు. వారితో సంభాషించడానికి మాకు తగినంత అవకాశాలు ఉండేలా డాక్టర్ రావు చూసుకున్నారు. సుప్రసిద్ధ సోవియట్ గణిత శాస్త్రజ్ఞుడు ఆంద్రీ కొల్మోగొరోవ్ అప్పట్లో మా ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించారు. భారతదేశంలోని కొన్ని నగరాల పర్యటన కోసం ఆయనతో పాటు విద్యార్థుల బృందం కూడా వచ్చింది. నా థీసిస్‌కి ఎగ్జామినర్‌గా కొల్మోగొరోవ్‌ను డాక్టర్ రావు ఏర్పాటు చేశారు.

పరిశోధక విద్యార్థులకు డాక్టర్ రావు ఎంతో అందుబాటులో ఉండేవారు. తన కుమారుడి మొదటి పుట్టినరోజు వేడుకకు ఆయన మమ్మల్ని ఆహ్వానించారు. ఆ కార్యక్రమంలో ఆయన కుమార్తె తేజ నృత్య ప్రదర్శన కూడా జరిగింది. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది ప్రముఖుల పరిచయాలు ఆయనకు ఉండేవి. అమెరికా, బ్రిటన్, పూర్వపు యూఎస్ఎస్ఆర్‌లో పోస్ట్ డాక్టోరల్ విజిటింగ్ పొజిషన్‌లను పొందడంలో తన విద్యార్థులకు ఆయన ఎంతో సహాయం చేసేవారు.

డాక్టర్ రావు ఒక అద్భుతమైన ఔత్సాహిక ఫొటోగ్రాఫర్. ఆయన అమెరికాకు వెళ్ళిన తర్వాత పిట్స్‌బర్గ్‌లోనూ, కాలేజ్ పార్క్‌లోనూ నేను ఆయన్ని కొన్నిసార్లు సందర్శించాను. తన కుమార్తె దగ్గర ఉండేందుకు ఆయన బఫెలోకు తరలి వెళ్లారు. బఫెలోలోనే ఆయన్ని చివరిసారి కలిశాను. అక్కడ ఆయనతో, తేజతో కొన్ని గంటలు గడిపాను. ఆ సమయంలో ఆయన దాదాపు 100 సంవత్సరాల వయసులో ఉన్నారు. అయినప్పటికీ చాలా చురుగ్గా ఉండేవారు.

విద్యావేత్తలు ఈ ప్రపంచాన్ని విడిచిపెడుతున్నప్పుడు, వారు తమ ప్రచురణలను, విద్యార్థుల వారసత్వాన్ని వదిలివెళతారు. ఈ విషయంలో, డాక్టర్ సి.ఆర్. రావు డాక్టోరల్, మాస్టర్స్ స్థాయిలో పెద్ద సంఖ్యలో విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించారు. దాదాపు 50కి పైగా డాక్టోరల్ విద్యార్థులకు ఆయన నిర్దేశం చేశారు. ఆయన బోధనలు పొందినవారు, ఆ పొందినవారి విద్యార్థులతో సహా మొత్తం ఆయనకు 750 మందికి పైగా 'వారసులు' ఉన్నారు. ఆయన వెలువరించిన ప్రచురణలు సైద్ధాంతికపరమైనవి; అదే సమయంలో భిన్న విషయాలకు సంబంధించిన అనువర్తనాలను(అప్లికేషన్స్) అవి కలిగి ఉన్నాయి. స్టాటిస్టిక్స్ రంగంలో ఆయన దిగ్గజం. తన వెనుక గొప్ప వారసత్వాన్ని వదిలివెళ్లారు. ఆయనను గురువుగా, రోల్ మోడల్‌గా పొందడం నా అదృష్టం.

వ్యాసకర్త 'పద్మవిభూషణ్' గ్రహీత, న్యూయార్క్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్
('ది హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వందనం



ఎవరి నుంచైతే 'ఓం'తో ఆరంభమై, విశ్వశక్తి ఉదయిస్తుందో ఆ వేద మాత, వాక్ శక్తి రూపమైన సరస్వతీ దేవిని ప్రపంచ సంస్కృత దినోత్సవం (ఆగస్ట్ 31) సందర్భంగా ప్రార్థిద్దాం. ఆమె మనకు వివేకం, కళ, భక్తి ప్రసాదించు గాక!

– డేవిడ్ ఫ్రాలే, వేదాచార్యులు

గురు ప్రేరణ



పునరుజ్జీవన పథగామి నారాయణ గురు ఘన వారసత్వాన్ని (ఆయన జయంతి సందర్భంగా) స్మరించుకుంటున్నాను. కుల వివక్ష లాంటి సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా ఆయన జరిపిన ప్రజా మధ్యవర్తిత్వాలు ఆధునిక కేరళ నిర్మాణంలో ఎంతగానో ప్రభావం చూపాయి. గురు బోధలు ఇప్పటికీ ప్రేరణ కలిగిస్తూనే ఉన్నాయి.

– పినరయి విజయన్, కేరళ ముఖ్యమంత్రి

అందుకేనా?



భారత పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను (17వ లోక్‌సభ 13వ సమావేశాలు, రాజ్యసభ 261వ సమావేశాలు) సెప్టెంబర్ 18 నుంచి 22 వరకు నిర్వహించనున్నారు. 2023 డిసెంబర్‌లోనే ముందస్తు సాధారణ ఎన్నికలు జరగనున్నాయా?

– ఆదిత్యా రాజ్ కౌల్, జర్నలిస్ట్

బతకనీయరా?



'ఎక్స్(ట్విట్టర్)'లోకి వీడియో, ఆడియో కాల్స్ వస్తున్నాయని వార్త. ఎలాన్ మస్క్, నీకేమైనా మతిపోయిందా? ఇప్పటికే రోజంతా అక్కర్లేని మార్కెటింగ్ కాల్స్‌తో సతమతం అవుతుంటే, ఇప్పుడు ట్రోల్స్, ఆన్‌లైన్ దుర్వినియోగుదారుల ఫోన్ కాల్స్ కూడా స్వీకరించాలా?

– స్మితా శర్మ, జర్నలిస్ట్

రైతు బాగుండాలి!




ఆగస్టు నెలలో 40 శాతం తక్కువ వర్షాలు కురవడం ఆందోళన కలిగిస్తోంది. మహారాష్ట్రలోని నాయకులందరూ ఈ సమస్యను అధిగమించడంలో ఒక్కటవ్వాలని ఆశ. వ్యవసాయ సంక్షోభం మనం ఎన్నటికీ కోరుకోకూడనిది!

– విక్రమ్ సాఠయే, కార్పొరేట్ స్పీకర్

ఆయన మాటలు నమ్మేదెలా?

సందర్భం



కొమ్మినేని శ్రీనివాసరావు

తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడుకు జర్నలిస్టుగా నాది ఒక సవాల్... 'బాబు ష్యూరిటీ– భవిష్యత్తుకు గ్యారంటీ' పేరుతో చేస్తున్న వాగ్దానాల అమలుకు ఎంత వ్యయం అవుతుందో లెక్కగట్టి, ఆ నిధులు ఎక్కడ నుంచి తెస్తారో గణాంకాలతో సంతృప్తికరంగా చెప్పగలిగితే నేను ఆయనపై ఆర్టికల్స్ రాయడం మానేస్తాను. అలా కాని పక్షంలో మరోసారి ప్రజలను మోసం చేయడానికి చంద్రబాబు నాయుడు, టీడీపీ నేతలు సిద్ధం అవుతున్నారని భావించవలసి వస్తుంది. ఎందుకంటే జగన్ అమలు చేస్తున్న వివిధ పథకాలతో రాష్ట్రం నాశనం అయిపోయిందని ప్రచారం చేసిన చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లు తాము కూడా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామనీ, జగన్ ఇస్తున్న దానికన్నా మూడు, నాలుగు రెట్లు అధికంగా ఇస్తామని చెబుతున్నారు.

'అమ్మ ఒడి' స్కీముకు జగన్ ఇంటికి ఒకరికి పదిహేను వేలు ఇస్తుంటే, తాను ఎందరు పిల్లలు ఉన్నా... ఒక్కొక్కరికి పదిహేనువేల చొప్పున ఇస్తానంటున్నారు. ప్రతి కుటుంబంలోని మహిళలకు 1500 చొప్పున డబ్బు ఇస్తారట. ఈ స్కీము ఒక్కదానికే 37 వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయని ఒక అంచనా. రైతులకు 20 వేల చొప్పున ఇస్తారట. ఇంటింటికి మూడు గ్యాస్ సిలిండర్లు ఫ్రీ అట. నిరుద్యోగులకు భృతిగా మూడు వేల చొప్పున ఇస్తారట. ఇవి కాకుండా వృద్ధాప్య పెన్షన్‌లు ఉండనే ఉన్నాయి. ఎన్నికల నాటికి మరికొన్ని ప్రకటిస్తారట. వీటన్నిటినీ అమలు చేస్తారంటే విజ్ఞులైనవారు ఎవరైనా నమ్ముతారా? అసలు అవి నమ్మశక్యం ఎలా అన్నది మాత్రం చంద్రబాబు ఎందుకు వివరించడం లేదు?

పవన్ కల్యాణ్ అంటే ఆయనకు పెద్దగా చదువు లేదు, పాలన అనుభవం లేదు కనుక ఏదో ఒకటి చెబుతున్నారులే అని సరిపెట్టుకోవచ్చు. కాని పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి, పదిహేనేళ్లు ప్రతిపక్ష నేతగా ఉన్న మనిషి వచ్చే సాధారణ ఎన్నికల కోసం చేస్తున్న గాలి వాగ్దానాలు చేస్తుంటే, వాటికి 'బాబు ష్యూరిటీ– భవిష్యత్తుకు గ్యారంటీ' అని పేరు పెట్టడం గమనిస్తుంటే ఈయన అనుభవం అంతా ప్రజలను మోసం చేయడానికేనా అన్న అనుమానం వస్తుంది. ఆయనకు 'ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5' వంటి మీడియా సంస్థలు మద్దతు ఇస్తూ ఊదర గొట్టవచ్చు. అంత మాత్రాన ప్రజలంతా ఆ హామీలను నమ్ము తారనుకుంటే పొరపాటు.

ఎందుకంటే 2014 ఎన్నికలలో రైతుల రుణాలన్నిటినీ, రైతుల భార్యల మెడలలోని బంగారం తాకట్టు పెట్టి తెచ్చిన రుణాలతో సహా అన్నిటినీ మాఫీ చేస్తానని చెప్పినప్పుడు నాబోటి వాళ్లం అదెలా సాధ్యమని అడిగేవారం. దానికి చంద్రబాబు ఆర్థిక సలహాదారు కుటుంబరావు వంటివారు... 'అబ్బో మా చంద్రబాబుకు చాలా అనుభవం ఉంది, ఆయన చేసి చూపిస్తారు' అని బొల్లేవారు. తీరా ప్రభుత్వం వచ్చాక మొత్తం రకరకాల కమిటీలు వేసి రైతుల రుణాలు మొత్తం కాకుండా లక్షన్నరకు పరిమితం అన్నారు. దానినైనా ఇవ్వగలిగారా అంటే అదీ చేయలేకపోయారు. ఏవో బాండ్లు అన్నారు. వాయిదాలు అన్నారు. కేంద్రం సహకరించడం లేదనీ, రిజర్వు బ్యాంక్ అంగీకరించడం లేదనీ ఏవేవో చెప్పి జనాన్ని మోసం చేశారన్న విమర్శకు గురయ్యారు.



రైతుల రుణాలతో పాటు డ్వాక్రా మహిళల రుణాల విషయంలోనూ అంతే చేశారు. ఇవే కాదు. టీడీపీ మానిఫెస్టోలో సుమారు 400 హామీలు ఇచ్చి వాటిని అమలు చేసే పరిస్థితి లేక, చివరికి పార్టీ వెబ్ సైట్ నుంచి దానిని తీసేశారు. అంతకుముందు 1995 నుంచి చేసిన తొమ్మిదేళ్ల పాలనలో కూడా అలాగే చేశారు. మద్య నిషేధం అమలు చేస్తాననీ, కిలో బియ్యం రెండు రూపాయలకే ఇస్తాననీ ఇలా పలు హామీలు ఇచ్చిన ఆయన ఆ తర్వాత వాటన్నిటికీ మంగళం పాడారు.

మళ్లీ 2024 ఎన్నికలలో అలాగే ప్రజలను మభ్య పెట్టడానికి 'బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారంటీ' పేరుతో టీడీపీ గెలిస్తే ప్రజలకు ఎవరెవరికి ఎంత మొత్తం వస్తుందో చెబుతూ బాండ్లు కూడా ఇస్తారట. ప్రభుత్వపరంగా ఇచ్చిన బాండ్లకే దిక్కు లేకపోతే, పార్టీ పరంగా ఇంటింటికి తిరిగి ఇచ్చే బాండ్లకు ఏమి గ్యారంటీ ఉంటుంది? ఎందుకంటే చంద్రబాబు చేస్తున్న తాజా వాగ్దానాలకు ఏడాదికి సుమారు లక్షన్నర కోట్లు అవసరం కావచ్చు. జగన్ ఇస్తున్న దానికన్నా మూడురెట్లు అధికంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని అంటున్నారు. దీనిని బట్టి ఆ హామీల ఖర్చును అంచనా వేయవచ్చు. జగన్ అమలు చేస్తున్న అన్ని హామీల విలువ సుమారు 45 వేల కోట్లు ఉంటుందని ఒక లెక్క. దీనికే రాష్ట్రం అప్పుల పాలైపోయిందనీ, నాశనం అయిపోయిందనీ చంద్రబాబు ప్రచారం చేశారు. మరి కొత్తగా బాబు ఇస్తున్న హామీలను నెరవేర్చడానికి ఏటా లక్షన్నర కోట్ల నిధులు కేవలం సంక్షేమ కార్యక్రమాలకు సమకూర్చుకోవాలి కదా! అవి ఎక్కడ నుంచి వస్తాయో చెప్పాలి కదా! అప్పుడు అప్పులు ఏ మేరకు చేయవలసి ఉంటుందో ప్రజలకు వివరించాలి కదా! వాటిని ఎలా తీర్చవచ్చో తెలపాలి కదా! అవేవీ చేయకుండా బాండ్లు రాసిస్తామంటే జనం ఎలా నమ్మాలి. సంక్షేమ పథకాలకు పోను మిగిలిన ఖర్చులకు ఎక్కడ నుంచి డబ్బు వస్తుంది? అప్పుడు రాష్ట్రం నాశనం కాకుండా ఉంటుందని ఎలా హామీ ఇవ్వగలరు?

ఇవన్నీ ప్రజలను మోసం చేయడానికే. విజ్ఞులైన ప్రజలు వీటి గురించి ఆలోచించకపోతే పెద్ద ప్రమాదం కాదు.. కాదు.. పెను సంక్షోభంలో పడతారని చెప్పడమే ఒక జర్నలిస్టుగా నా లక్ష్యం. సంక్షేమ పథకాల విషయంలో జగన్‌ను కాపీ కొట్టినట్లుగానే, ఇప్పుడు ఇంటింటికి తిరిగి ప్రజలకు వారి హామీలు వివరిస్తూ ఒక్కొక్కరికి ఎంత లబ్ధి చేకూరుతుందో చెప్పడం కూడా కాపీనే. జగన్ గడప గడపకు అధికారిక కార్యక్రమం నిర్వహించి ప్రతి ఇంటికి ఎంత లబ్ధి చేకూరిందీ వారికి పత్రాలు ఇప్పించారు. టీడీపీ నేతలు అదే రీతిలో భవిష్యత్తుకు గ్యారంటీ అని పత్రాలు ఇస్తారట.

ప్రజలను మభ్యపెట్టాలన్నది వారి తాపత్రయం. తెలుగుదేశంలో పిచ్చి ఎంతవరకు వెళ్లిందంటే చంద్రయాన్ 3 సఫలం అయిందనీ, అలాగే ఏపీలో చంద్రబాబు అధికారంలోకి వస్తారనీ చెప్పేంతవరకు! ఇలాంటివారిని ఎన్నుకుంటే ప్రజలకు దక్కేది చందమామ కథలే. నా ఛాలెంజ్‌ను చంద్రబాబు గానీ, ఆయన తరఫున ఎవరైనా గానీ స్వీకరిస్తారా?

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్

పసివాళ్లపైనా విద్వేష రాజకీయాలా?

మత విద్వేషాలు ఇప్పుడు పాఠశాలలో చదివే పసివాళ్లనూ, వారికి విద్యాబుద్ధులు చెప్పే టీచర్లనూ కబళించివేస్తున్నాయి. ఫలితంగా పాఠశాలలు అమానవీయతకు చిరునామాలుగా మారుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో ఓ బాలుణ్ణి చెంపదెబ్బలు కొట్టించి అవమానించిన ఘటన కానీ, జమ్మూలో మరో బాలుణ్ణి చితక్కొట్టిన వైనం కానీ దేశం ఏం కాబోతోందన్న ఆందోళన రేకెత్తిస్తున్నాయి.

ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్ నగర్‌లోని ఒక ప్రైవేట్ పాఠశాలలో ఒక సామాజిక వర్గానికి చెందిన విద్యార్థిని తోటి విద్యార్థులతో చెంపదెబ్బలు కొట్టిస్తూ కుర్చీలో కూర్చుని ఓ మహిళా టీచర్ సంతోషపడుతూ ముస్లిం పిల్లలకు ఇలాంటి ట్రీట్మెంట్ మాత్రమే వారిని ఈ దేశం నుంచి వెళ్లగొట్టగలదు అంటున్నది. చెంప దెబ్బలు, ఎందుకు? ఏమిటీ? అనేది తెలియదు కాని, బాధిత విద్యార్థిని తోటి విద్యార్థులతో చెంప మీద కొట్టిస్తూ, ఒక సామాజిక వర్గం కోసం మాట్లాడడం ఆందోళనకరం. బాధిత విద్యార్థి ఏడుస్తూనే ఉన్నాడు. మరొక టీచర్ నిలబడి వీడియో తీస్తున్న, నవ్వుతున్న వీడియో వెలుగులోకి వచ్చింది. అమానవీయమైన ఈ దృశ్యం దేశం లోని టీవీలు, సోషల్ మీడియాలో స్కూల్‌కు వెళ్లే కోట్లాది మంది పిల్లల తల్లితండ్రులు చూసి ఉంటారు. బాధిత విద్యార్థి కుటుంబం మీద ఇతరుల మీద ఈ వీడియో ప్రభావం ఎంత పడి ఉంటుంది? ఇంత జరిగినా ప్రతి చిన్న విషయానికి స్పందించే భారతదేశ బాల వికాస్ మంత్రి స్మృతి ఇరానీ ఇంకా మౌనంగానే ఉన్నారు. ఇస్రోలో ప్రధానమంత్రి ఆనంద బాష్పాలు ఆమెకు కనిపించాయి, (మంత్రి దీని మీద ట్వీట్ చేశారు) కాని ఆమెకు పసివాడి కన్నీరు కనిపించలేదు.



అటు జమ్మూలోని కథువా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి ఒకరు బ్లాక్ బోర్డు మీద 'జై శ్రీరామ్' అని రాశాడని అతడిని టీచర్, ప్రిన్సిపాల్ చితకబాదారు. మరోసారి అలా రాస్తే చంపేస్తామని బెదిరించారు. విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనలో టీచర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రిన్సిపాల్ పరారీలో ఉన్నాడు. ఈ సంఘటనకు నిరసనగా పేరెంట్స్ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ఇద్దరి మీద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. జువెనైల్ జస్టిస్ యాక్ట్–75 కింద, ఐపీసీ 323, 342, 504, 506 సెక్షన్స్ కింద కేసులు నమోదు చేశారు.

ఈ సంఘటనలను గమనిస్తే విద్వేషాలు ఇప్పుడు బజార్ నుంచి బడుల్లోకి చేరుకున్నాయనిపిస్తోంది. పీఎమ్ మోదీ జీ! దేశంలో ఏం జరుగుతోంది? నడుస్తున్న ట్రైన్‌లో ఒక జవాన్ మీ పేరు ఉచ్చరిస్తూ ప్రయాణికులలో ఒక సామాజిక వర్గం వారిని టార్గెట్ చేసి ముగ్గురిని కాల్చి చంపాడు. 'ముస్లింలు పాకిస్తాన్‌కు వెళ్లిపోండి' అంటూ మీ క్యాబినెట్ లోని గిరిదాస్ కిశోర్ అనే మంత్రి పేర్కొన్నాడు. ఒక మంత్రి 'గోలీ మారో సాలోంకు' అన్నాడు.

మొన్నటికి మొన్న హరియాణాలో బుల్డోజర్‌లతో ఒకే సామాజిక వర్గం ఇండ్లను, వ్యాపార సముదాయాలను కూల్చి వేశారు. నిజానికి మీ పాలన గురించి చరిత్ర రాస్తే ఒక కలంకిత రాజు (పీఎం) పాలన కనిపిస్తుంది. మీరు చెబుతున్న 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' అంటే ఇదేనా! ఏ విధంగా చూసినా పై చర్య క్షమించరానిది! మోదీజీ స్పందించండి! 'తూ హిందూ బనేగా నా, ముసల్మాన్ బనేగా, ఇన్సాన్ కీ ఔలాద్ హై ఇన్సాన్ బనేగా' అనే మొహమ్మద్ రఫీ పాడిన పాట సందేశాన్ని ఇవ్వండి మోదీజీ!

'హిందూ, ముస్లిం, సిక్కు, ఈసాయి, భాయి, భాయి' అనే భారత్‌ను విద్వేషం అనే విషపు కోరల్లోకి వెళ్లకుండా చూద్దాం! 'అవాజ్ దో హమ్ ఏక్ హై!' దేశ భవిష్యత్తు అయిన స్కూలు పిల్లల మీద కూడా విద్వేష భావాలు నాటుకునే విధంగా తయారవుతున్న టీచర్ల రూపంలోని విషపు నాగులను తుంగలోనే తొక్కేద్దాం! విద్వేషానికి మన దేశంలో ఏమాత్రం చోటు లేదు. ప్రేమ, సద్భావన, శాంతి, అహింస, మానవత్వాలకు ఈ దేశం ప్రతీక. ఇక్కడ మహాత్మాగాంధీ ఆత్మ సందేశం మాత్రమే మార్గదర్శనం అనేది గుర్తుంచుకోవాలి.

– ఎమ్‌డి. మునీర్,
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు । 99518 65223

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** బ.విదియ రా.3.22 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** పూర్వాభాద్ర సా.6.47 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** రా.3.48 నుండి 5.21 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.18 నుండి 9.08 వరకు, తదుపరి ప.12.24 నుండి 1.16 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.20 నుండి 12.47 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.48, **సూర్యాస్తమయం:** 6.13.

క్లుప్తంగా...

రైతు బీమా డబ్బు కోసం తల్లికి ఉరివేసి..

పాపన్నపేట (మెదక్): రైతు బీమా డబ్బులకు ఆశపడి కన్నతల్లినే చంపాడో కిరాతకుడు. ఈ దారుణ ఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలో వెలుగుచూసింది. అన్నారం గ్రామానికి చెందిన ధనమ్మోల్ల శంకరమ్మ (57) పేరిట 23 గుంటల భూమి ఉంది. జీవనోపాధి కోసం కొడుకు ప్రసాద్‌కు ఆటో కొనిచ్చింది. దురలవాట్లకు బానిసైన కొడుకు డబ్బుల కోసం తరచూ తల్లితో గొడవ పడేవాడు. ఈ క్రమంలో తల్లిని చంపితే రైతు బీమాతోపాటు డ్వాక్రా గ్రూపు బీమా డబ్బు వస్తుందని దురాలోచన చేశాడు. భార్య కవితతో కలిసి ఆగస్టు 29 తెల్లవారుజామున నిద్రలో ఉన్న శంకరమ్మను కండువాతో ఉరివేసి హతమార్చాడు. దీనిని సహజ మరణంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించాడు. కానీ శంకరమ్మ మెడపై గాట్లు ఉండటం చూసిన ఆమె కూతుళ్లు మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు విచారించగా.. శంకరమ్మను తామే హత్య చేసినట్లు కొడుకు, కోడలు అంగీకరించారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

దుండిగల్: ఓ బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వైజాగ్‌కు చెందిన లక్ష్మీజీరావు కుమార్తె ప్రణతి (21) దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతూ కళాశాలకు చెందిన హాస్టల్‌లో ఉంటోంది. గురువారం ఉదయమే వైజాగ్ నుంచి వచ్చిన ప్రణతి రూంలోకి వెళ్లి తలుపువేసుకుంది. రూమ్‌మేట్ తలుపు తట్టగా ఎంతకీ తెరవకపోవడంతో ఈ విషయాన్ని హాస్టల్ స్టాఫ్‌కు తెలియజేసింది. వారు తలుపులు బద్దలుకొట్టి లోనికి వెళ్లి చూడగా విద్యార్థిని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించగా ప్రణతి రాసిన సూసైడ్ నోట్ లభించింది. తల్లిదండ్రుల అంచనాలకు చేరుకోలేకపోతున్నానని, అందుకే ఆత్మహత్యకు పాల్పడుతున్నానని లేఖలో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

కొత్త రాతి యుగపు మానవ ఆవాస కేంద్రం.. ఖాజాగూడ



గుట్టపై గ్రూవ్స్ చూపిస్తున్న శివనాగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్/మణికొండ: పుప్పాలగూడ- ఖాజాగూడ-లాంకోహిల్స్ ప్రాంతం వేల ఏళ్ల క్రితమే పెద్ద మానవ ఆవాస కేంద్రమని తాజాగా పరిశోధకులు గుర్తించారు. ఇక్కడి పెద్దగుట్ట మీద పదుల సంఖ్యలో కొత్త రాతి యుగపు మానవ ఆవాస కేంద్రాలు వెలుగు చూశాయి. మనుషులు తలదాచుకునేందుకు వీలుగా ఉన్న పడిగ రాయి షెల్టర్లు, వాన నీటిని నిలవ చేసుకునే భారీ రాతి గుంతలు, వాటిల్లోకి నీళ్ల జాలు వారేందుకు గుట్ట పరుపు భాగంపై స్వల్పంగా తొలచటం ద్వారా ఏర్పడ్డ కాలువలు.. వేటాడిన జంతువులను ముక్కలు చేసేందుకు, చెట్ల కొమ్మలు నరికేందుకు వినియోగించిన ఆయుధాలు మొనదేలేందుకుగాను నూరే గ్రూవ్స్ (పొడవాటి బొద్దులు-రాతిపై గుంటలు) ఈ గుట్టపై గుర్తించారు. చరిత్ర పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ఫౌండేషన్ పరిశోధక బృందంతో కలిసి గురువారం పెద్దగుట్టపై వీటిని గుర్తించారు. ఇప్పుడు వెలుగు చూసిన స్థావరంలో లభించిన ఆధారాలు 6 వేల ఏళ్ల నుంచి 4 వేల ఏళ్ల క్రితం విగా భావిస్తున్నట్టు శివనాగిరెడ్డి పేర్కొన్నారు.

పేర్లు.. పింఛను వెతలు...



ఆధార్‌లో ఒకటి.. పనిచేసిన చోట మరోటి
దంపతులకు జాయింట్ అకౌంట్ ఉండాల్సిందే..
బ్యాంకుల చుట్టూ పరుగులు..
సింగరేణి రిటైర్డ్ కార్మికులకు సీఎంపీఎఫ్ కష్టాలు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (సీఎంపీఎఫ్) విధించిన కొత్త నిబంధన కొందరు రిటైర్డ్ సింగరేణి కార్మికులకు ఇబ్బందిగా మారింది. వాస్తవానికి విశ్రాంత కార్మికుల సంక్షేమానికి సీఎంపీఎఫ్ బతికిఉన్న ప్రతీ కార్మికుడు, అతడి భార్య వివరాలు డిజిటలైజేషన్ చేయాలని ఇటీవల నిర్ణయించింది. కొందరు సింగరేణి కార్మికుల భార్యలు మరణించగా, రెండో వివాహం చేసుకున్నారు. ఇలాంటి వారి వివరాలు ఇంతవరకూ డిజిటలైజ్ కాలేదు. అందుకే, భార్యల ప్రయోజనాలు కాపాడేందుకు, వితంతువులకు పింఛన్ ఇవ్వాలన్న సదుద్దేశంతో సీఎంపీఎఫ్ ఈ కార్యక్రమాన్ని కొద్దిరోజులుగా కోల్‌బెల్ట్‌లో మొదలుపెట్టింది. రిటైరైన కార్మికులంతా జాయింట్ అకౌంట్ ఓపెన్ చేసి, ఆధార్ వివరాలు సమర్పిస్తున్నారు. ఇందు కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. తమకోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నా రు. సింగరేణి వ్యాప్తంగా రిటైర్డ్ కార్మికులు 84,808 మంది ఉన్నారు.

న్యాయపరమైన చిక్కులతోనే...

సింగరేణిలో చాలామంది కార్మికులు గతంలో అలియాస్ పేర్లతో విధులు నిర్వర్తించేవారు. అప్పట్లో యాజమాన్యం కూడా దీనిని పెద్దగా పట్టించుకోలేదు. ఈ సమస్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రభుత్వాల దృష్టిలో ఉన్నదే. తెలంగాణ ఆవిర్భవించాక రెండుపేర్లు ఉన్న కార్మికుల ప్రయోజనాలు పరిరక్షిస్తామని సీఎం హామీ ఇచ్చినా..న్యాయపరమైన చిక్కుల వల్ల కార్యరూపం దాల్చలేదు. అయితే, ఇప్పుడు సీఎంపీఎఫ్ విధించిన కొత్త నిబంధనలు రెండు పేర్లున్న సింగరేణి కార్మికుల పాలిట ప్రతికూలంగా మారాయి.

రెండు రోజులుగా తిరుగుతున్నా

జీడీకే–2గనిలో కోల్‌ఫిల్లర్‌గా పని చేసి తొమ్మిదేళ్ల కిందట రిటైర్డ్ అయ్యా. అప్పటి నుంచి పెన్షన్ తీసుకుంటున్నా. పాత రామగుండం నుంచి 2 రోజులుగా బ్యాంకుకు వచ్చి వెళ్తున్నా. ఇంకా పని కాలేదు. ఇద్దరికి బ్యాంకు అకౌంట్లు ఉండాలంటున్నారు. తర్వాతే జాయింట్ చేస్తామని చెబుతున్నారు.



ఈదునూరి శంకర్
రిటైర్డ్ కార్మికుడు

గర్రెపల్లి నుంచి వచ్చా



పిట్టల గంగయ్య
రిటైర్డ్ కార్మికుడు

జీడీకే–2ఏ గనిలో పనిచేసి 11 ఏళ్ల కిందట రిటైర్డ్ అయ్యా. మళ్లీ అన్ని పేపర్లు అడుగుతున్నారు. చేతకాకున్నా మనుమడిని పట్టుకొని బ్యాంకుకు వచ్చా. గంటల తరబడి లైన్‌లో కూర్చోవాల్సి వచ్చింది. మళ్లీ పేపర్లు అన్నీ నింపి ఫొటోలు ఇవ్వాల్సి రావడం ఆలస్యం అవుతోంది.

సింగరేణిలో పనిచేసి రిటైర్డ్ అయిన కార్మికుల్లో సుమారు 20శాతం మంది మారుపేర్లతో పనిచేశారు. వీరికి సింగరేణిలో ఒకపేరు, సొంత గ్రామంలో మరోపేరు ఉంది. వీరందరికీ మొన్నటి వరకూ రెండు ఆధార్‌కార్డులు కూడా ఉన్నాయి. కరోనా తర్వాత కేంద్రం రెండు పేర్లతో ఉన్న ఆధార్‌కార్డుల తొలగింపు మొదలు పెట్టింది. దీంతో వందలాదిమంది సింగరేణి కార్మికులు తమ ఆధార్‌కార్డులు కోల్పోవాల్సి వచ్చింది. కొందరు మారుపేరు కార్డు కోల్పోగా, మరికొందరు సొంత పేరుతో ఉన్న కార్డులు కోల్పోయారు. ప్రస్తుతం ఇదే ఇబ్బందిగా మారింది. వితంతువులకు కూడా ఇది ఇబ్బందికరంగా మారింది. అందుకే, మారుపేర్లతో ఉన్న

20 శాతం మారుపేర్లతోనే...

కార్మికులను అలియాస్ పేరుతో నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. అసలు తమకు వచ్చేది అరకొర పింఛన్ అని, దానికి ఇన్ని తిప్పలు పెట్టి తమ పొట్టకొట్టొద్దని వేడుకుంటున్నారు. ఊర్లో ఉన్న ఆస్తులు రైతుబంధు, రైతుబీమా వివిధ సంక్షేమ పథకాలకు సొంతపేరుతో ఉన్న ఆధార్‌కార్డు లింక్ అయ్యాయని, ఇప్పుడు తామేం చేయాలో తెలియని అయోమయ స్థితి నెలకొందని వాపోతున్నారు.

బొగ్గుగని కార్మిక పెన్షనర్లకు వచ్చే సొమ్ము ఇలా...(రూ.లలో)

సొమ్ము	కార్మికుల సంఖ్య
500	7651
1000	11,477
1500	6639
2000	7792
5000	13,990
10,000	9552
20,000	10,925
20,000పైన	16,782

విషాదాల్లోనూ వీడని రాఖీ బంధం



తమ్ముడికి చివరిసారిగా రాఖీ కడుతున్న సోదరి రాజవ్వ



జగన్ మృతదేహం వద్ద రోదిస్తున్న చెల్లెలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన స్కూటీ. (ఇన్‌సెట్‌లో) పోచమల్లు

- తిమ్మాపూర్‌లో రోడ్డు ప్రమాదంలో చనిపోయిన అన్న మృతదేహానికి రాఖీ కట్టిన చెల్లెళ్లు
- ముస్తాబాద్‌లో ప్రమాదవశాత్తూ బావిలో పడి మృతిచెందిన తమ్ముడికి చివరి రాఖీ కట్టిన అక్క
- అవంచలో రాఖీ కడదామని వస్తే విగతజీవిగా కనిపించిన అన్న

తిమ్మాపూర్, ముస్తాబాద్(సిరిసిల్ల), నర్సాపూర్ రూరల్: సోదరీ సోదరుల ప్రేమానురాగాలు, ఆత్మీయ బంధానికి ప్రతీక అయిన రక్షా బంధన్ రోజున గురువారం వేర్వేరు చోట్ల జరిగిన ఘటనలు, ప్రమాదాల్లో ముగ్గురు సోదరులు దుర్మరణం పాలయ్యారు. రాఖీ కడదామని ఆనందంగా పుట్టింటికి వచ్చిన చెల్లెళ్లకు అన్నల మృతి తీరని శోకాన్ని మిగల్చగా.. అంతటి విషాదంలోనూ చివరిగా మృతదేహాలకు రాఖీ కట్టి సోదరులపై తన ప్రేమాభిమానాన్ని చాటుకున్నారు. రాఖీ కట్టేందుకు తన ఇద్దరు చెల్లెళ్లు వస్తున్నారని తెలిసి పొలం నుంచి స్కూటీపై ఇంటికి బయలుదేరిన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌కు చెందిన పోచమల్లు యాదవ్ (43)ను రాజీవ్ రహదారిపై హైదరాబాద్ వైపు నుంచి కరీంనగర్ వస్తున్న కారు అతివేగంతో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. అన్న మరణవార్త విని చెల్లెళ్లు బోరున విలపిస్తూ ఇంటికి వచ్చి శవానికి చివరిసారిగా రాఖీ కట్టారు.

చివరిసారి రాఖీ కడుతున్నా.. లేరా తమ్మీ..

'లేరా తమ్మీ.. రాఖీ కట్టేందుకు వచ్చిన.. ఒక్కసారి చూడరా.. ఇది నీకు కట్టే చివరి రాఖీరా తమ్మీ..'అంటూ తమ్ముడి మృతదేహంపై పడి సోదరి గుండెలవిసేలా రోదించిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లాలో చోటు చేసుకుంది. ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన కౌలురైతు అనమేని నర్సింలు(37) బుధవారం రాత్రి పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లి గ్రామ శివారులోని వ్యవసాయబావిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం తరువాత బావిలో పడ్డట్లు గుర్తించి మృతదేహాన్ని బయటికి తీశారు. గంభీరావుపేట మండలం నర్మాలలో ఉండే సోదరి రాజవ్వకు ఈ విషయం తెలియక తన తమ్ముడు నర్సింలుకు రాఖీ కట్టేందుకు గురువారం ఉదయమే ముస్తాబాద్‌కు వచ్చింది. నర్సింలు బావిలో గల్లంతయ్యాడని తెలుసుకుని కన్నీరుమున్నీరుగా విలపించింది.

రాఖీ కడదామని వచ్చి అంత్యక్రియల్లో..

మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం అవంచ గ్రామానికి చెందిన కొండి జగన్(45)కు నర్సమ్మ, అంబిక ఇద్దరు చెల్లెళ్లు. రాఖీ పండుగ సందర్భంగా వారిద్దరూ పుట్టింటికి వచ్చారు. అయితే గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న జగన్ గురువారమే మృతి చెందడం చూసి కన్నీటి పర్యంతమయ్యారు. రాఖీ కడదామని వస్తే అన్న అంత్యక్రియలు చేయాల్సి వచ్చిందని విలపించారు.

ఈనెల 10న బీసీల సింహగర్జన: జాజుల

సాక్షి, హైదరాబాద్: బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ఈనెల 10వ తేదీన సరూర్‌నగర్ స్టేడియం మైదానంలో సింహగర్జన సభ నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. ఈ సభకు ప్రతి బీసీ కుటుంబం నుంచి ఒకరు హాజరు కావాలని పిలుపునిచ్చారు. బీసీ మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి బడుగుల డిమాండ్లను రాజకీయ పార్టీలకు తెలియజేయాలన్నారు. సింహగర్జనకు హాజరు కానున్న వారంతా ముందుగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇందులో భాగంగా గురువారం బీసీ భవన్‌లో సింహగర్జన ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

గురుకులాల ఏర్పాటుతో విప్లవాత్మక మార్పులు: మంత్రి కొప్పుల



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రారంభించిన గురుకుల విద్యాసంస్థలతో విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. జాతీయస్థాయి విద్యాసంస్థల్లో గురుకు ల విద్యార్థులు పెద్దసంఖ్యలో సీట్లు దక్కించుకుని సత్తా చాటుతున్నారని పేర్కొన్నారు. ఇటీవల గురుకుల సీవోటీ కాలేజీల్లో ఇంటర్మీడియట్ పూర్తి చేసి కేంద్రీయ సంస్థల్లో సీట్లు దక్కించుకున్న 40 మంది విద్యార్థులకు గురువారం సచివాలయంలో ల్యాప్‌టాప్‌లు అందించారు. మంత్రి మాట్లాడుతూ 2022–23 విద్యాసంవత్సరంలో ఐఐటీల్లో 62 మంది, ట్రిపుల్ ఐటీల్లో 113 మంది, ఎంబీబీఎస్‌లో 205 మంది, రాష్ట్రంలోని పలు ఇంజనీరింగ్ కాలేజీల్లో 8 వందల మంది విద్యార్థులు సీట్లు సాధించారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఒక్క కాలేజీ ఆఫ్ ఎక్సలెన్సీ(సీవోఈ) ఉండేదని, ఇప్పుడు వాటి సంఖ్య 38కి పెంచామన్నారు.

అక్కకు 95, తమ్ముడికి 85



తమ్ముడికి మిఠాయి తినిపిస్తున్న అనసూయ

సుభాష్‌నగర్: సుదీర్ఘకాలంగా మంచానికే పరిమితమైన అక్కతో రాఖీ కట్టించుకొని ఆమె ముఖంలో ఆనందం నింపాడొక తమ్ముడు. సూరారం ప్రాంతానికి చెందిన అనసూయ (95) కొంత కాలంగా అనారోగ్యంతో మంచానికే పరిమితమైంది. గురువారం రాఖీ పండుగ కావడంతో.. ఆమె సోదరుడైన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కోల ఈశ్వరయ్య (85) అక్క వద్దకు వచ్చి రాఖీ కట్టించుకున్నాడు. సోదరుడు రాఖీ కట్టించుకోవడానికి రావడంతో అనసూయ కన్నీటి పర్యంతమైంది. తమ్ముడికి మిఠాయి తినిపించి ఆశీర్వచనాలు అందజేసింది.

క్లుప్తంగా...

రిషి కేబినెట్‌లోకి మరో భారత సంతతి మహిళ



లండన్: బ్రిటన్ ప్రధాన మంత్రి రిషి సునాక్ కొత్తగాకేబినెట్‌లోకి క్లెయిర్ కౌటిన్హో(32) అనే భారత సంతతి మహిళా సభ్యురాలిని చేర్చుకున్నారు. ఇంధన భద్రత మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. హోం మంత్రి సుయెల్లా బ్రేవర్‌మెన్‌తోపాటు క్లెయిర్ పూర్వీకులు కూడా గోవాకు చెందిన వారే. రక్షణ మంత్రి బెన్ వాలెస్ రాజీనామాతో ఆ బాధ్యతలను ఇంధన మంత్రి గ్రాంట్ షాప్స్‌కి అప్పగించారు. షాప్స్ నిర్వహించిన శాఖను క్లెయిర్‌కు ఇచ్చారు. ఈస్ట్ సర్రే నుంచి పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు.

జీ20 శిఖరాగ్ర సదస్సుకు జిన్‌పింగ్ గైర్హాజరు!

న్యూఢిల్లీ: జీ20 దేశాల అధినేతల ముఖ్యమైన శిఖరాగ్ర సదస్సుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ హాజరవుతారా? లేదా? అనేది ఇంకా నిర్ధారణ కాలేదు. ఈ నెల 9, 10న ఢిల్లీలో ఈ సదస్సు జరుగనుంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బానీస్, యూకే ప్రధాన మంత్రి రిషి సునాక్ సహా వివిధ దేశాధినేతలు హాజరు కానున్నారు. భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు జిన్‌పింగ్ హాజరయ్యే అవకాశం లేదని మీడియా సంస్థలు అంచనా వేస్తున్నాయి. బదులుగా ప్రధానమంత్రి లీ కియాంగ్ రావొచ్చని తెలుస్తోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా సదస్సుకు రావడం లేదు.

'ఎక్స్'లో ఆడియో, వీడియో కాల్స్

వాషింగ్టన్: మైక్రో బ్లాగింగ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్విట్టర్'ను ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ గత ఏడాది కొనుగోలు చేశారు. అప్పటి నుంచి అందులో ఎన్నో మార్పులు చేస్తున్నారు. ట్విట్టర్ పేరును 'ఎక్స్'గా మార్చారు. పిట్ట స్థానంలో ఎక్స్ లోగోను పొందుపర్చారు. ఆదాయం పెంపే లక్ష్యంగా మరో నిర్ణయం తీసుకున్నారు. 'ఎక్స్'లో ఇకపై ఆడియో, వీడియో కాల్స్ సదుపాయం కల్పించనున్నట్లు ఎలాన్ మస్క్ ప్రకటించారు. ఫోన్ నంబర్ అవసరం లేకుండానే యూజర్లతో కాల్స్‌ను కనెక్ట్ చేసుకునే సదుపాయాన్ని తీసుకొస్తున్నట్లు తెలిపారు. ఆండ్రాయిడ్, ఐఓఎస్, డెస్క్‌టాప్ సహా వినియోగదారులంతా ఈ సదుపాయం పొందవచ్చని సూచించారు. ప్రభావవంతమైన ప్రపంచ అడ్రస్ బుక్‌కు 'ఎక్స్' వేదిక కానుందని, ఇందులో ప్రత్యేకమైన ఫీచర్లు ఉంటాయని వివరించారు. 'ఎక్స్'లో ప్రస్తుతం ట్వీట్ డెక్ సర్వీసులు ఉచితంగా అందిస్తున్నారు. వాటిని పెయిడ్ సర్వీసులుగా మారుస్తున్నట్లు ఎలాన్ మస్క్ వెల్లడించారు.

ఇచట కార్లకు ప్రవేశం లేదు!

అక్కడ అడుగు పెడితే కాల స్పృహ కనుమరుగవుతుంది. అసలు కాలమే వెనక్కు వెళ్తుంది. కార్లన్నవి మచ్చుకు కూడా కానరాని కాలం కళ్ల ముందు కనిపిస్తుంది. గుర్రపు బగ్గీలే అక్కడ ప్రధాన ప్రయాణ సాధనాలు. కొండొకచో గాడిదలు, కంచర గాడిదలు బరువులు మోస్తూ కనిపిస్తుంటాయి. కనుచూపు మేరా ఎటు చూసినా పరుచుకున్న పచ్చదనం, దానికి దీటుగా పోటీ పడుతూ పరిశుభ్రత కనువిందు చేస్తాయి.

ఎక్కడిదా ప్రాంతం? ఏమా కథ...?!

- వాటిని నిషేధించిన గ్రీకు ద్వీపం హైడ్రా
- గుర్రపు బగ్గీలు, గాడిదలే ప్రయాణ సాధనాలు
- బారులు తీరుతున్న సందర్శకులు
- అక్కడే స్థిరపడుతున్న వీఐపీలు



గ్రీస్ దేశంలో అనగనగా అదో ద్వీపం. పేరు హైడ్రా. అక్కడి ఎజియన్ సముద్రంలోని ద్వీపాల్లో ఒకటి. వాటి మాదిరిగానే స్వచ్ఛమైన జలాలకు, అందమైన ప్రకృతికి పెట్టింది పేరు. కళ్లు చెదిరే అందాలకు, ఆహ్లాదకర వాతావరణానికి, పచ్చదనానికి కాణాచి. కాకపోతే వాటిల్లో దేనికీ లేని ప్రత్యేకత హైడ్రా దీవి సొంతం. ఆ కారణంగానే అది కొన్నేళ్లుగా అంతర్జాతీయ పర్యాటకుల నోళ్లలో తెగ నానుతోంది. అదేమిటంటే... అక్కడ కార్లు తదితర మోటారు వాహనాలు పూర్తిగా నిషేధం. గుర్రాలు, కంచర గాడిదలు మాత్రమే ప్రయాణ, రవాణా సాధనాలు. ఆ మేరకు కఠిన నిబంధనలు ఏర్పాటు చేసుకోవడమే గాక వాటిని తూచా తప్పకుండా పాటిస్తోంది కూడా. అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలకు మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపు.

హైడ్రా దీవిలో అడుగు పెట్టగానే మనల్ని పలకరించేది గుర్రాలు, కంచర గాడిదలే. స్థానికుల్లో ఎవరిని చూసినా వాటి మీదే చకచకా సాగిపోతూ కనిపిస్తారు. దక్షిణాన అందాలకు ఆలవాలమైన కమీనియ అనే కుగ్రామం మొదలు పశ్చిమాన అత్యంత పారదర్శకమూ, పరిశుభ్రమైన సముద్ర జలాలలో అలరారే మండ్రాకి దాకా అంతటా ఇవే దృశ్యాలు కనిపిస్తాయి.

ఆ కాలపు దీవి

హైడ్రా మనల్ని పాత కాలానికి తీసుకెళ్లి కట్టి పడేస్తుందని అంటారు హారియట్ జర్మన్. స్థానికంగా హార్స్ ట్రెక్కింగ్ కంపెనీ నడుపుతున్న ఆమె 24 ఏళ్ల క్రితం అనుకోకుండా అమ్మతో పాటు అక్కడికి విహార యాత్రకు వచ్చారు. ఆ ప్రాంతం ఎంతగా నచ్చిందంటే, అక్కడే శాశ్వతంగా స్థిరపడిపోయారు! తర్వాత పదేళ్ల క్రితం గ్రీస్‌ను అతలాకుతలం చేసిన ఆర్థిక సంక్షోభం కారణంగా తనకు ప్రాణప్రదమైన గుర్రం క్లోనను అమ్మాల్సిన పరిస్థితి తలెత్తింది. దాంతో హార్స్ ట్రెక్కింగ్‌ను కెరీర్‌గా ఎంచుకుందామె. ఇప్పుడు గుర్రాల సంఖ్య 12కు పెరిగింది. 'కార్లు లేవు గనుక ఇక్కడ అందరి జీవితాలూ హడావుడికి దూరంగా, నింపాదిగా గడుస్తుంటాయి' అంటూ నవ్వుతారామె.

చరిత్రే కారణం

హైడ్రా దీవి 18, 19వ శతాబ్దం దాకా ప్రముఖ సముద్ర వర్తక కేంద్రంగా ఓ వెలుగు వెలిగింది. 20వ శతాబ్దంలో మోటార్ వాహనాల శకం రాకతో ఆ వైభవం మెనకపట్టు పట్టింది. ఇరుకు సందులు, రాళ్ల ప్రాంతం కావడంతో హైడ్రాలో మోటార్ వాహనాల రాకపోకలు ఎప్పుడూ కష్టతరంగానే ఉంటూ వచ్చాయి. దాంతో, వాటిని పూర్తిగా నిషేధిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన స్థానిక యంత్రాంగానికి పుట్టుకొచ్చింది. అదే ఇప్పుడు ఆ దీవిని ప్రత్యేకంగా నిలిపింది.

వీఐపీలకు విశ్రామ స్థలం

హైడ్రా దీవి అందచందాలు, కార్ల జాడే లేని ప్రత్యేకత ఎందరెందరో వీఐపీలను ఆకర్షిస్తోంది. అప్పుడెప్పుడో 1950ల్లోనే ప్రముఖ ఇటాలియన్ నటి సోఫియా లారెన్ హైడ్రాలో షూటింగ్ చేసే క్రమంలో ఆ దీవితో ప్రేమలో పడ్డారు. అక్కడే స్థిరపడ్డారు. బ్రైస్ మార్డన్, అలెక్సిస్ వెరోకస్, పనగియోసిస్ టెట్సిస్, జాన్ క్రాక్సన్ వంటి ప్రఖ్యాత చిత్రకారుల నుంచి హెన్రీ మిల్లర్ వంటి ప్రముఖ రచయితల దాకా ఎందరెందరో హైడ్రాలో ఆరామ్‌గా జీవిస్తున్నారు. కెనేడియన్ గాయకుడు, పాటల రచయిత లియోనార్డ్ కోహెన్ రాసిన అజరామర గీతం 'బర్డ్ ఆన్ ద వైర్'కు హైడ్రా దీవే స్ఫూర్తి! ఒక్క మాటలో చెప్పాలంటే హైడ్రా భూలోక స్వర్గమే అంటారాయన.

నేషనల్ డెస్క్, సాక్షి

రైల్వే బోర్డు చీఫ్‌గా జయ వర్మ సిన్హా

మొట్టమొదటి మహిళా చైర్‌పర్సన్



న్యూఢిల్లీ: రైల్వే బోర్డు మొదటి మహిళా సీఈవో, చైర్‌పర్సన్‌గా జయ వర్మ సిన్హాను గురువారం కేంద్రప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆమె రైల్వే బోర్డు సభ్యురాలి(ఆపరేషన్స్ అండ్ బిజినెస్ డెవలప్‌మెంట్)గా ఉన్నారు. ఒడిశాలోని బాలాసోర్‌లో జూన్ 2వ తేదీన 300 మందిని బలిగొన్న ఘోర రైల్వే ప్రమాద ఘటనకు సంక్లిష్ట సిగ్నలింగ్ వ్యవస్థే కారణమంటూ మీడియాతో చేసిన వ్యాఖ్యలతో ఆమె పేరు ఒక్కసారిగా వార్తల్లోకి వచ్చింది. కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ రైల్వే బోర్డు చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈవో)గా జయ వర్మ సిన్హా నియామకానికి ఆమోదముద్ర వేసిందని ప్రభుత్వం గురువారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. సెప్టెంబర్ 1న లేదా ఆ తర్వాత ఆమె బాధ్యతలు చేపడతారు. 2024 ఆగస్టు 31వ తేదీ వరకు విధుల్లో కొనసాగుతారు. అక్టోబర్ ఒకటో తేదీన జయ వర్మ సిన్హా రిటైర్ కావాల్సి ఉంది. రైల్వే బోర్డు చీఫ్‌గా పదవీ కాలం పూర్తయ్యే వరకు కొనసాగేందుకు వీలుగా ప్రభుత్వం ఆమెను తిరిగి నియమించింది. రైల్వే బోర్డు చీఫ్ అనిల్ కుమార్ లహోటి నుంచి బాధ్యతలు స్వీకరిస్తారు. అలహాబాద్ యూనివర్సిటీలో చదువుకున్న ఈమె 1988లో ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్‌లో జాయినయ్యారు. ఉత్తర, ఈశాన్య, ఆగ్నేయ రైల్వే జోన్లలో పనిచేశారు.

మొన్న... ల్యాండర్‌ను క్లిక్ మనిపించిన రోవర్



నిన్న.. రోవర్‌ను ఫొటో తీసిన ల్యాండర్



చంద్రుడిపై సల్ఫర్ నిజమే

బెంగళూరు: అత్యంత విలువైన సల్ఫర్ నిల్వలు చందమామ ఉపరితలంపై ఉన్నట్లు చంద్రయాన్–3 మిషన్ ఇప్పటికే గుర్తించింది. అయితే, ఈ విషయాన్ని మరో విభిన్నమైన పరీక్ష ద్వారా రోవర్ ప్రజ్ఞాన్ మరోసారి నిర్ధారించింది. రోవర్‌లోని అల్ఫా పార్టికల్ ఎక్స్‌–రే స్పెక్ట్రోస్కోప్(ఏపీఎక్స్‌ఎస్) సల్ఫర్‌ను స్పష్టంగా గుర్తించిందని ఇస్రో వెల్లడించింది. అంతేకాకుండా మరికొన్ని చిన్నపాటి మూలకాలను కనిపెట్టిందని తెలియజేసింది. అయితే, చంద్రుడి మట్టిలోకి సల్ఫర్ ఎలా వచ్చిందన్నది కనిపెట్టాల్సి ఉందని పేర్కొంది. అగ్నిపర్వతం పేలడం వల్ల ఏర్పడిందా? లేక గ్రహశకలాల ద్వారా వచ్చిందా? అన్నది సైంటిస్టులు తేల్చాలని వెల్లడించింది.

జాబిల్లిపై ప్రజ్ఞాన్ చక్కర్లు

చందమామ దక్షిణ ధ్రువం ఉపరితలంపై రోవర్ ప్రజ్ఞాన్ చక్కర్లు కొడుతున్న వీడియోను ఇస్రో 'ఎక్స్'లో షేర్ చేసింది.

దక్షిణాఫ్రికాలో పెను విషాదం

- జోహన్నెస్‌బర్గ్‌లోని అయిదంతస్తుల భవనంలో అగ్ని ప్రమాదం
- 73 మంది సజీవ దహనం, మరో 52 మందికి గాయాలు
- బాధితులంతా వలస జీవులే



జోహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలోని అతిపెద్ద నగరం జోహన్నెస్‌బర్గ్‌లో సంభవించిన ఘోర అగ్ని ప్రమాదంలో 73 మంది చనిపోయారు. మరో 52 మంది గాయపడ్డారు. సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్‌లో జరిగిన ఈ ఘటనలో బాధితులంతా బతుకుదెరువు కోసం వచ్చిన వలసదారులేనని అధికారులు తెలిపారు. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో భవనంలో చెలరేగిన మంటలకు కారణాలు తెలియాల్సి ఉందని చెప్పారు. ప్రమాదం విషయం తెలియగానే తమ సిబ్బంది రంగంలోకి దిగి మంటలను ఆర్పారని నగర అత్యవసర సేవల విభాగం ప్రతినిధి రాబర్ట్ ములౌడ్జి అన్నారు. భవనంలోని అయిదంతస్తుల్లోనూ మంటలు వ్యాపించాయన్నారు. అందులో చిక్కుకున్న వారిని సాధ్యమైనంత వరకు రక్షించామన్నారు. మొత్తం 73 మృతదేహాలను వెలికితీశామని చెప్పారు. మృతుల్లో ఏడుగురు చిన్నారులు కూడా ఉన్నారు. గాయపడిన, ఊపిరాడక స్పృహతప్పిన మరో 52 మందిని ఆస్పత్రులకు తరలించామన్నారు. 'భవనంలోని ప్రతి అంతస్తులోనూ అనధికారికంగా పలు నిర్మాణాలు ఉండటంతో చాలా మంది లోపలే చిక్కుకుపోయారు. దీంతో మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయి. నేరగాళ్ల ముఠాలు తిష్ట వేయడంతో భవనానికి కరెంటు, నీరు, శానిటేషన్ వసతులను మున్సిపల్ అధికారులు కట్ చేశారు. ఇవి లేకున్నా వలసదారుల కుటుంబాలు ఉంటున్నాయి. కొందరికి పిల్లలు కూడా ఉన్నారు. ఇలాంటి భవనాలు ఇక్కడ చాలానే ఉన్నాయి' అని రాబర్ట్ చెప్పారు.

'ఇండియా' భేటీ ప్రారంభం

- తొలిరోజు సాధారణ సమావేశం
- కూటమి నేతలకు ఉద్ధవ్ ఠాక్రే విందు
- నేడు రెండో రోజు కీలక సమావేశం

ముంబై: దేశంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికే తామంతా చేతులు కలిపామని విపక్ష 'ఇండియా' కూటమి నాయకులు స్పష్టం చేశారు. కూటమి సమావేశం గురువారం సాయంత్రం ముంబైలోని గ్రాండ్ హయత్ హోటల్‌లో ప్రారంభమైంది. కూటమిలోని వివిధ పార్టీల అగ్రనేతలు హాజరయ్యారు. తొలిరోజు సాధారణ సమావేశమే జరిగింది. రెండో రోజు నాటి అజెండాపై చర్చించారు. అనంతరం కూటమి నాయకులకు మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, శివసేన(ఉద్ధవ్) పార్టీ అధినేత ఉద్ధవ్ ఠాక్రే విందు ఇచ్చారు. కీలక సమావేశం శుక్రవారం జరుగనుంది. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అధికార ఎన్డీయేను ఓడించడమే ధ్యేయంగా స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను ఖరారు చేయనున్నారు. మొదటి రోజు భేటీలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ సీనియర్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, బిహార్ సీఎం నితీశ్ కుమార్, తమిళనాడు సీఎం స్టాలిన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, పంజాబ్ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు భగవంత్ మాన్, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఫరూఖ్ అబ్దుల్లా, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, రాష్ట్రీయ లోక్‌దళ్ చీఫ్ జయంత్ చౌదరి, పీడీపీ నేత మెహబూబా ముఫ్తీ తదితరులు పాల్గొన్నారు. దేశ ఐక్యతను, సార్వభౌమత్వాన్ని వెంటనే బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని లాలూ ప్రసాద్ యాదవ్ అభిప్రాయపడ్డారు. దేశ సమస్యలను పరిష్కరించడంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా సీట్ల పంపకంపై తేల్చాలని ఆప్ డిమాండ్ చేసినట్లు కేజ్రీవాల్ వెల్లడించారు.



భేటీకి వచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ

కొత్త రకం ఆక్సిజన్‌ను గుర్తించిన శాస్త్రవేత్తలు

టోక్యో: భూగోళంపై ఉన్న కోట్లాది రకాల జీవులు బతకడానికి ప్రాణవాయువు(ఆక్సిజన్) అవసరం. అంతర్జాతీయ భౌతిక శాస్త్రవేత్తల బృందం ప్రకృతిలో కొత్త రకం ఆక్సిజన్‌ను గుర్తించింది. జపాన్‌లోని టోక్యో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన యొషుకే కొండో అనే అణు భౌతిక శాస్త్రవేత్త ఆధ్వర్యంలో భౌతిక శాస్త్రవేత్తల బృందం 'ఆక్సిజన్–28' అనే కొత్తరకం ప్రాణవాయువును గుర్తించింది. ఇది ఆక్సిజన్ పరమాణువుకు సంబంధించిన ఒక ఐసోటోప్ అని సైంటిస్టులు వెల్లడించారు. ఈ ఆక్సిజన్–28 ఐసోటోప్ 20 న్యూట్రాన్‌లు, ఎనిమిది ప్రోటాన్‌లను కలిగి ఉంటుందని సమాచారం. ఇప్పటిదాకా మనకు అందుబాటులో ఉన్న ఆక్సిజన్ రకాల్లో ఇది పరిమాణంలో భారీగా ఉన్నట్లు తేల్చారు. ఈ ఆక్సిజన్ ఐసోటోప్ కొంత తక్కువ స్థిరత్వాన్ని కలిగి ఉందని గమనించారు. ప్రకృతిలో ఇది అసాధారణమైన ఆక్సిజన్ అని శాస్త్రవేత్తలు అభివర్ణిస్తున్నారు.

విద్యార్థుల ఎదుటే టీచర్‌కు తలాక్ చెప్పిన భర్త

బారాబంకీ: తరగతి గదిలో పాఠాలు చెబుతున్న టీచర్‌కు ఆమె భర్త ట్రిపుల్ తలాక్ చెప్పాడు. దీంతో, సదరు ఉపాధ్యాయినితోపాటు విద్యార్థులు షాక్‌కు గురయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని బారాబంకీలో ఆగస్టు 24న ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆమె భర్తపై కేసు నమోదు చేశారు. బారాబంకీకి చెందిన బాధితురాలికి ఫిరోజాబాద్ జిల్లాకు చెందిన మహ్మద్ షకీల్‌తో 2020లో వివాహమైంది. కొంతకాలం తర్వాత షకీల్ సౌదీ అరేబియా వెళ్లిపోయాడు. అత్తింటి వారు కట్నం తేవాలంటూ వేధించి ఆమెను బలవంతంగా పుట్టింటికి పంపారు. పుట్టింట్లో ఉంటూ ఆమె ఓ ప్రైవేట్ స్కూలులో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఈ ఏడాది జూన్ 28న సౌదీ అరేబియా నుంచి సొంతూరుకు చేరుకున్న షకీల్.. జూలై 10న బాధితురాలి వద్దకు వచ్చాడు. తనతో రావాలని కోరాడు. వెంటనే రాలేనని చెప్పడంతో ఆరు రోజుల అనంతరం తిరిగి సొంతూరుకు వెళ్లిపోయాడు. ఆగస్టు 24న తరగతి గదిలో ఉండగా వచ్చి విద్యార్థుల ఎదుటే తనకు మూడు సార్లు తలాక్ చెప్పారని బాధితురాలు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కొత్వాలీ సిటీ పోలీసులు షకీల్‌పై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. 2019లో కేంద్రం ట్రిపుల్ తలాక్ ఆచారం చట్ట విరుద్ధం, రాజ్యాంగ వ్యతిరేకమని ప్రకటించిన విషయం తెలిసిందే.

నకిలీ వెబ్‌సైట్ పట్ల అప్రమత్తంగా ఉండండి

సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ సూచన

న్యూఢిల్లీ: సైబర్ నేరగాళ్లు సుప్రీంకోర్టువెబ్‌సైట్‌ను కూడా వదిలిపెట్టలేదు. నకిలీ వెబ్‌సైట్ రూపొందించారు. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ న్యాయవాదులను, కక్షిదారులను గురువారం సూచనలు జారీ చేశారు. నకిలీ వెబ్‌సైట్ పట్ల అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సుప్రీంకోర్టు సైతం పబ్లిక్ నోటీసు జారీ చేసింది. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే వెబ్‌సైట్ లింక్‌లపై క్లిక్ చేయొద్దని, షేర్ చేయొద్దని వెల్లడించింది. అధికారిక వెబ్‌సైట్‌ను పోలిన నకిలీ వెబ్‌సైట్‌ను సైబర్ నేరగాళ్లు రూపొందించారని, యూఆర్‌ఎల్‌లో అందుబాటులో ఉంచారని తెలిపింది. ఈ వెబ్‌సైట్ ద్వారా వ్యక్తిగత, రహస్య సమాచారం సేకరించి, మోసగించే ప్రమాదం ఉందన్నారు. లాయర్ల, కక్షిదారుల వ్యక్తిగత, రహస్య సమాచారాన్ని, ఆర్థిక లావాదేవీల వివరాలను సుప్రీంకోర్టు రిజిస్ట్రీ ఎప్పుడూ కోరదని, ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని పేర్కొంది. www.sci.gov.in అనే వెబ్‌సైట్ మాత్రమే అసలైనదని స్పష్టం చేసింది. ఒకవేళ సైబర్ దాడి బారినపడితే బ్యాంకు ఆన్‌లైన్ ఖాతాల పాస్‌వర్డ్‌లు వెంటనే మార్చుకోవాలని, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సుప్రీంకోర్టు సూచించింది.

కశ్మీర్‌లో ఎన్నికలు జరిపేందుకు సిద్ధం

- రాష్ట్ర హోదా పునరుద్ధరణకు మాత్రం సమయం పడుతుంది
- సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్రం తెలిపింది. అక్కడి ఓటర్ల జాబితా దాదాపుగా పూర్తి కావచ్చిందని, ఎన్నికలకు సంబంధించిన తేదీలను ఎన్నికల సంఘం ఖరారు చేయడమే మిగిలి ఉందని పేర్కొంది. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణకు మాత్రం కొంత సమయం పడుతుందని వివరించింది. జమ్మూకశ్మీర్‌కు కేంద్ర పాలిత ప్రాంత హోదా తాత్కాలిక అంశమేనంది. ఇదే విషయాన్ని హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లోనూ ప్రకటించారని గుర్తు చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలో అయిదుగురు సభ్యుల ధర్మాసనానికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గురువారం ఈ విషయాలు వివరించారు. జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు మూడు దఫాలుగా..పంచాయతీ, మున్సిపల్, అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో జరుగుతాయన్నారు. ఓటర్ల జాబితా రూపకల్పన నెల రోజుల్లో పూర్తవుతుందని తెలిపారు. 'కేంద్ర ప్రభుత్వం జమ్మూకశ్మీర్ విషయంలో అత్యంత అసాధారణ పరిస్థితిని ఎదుర్కొంటోంది. జమ్మూకశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా పునరుద్ధరణకు కచ్చితమైన కాలపరిమితిని ప్రస్తుతానికి ఇవ్వలేం. దీనికి కొంత సమయం పట్టవచ్చు. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం' అని ఆయన వివరించారు. 'లద్దాఖ్‌కు కేంద్ర పాలిత ప్రాంత హోదా శాశ్వతం. అక్కడ లేహ్, కార్గిల్ అనే రెండు ప్రాంతాలున్నాయి. లేహ్‌లోని హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌కు ఇప్పటికే ఎన్నికలు పూర్తయ్యాయి. కార్గిల్‌లో వచ్చే నెలలో జరుగుతాయి' అని మెహతా పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ను కేంద్రం రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై 13 రోజులుగా విచారణ కొనసాగుతోంది. వీటి విచారణకు ఏర్పాటైన ఈ రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు.

ప్రభుత్వ వివరణపై అభ్యంతరం

'2018తో పోల్చి చూస్తే ఉగ్రవాద సంబంధ ఘటనలు అక్కడ 45.2 శాతం మేర, అక్రమ చొరబాట్లు 90.2 శాతం తగ్గాయి. రాళ్లు రువ్వే ఘటనలు అప్పట్లో 1,767 ఉండగా ఇప్పుడు పూర్తిగా అరికట్టారు. భద్రతాబలగాల వైపు ప్రాణనష్టం 60.9 శాతం పడిపోయింది. వేర్పాటువాద సంస్థల బంద్‌లు 2018లో 52 కాగా, ఇప్పుడవి సున్నాకు పడిపోయాయి' అంటూ అక్కడి పరిస్థితులను ధర్మాసనానికి మెహతా వివరించారు. ఈ గణాంకాలను ధర్మాసనం రికార్డు చేయడాన్ని నేషనల్ కాన్ఫరెన్స్ నేత మహ్మద్ అక్బర్ లోనె తరఫున వాదిస్తున్న సీనియర్ లాయర్ కపిల్ సిబల్ అభ్యంతరం తెలిపారు. దీనిపై సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ స్పందిస్తూ..ఆర్టికల్ 370 రద్దు విషయమై జరుగుతున్న ప్రస్తుత విచారణకు సొలిసిటర్ జనరల్ వెల్లడిస్తున్న వివరాలతో సంబంధం ఉండదని స్పష్టం చేశారు. అక్కడ ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించే చర్యలకు సంబంధించిన రోడ్‌మ్యాప్‌ను తెలుసుకుంటున్నామన్నారు.

మళ్లీ పుంజుకోనున్న రుతుపవనాలు

న్యూఢిల్లీ: నైరుతి రుతుపవనాల ప్రభావంతో దేశంలోని పలు ప్రాంతాల్లో జూన్, జూలై నెలల్లో వర్షాలు కురిశాయి. జూలైలో భారీ వర్షపాతం నమోదయ్యింది. ఆగస్టులో రుతుపవనాలు ముఖం చాటేశాయి. అయితే, అతిత్వరలో రుతుపవనాలు మళ్లీ పుంజుకొనే అవకాశం ఉందని వాతావరణ శాఖ(ఐఎండీ) గురువారం వెల్లడించింది. మధ్య, దక్షిణ భారతదేశంలో వర్షాలు కురుస్తాయని తెలియజేసింది. సెప్టెంబర్‌లో సాధారణ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపింది. 91 నుంచి 109 శాతం వర్షపాతం నమోదవుతుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒకవేళ సెప్టెంబర్‌లో భారీ వర్షాలు కురిసినా.. జూన్–సెప్టెంబర్ సీజన్‌లో సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదైనట్లేనని తెలిపారు.

ముగిసిన అమర్‌నాథ్ యాత్ర

శ్రీనగర్: 62వ వార్షిక అమర్‌నాథ్ యాత్ర గురువారంతో ముగిసింది. హిమాలయాల్లోని మంచు స్ఫటిక శివలింగం ఉన్న ఈ గుహాలయాన్ని ఈ ఏడాది 4.4 లక్షల మంది యాత్రికులు సందర్శించుకున్నారు. జూలై ఒకటో తేదీ నుంచి బల్తాల్, పహల్గామ్ మార్గాల్లో యాత్ర మొదలైంది. యాత్రికులు సహా మొత్తం 48 మంది వాతావరణ సంబంధ, సహజ కారణాలతో చనిపోగా, మరో 62 మంది గాయపడ్డారని అధికారులు చెప్పారు. యాత్ర ప్రశాంతంగా కొనసాగిందని, ఎటువంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోలేదని తెలిపారు. గత ఏడాది 3.65 లక్షల మంది యాత్రికులు అమర్‌నాథ్ యాత్రలో పాల్గొన్నారు.

పార్లమెంట్ 'ప్రత్యేక' భేటీ

▶ మొదటి పేజీ తరువాయి

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ప్రభుత్వం తలపెట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. సెప్టెంబర్ 17న ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం. ఆ మరుసటి రోజే ప్రత్యేక సమావేశాలు ప్రారంభం కానుండడం విశేషం.

కొత్త భవనంలోనే సమావేశాలు

ప్రత్యేక సమావేశాలు పార్లమెంట్ నూతన భవనంలోనే జరుగుతాయని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మే 28న ఈ కొత్త భవనాన్ని ప్రధాని మోదీ లాంఛనంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. సాధారణంగా ప్రతిఏటా మూడుసార్లు (బడ్జెట్, వర్షాకాల, శీతాకాల) పార్లమెంట్ సమావేశాలు నిర్వహిస్తుంటారు. అయితే, ఈసారి ప్రత్యేక సమావేశాల వెనుక కారణంగా ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 85 ప్రకారం.. ఏడాదిలో కనీసం రెండుసార్లు పార్లమెంట్‌ను సమావేశపరచాల్సి ఉంటుంది. రెండు భేటీల మధ్య వ్యవధి 6 నెలలకు మించరాదు. దానికి అనుగుణంగానే ప్రతిఏటా ఫిబ్రవరి–మే నెలల మధ్యలో బడ్జెట్, జూలై–ఆగస్టు మధ్య వర్షాకాల, నవంబర్–డిసెంబర్‌ల మధ్య శీతాకాల సమావేశాలను నిర్వహిస్తారు. ఈసారి ఏకంగా ఐదు రోజులపాటు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తుండడం పట్ల దేశవ్యాప్తంగా ఉత్కంఠ పెరిగిపోయింది.

పెండింగ్‌లో ఉన్న బిల్లుకు మోక్షం!

మరోవైపు సార్వత్రిక ఎన్నికల కంటే ముందే దేశంలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా పార్లమెంట్‌లో యూసీసీ బిల్లును ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. అయితే, రాజకీయ అవసరాల కోసమే బీజేపీ ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతిని తెరపైకి తీసుకొస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. అలాగే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును కూడా ఈ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు ఆస్కారం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ బిల్లు గత రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లోనే ఉండిపోయింది. వివిధ వర్గాల నుంచి ఒత్తిళ్ల నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కేంద్రం నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. చంద్రయాన్–3 మిషన్ చరిత్ర సృష్టించడం, 'అమృతకాలం'లో భారతదేశ లక్ష్యాలతోపాటు ఇతర ముఖ్యమైన అంశాలపైనా ప్రత్యేక సమావేశాల్లో చర్చ జరిగే అవకాశం ఉంది.

ప్రజల దృష్టిని మళ్లించడానికే: జైరామ్ రమేశ్

ప్రతిపక్ష 'ఇండియా' కూటమి సమావేశాలు, అదానీ గ్రూప్‌లో అక్రమాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి ఐదు రోజుల ప్రత్యేక సమావేశాల పేరిట మోదీ ప్రభుత్వం కొత్త డ్రామాకు తెర తీసిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరామ్ రమేశ్ విమర్శించారు. 'ఇండియా' కూటమి సమావేశాల వార్తలకు మీడియాలో ప్రాధాన్యం లేకుండా చేయడానికి బీజేపీ కుట్ర పన్నిందని ఆరోపించారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మూడు వారాల క్రితమే ముగిశాయని, ఇంతలోనే మళ్లీ భేటీ కావడం వెనుక మతలబు ఏమిటని నిలదీశారు. అదానీ గ్రూప్ వ్యవహారంపై విచారణ కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)ని ఏర్పాటు చేయాలంటూ పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తామని జైరామ్ రమేశ్ చెప్పారు. వినాయక చవితి ఉత్సవాలు జరిగే సమయంలోనే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడం సరైంది కాదని శివసేన(ఉద్ధవ్ ఠాక్రే) నేత ప్రియాంక చతుర్వేది అన్నారు.

ప్రత్యేక సమావేశాలు కొత్తేమీ కాదు

పార్లమెంట్ బడ్జెట్, వర్షాకాల, శీతాకాల సమావేశాలు కాకుండా, ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం అసాధారణమేమీ కాదు. 2017 జూన్ 30న అర్ధరాత్రి పార్లమెంట్‌ను సమావేశపర్చారు. వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. కానీ, ఇది లోక్‌సభ, రాజ్యసభ ఉమ్మడి సమావేశం. 50వ స్వాతంత్య్ర దినోత్సవాలను పురస్కరించుకొని 1997 ఆగస్టులో ఆరు రోజులపాటుప్రత్యేకంగా సమావేశమైంది.క్విట్ ఇండియా ఉద్యమానికి 50 ఏళ్లయిన సందర్భంగా 1992 ఆగస్టు 9న, స్వాతంత్య్ర దినోత్సవ సిల్వర్ జూబ్లీ సందర్భంగా 1972 ఆగస్టు 14–15న అర్ధరాత్రి పార్లమెంట్ ప్రత్యేక సమావేశం జరిగింది.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023



ఆర్టీసీ ఉద్యోగులూ..ఆరోగ్యం జాగ్రత్త

గ్రేటర్‌లోని ఆర్టీసీ సిబ్బంది రక్తపోటు, మధు మేహంతో పాటు కొన్ని రకాల తీవ్రమైన జబ్బులతో బాధపడుతున్నట్లు ఆర్టీసీ వైద్యుల సర్వేలో వెల్లడైంది. -8లో



కుళ్లిన పదార్థాలతో కుల్ఫీల తయారీ

కుళ్లిపోయిన పదార్థాలతో పాటు గడువు తీరిన తినుబండారాలతో కుల్ఫీల తయారీ స్థావరంపై మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేశారు. -8లో

6న జర్నలిజం, డేటాసైన్స్ ఎంట్రన్స్ ఫలితాలు

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌సీపీజీఈటీ-2023లో భాగంగా గురువారం జరిగిన ఎంఏ జర్నలిజం, ఎమ్మెస్సీ డేటా సైన్స్ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఫలితాలను ఈ నెల 6న విడుదల చేయనున్నట్లు కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 10 వరకు జరగనున్న మొదటి విడత ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు.









పచ్చదనం ఉట్టిపడేలా..

గ్రీనరీకి ప్రాధాన్యమిస్తూ భవిష్యత్ తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలని అగ్రికల్చర్ స్పెషల్ కమిషనర్ హనుమంతు గిండెగే అన్నారు. గురువారం సాయంత్రం నెక్లెస్ రోడ్డు పీపుల్స్ ప్లాజా వేదికగా ఏర్పాటు చేసిన 14వ గ్రాండ్ నర్సరీ మేళాను అగ్రోస్ ఎండీ, అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ కె.రాములుతో కలిసి ప్రారంభించారు. నర్సరీ మేళా ఈ నెల 5 వరకు అందుబాటులో ఉంటుంది. వివిధ రాష్ట్రాల నుంచి 150కి పైగా స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. - ఖైరతాబాద్



నర్సరీ మేళాను ప్రారంభిస్తున్న హనుమంతు, రాములు తదితరులు



న్యూస్‌రీల్

ఓటింగ్ శాతాన్ని పెంచాలి: వికాస్‌రాజ్

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి వికాస్‌రాజ్ సూచించారు. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జిల్లా ఎన్నికల అధికారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని సూచించారు. ఓటరు గుర్తింపు కార్డులను ముద్రించి, పంపిణీ చేయాలని కోరారు. సమావేశంలో జాయింట్ సీఈఓ అహ్మద్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లు అమయ్‌కుమార్, హరీష్, అనుదీప్, కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లి తప్పిపోయింది.. వెతికిపెట్టరూ!

- నేరేడ్‌మెట్ పోలీసులకు మహిళ ఫిర్యాదు



అల్వాల్: తన పెంపుడు పిల్లి తప్పిపోయిందని ఓ మహిళ నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ నేరేడ్‌మెట్ కాకతీయ నగర్‌లో నివాసం ఉండే మనీషా తన పెంపుడు పిల్లి గత నెల 28 సాయంత్రం నుంచి కనిపించకుండా పోయిందని, స్థానికంగా వెతికినా దాని ఆచూకీ లభించలేదని ఫిర్యాదు చేశారు. పిల్లి తెల్లటి గుండ్రటి ముఖం కలిగి ఉంటుందని, ప్రస్తుతం అది గర్భంతో ఉందని తెలిపారు. అల్లారుముద్దుగా పెంచుకునే పిల్లి తప్పిపోవడంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నానని మనీషా పేర్కొన్నారు. పిల్లిని వెంటనే వెతికి పట్టుకోవాలంటూ పోలీసులను ఆమె దీనంగా వేడుకున్నారు. దీంతో పిల్లిని పట్టుకునే వేటలో పోలీసులు నిమగ్నమయ్యారు.

రేపే 'డబుల్' పండగ!

11,700 మంది లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ

- అందజేయనున్న ప్రజాప్రతినిధులు
- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కేటీఆర్

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పేదల సొంతింటి కల సాకారం కానుంది. కళ్లలో వత్తులు వేసుకొని ఎదురు చూస్తున్న వారిలో 11,700 మందికి ఇళ్ల తాళాలు అందజేయనున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనకనుగుణంగా నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను గ్రేటర్ పరిధిలోని 24 నియోజకవర్గాల ప్రజలకు మంత్రులు తదితర ప్రజాప్రతినిధులు శనివారం పంపిణీ చేయనున్నారు. ఈ ఇళ్లున్న ప్రాంతాల్ని డిగ్నిటీ హౌసింగ్ కాలనీలుగా వ్యవహరిస్తున్నారు. ఆయా లొకేషన్లలో ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులను ఆన్‌లైన్ లక్కీడ్రా ద్వారా ఇప్పటికే ఎంపిక చేయగా, ఎవరికి ఎక్కడ.. ఏ అంతస్తులో.. ఏ ఇల్లు అనేది మరో డ్రా ద్వారా ఎంపిక చేయనున్నట్లు జీహెచ్‌ఎంసీ పేర్కొంది.



ఎవరెవరు ఎక్కడెక్కడ

కె.తారకరామారావు:



- మున్సిపల్ మంత్రి కె. తారకరామారావు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బహదూర్ పల్లిలో జరిగే పంపిణీ కార్యక్రమంలో గాజుల రామారం, బహదూర్ పల్లి, డి-పోచంపల్లి కాలనీల్లోని 1700 మందికి ఇళ్లను పంపిణీ చేస్తారు. అందులో గాజులరామారంలో నిర్మించిన 144 ఇళ్లను, బహదూర్‌పల్లిలో నిర్మించిన 356 ఇళ్లను కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 500 మందికి పంపిణీ చేస్తారు. డి-పోచంపల్లి లో నిర్మించిన 1200 ఇళ్లను కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన 200 మంది లబ్ధిదారులకు, సనత్ నగర్ నియోజకవర్గానికి చెందిన 500 మందికి, కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన 500 మంది లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.

సబితా ఇంద్రారెడ్డి:



- విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మంఖాల్-1 లొకేషన్‌లో జరిగే పంపిణీ కార్యక్రమంలో 2,230 మంది లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేస్తారు. అందులో మంఖాల్ -1లో నిర్మించిన 500 గృహాలను మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. మంఖాల్ -2 లో నిర్మించిన 1730 ఇళ్లను మలక్‌పేట్, యాకుత్‌పురా, చార్మినార్ నియోజకవర్గాల వారికి 500 ఇళ్ల చొప్పున, చాంద్రాయణగుట్ట నియోజకవర్గానికి చెందిన 230 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు.

మహ్మద్ మహమూద్ అలీ:



- హోంమంత్రి మహమూద్‌అలీ బండ్లగూడలో పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. బండ్లగూడలో 270 ఇళ్లను చాంద్రాయణగుట్ట నియోజకవర్గం వారికి, ఫరూక్‌నగర్‌లో 500 ఇళ్లను బహదూర్‌పురా నియోజకవర్గం వారికి పంపిణీ చేస్తారు.

పి.మహేందర్ రెడ్డి:



- మంత్రి పి.మహేందర్‌రెడ్డి నార్సింగిలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. నార్సింగి సర్వే నెంబర్117లో 196 ఇళ్లను, బైరాగిగూడ-2లోని 160 ఇళ్లను రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన వారికి పంపిణీ చేస్తారు.

తలసాని శ్రీనివాస్‌యాదవ్:



- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నల్లగండ్లలో లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేస్తారు. సర్వేనెంబర్ 125లోని 216 ఇళ్లు, సాయినగర్ హఫీజ్‌పేటలో 128 ఇళ్లు శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు.

తన్నీరు హరీష్ రావు:



- మంత్రి తన్నీరు హరీష్‌రావు కొల్లూరు-1 లొకేషన్‌లో 3,300 మంది లబ్ధిదారులకు ఇళ్లు పంపిణీ చేయనున్నారు. అందులో కొల్లూరు-1 కాలనీలోని 1500 ఇళ్లను ఖైరతాబాద్(200), జూబ్లీహిల్స్ (500), శేరిలింగంపల్లి (156), రాజేంద్రనగర్ (144), పటాన్ చెరు (500)నియోజకవర్గాల వారికి, అమీన్ పూర్-2 లో నిర్మించిన 1800 గృహాలను గోషామహల్(500), నాంపల్లి (500), కార్వాన్ (500), ఖైరతాబాద్ (300) నియోజకవర్గాలకు చెందిన వారికి పంపిణీ చేస్తారు.

సి.మల్లారెడ్డి:



- మంత్రి మల్లారెడ్డి అహ్మద్‌గూడలో జరిగే పంపిణీ కార్యక్రమంలో మల్కాజిగిరి, ముషీరాబాద్, సికింద్రాబాద్ నియోజకవర్గాల ప్రజలకు 500 ఇళ్ల చొప్పున 1500 మంది లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.

జి.విజయలక్ష్మి



- మేయర్ విజయలక్ష్మి ఉప్పల్ శ్రీరామ్‌నగర్‌లో ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన 500 మందికిఇళ్లను పంపిణీ చేస్తారు.

టి.పద్మారావుగౌడ్:



- డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ప్రతాపసింగారంలో ఎల్‌బీ నగర్ నియోజకవర్గానికి చెందిన 500 మందికి, అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన 500 మందికి ఇళ్లను పంపిణీ చేయనున్నారు.



ఫయాజ్

ప్రేమ కోసం వచ్చి.. పోలీసులకు చిక్కి..

బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లిన పాకిస్తానీ

- అక్కడే హైదరాబాదీ మహిళతో పరిచయం
- వివాహితులైనా తలాక్ లేకుండా ఒక్కటిగా మారి
- ఆమె నగరానికి రావడంతో అక్రమంగా వచ్చిన అతగాడు

సాక్షి, సిటీబ్యూరో: ఉత్తరప్రదేశ్‌లో సీమ హైదర్-సచిన్ మీన, ముంబైలో సంజిత కుమారీ-మహేందర్ కుమార్, మధ్యప్రదేశ్‌లో నస్రుల్లా-అంజుగా మారిన ఫాతిమా.. ఇలాంటి 'భారత్-పాక్' ప్రేమ కథే నగరంలో వెలుగు చూసింది. దుబాయ్‌లో పరిచయమై, సహజీవనం చేసిన పాతబస్తీ మహిళ కోసం ఓ పాకిస్తాన్ యువకుడు అక్రమంగా నగరానికి చేరుకుని చిక్కాడు. ఇతడిపై కేసు నమోదు చేసిన బహదూర్‌పుర పోలీసులు వివిధ కోణాల్లో విచారణ జరుపుతున్నారు.

పాతబస్తీలోని బహదూర్‌పుర పోలీసుస్టేషన్ పరిధిలో నివసించే వివాహితకు ఇద్దరు సంతానం. ఈమె కొన్నేళ్ల క్రితం బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లింది. అక్కడ ఈమె పని చేసే కార్యాలయంలోనే పాకిస్తాన్ నుంచి వచ్చిన ఫయాజ్‌తో పరిచయం ఏర్పడింది. వివాహితుడైన ఇతడి కుటుంబం పాక్‌లోనే ఉండేది. వీరి మధ్య పరిచయం ప్రేమగా మారడంతో అక్కడే వివాహం చేసుకుని కలిసి జీవించారు. నగర మహిళ ఇక్కడ ఉన్న మొదటి భర్త నుంచి తలాక్ తీసుకున్న దాఖలాలు లేవని పోలీసులు చెబుతున్నారు.

బిహార్ మీదుగా నగరానికి ఫయాజ్..

గత ఏడాది దుబాయ్ నుంచి ఈమె నగరానికి రాగా.. ఫయాజ్ పాకిస్తాన్ వెళ్లిపోయాడు. అయినప్పటికీ వీరి మధ్య సంప్రదింపులు కొనసాగడంతో ఆమె గర్భవతి అయిందనే విషయం ఫయాజ్‌కు తెలిసింది. దీంతో గతేడాది నవంబరులో హైదరాబాద్ రావడానికి సిద్ధమయ్యాడు. పాకిస్తాన్ నుంచి నేపాల్ రాజధాని ఖాట్మండు చేరుకున్న ఫయాజ్ అక్కడ నుంచి బిహార్ మీదుగా నగరానికి అక్రమంగా వచ్చాడు. ఆ మహిళతో కలిసి కిషన్‌బాగ్ ప్రాంతంలో నివసిస్తున్నాడు. ఫయాజ్ వ్యవహారం గుర్తించిన నిఘా వర్గాలు బహదూర్‌పుర పోలీసులను అప్రమత్తం చేశాయి. గురువారం ఫయాజ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇతడి వ్యవహారంలో కుట్ర సహా మరే ఇతర కోణాలు లేవని స్పష్టం చేస్తున్న పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేస్తున్నారు.

2019లోనూ ఇదే తరహా ఉదంతం..

నగరం కేంద్రంగా 2019లోనూ ఇదే తరహా ఉదంతం చోటు చేసుకుంది. పాకిస్థానీ అయిన షేక్ గుల్జార్ ఖాన్ దుబాయ్‌లో ఉండగా ఓ మిస్డ్‌కాల్ ద్వారా కర్నూలు జిల్లా గడివేములకు చెందిన మహిళతో పరిచయమైంది. భర్తను కోల్పోయిన ఆమెతో గుల్జార్ ప్రేమలో పడ్డాడు. ఆమె కోసం సౌదీ మీదుగా నకిలీ గుర్తింపు కార్డుతో భారత్‌కు చేరుకున్నాడు. అనారోగ్యం పాలు కావడంతో మళ్లీ సొంత గడ్డపై ప్రేమ పుట్టి కుటుంబంతో సహా వెళ్లిపోవాలని భావించాడు. తన సోదరుడి సలహా మేరకు కర్తార్‌పూర్ కారిడార్ మార్గంలో వెళ్లాలని ప్రయత్నించాడు. ఆ ప్రయత్నాల్లో భాగంగా హైదరాబాద్ చేరుకున్న ఇతగాడిని నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్) అధీనంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు పట్టుకున్నారు. ఫయాజ్‌ను శుక్రవారం అరెస్టు ప్రకటించే అవకాశం ఉంది.

వైరస్.. సైరన్

- నగరంలో స్వైన్‌ఫ్లూ వంటి లక్షణాలు
- పెరుగుతున్న శ్వాసకోశ వ్యాధులు
- భయం అవసరం లేదంటున్న వైద్యులు
- 5- 7 రోజుల్లో తగ్గిపోతాయని భరోసా
- కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచన

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో స్వైన్ ఫ్లూ వంటి లక్షణాలతో తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులు పెరుగుతున్నాయి. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో పెరుగుతున్న స్వైన్ ఫ్లూ కేసులు ఆందోళనకరంగా మారుతున్న నేపథ్యంలో నగరంలో ఇవి ప్రమాదకర ఘంటికలు మోగిస్తున్నాయి. జ్వరాలకు మూలమైన వైరస్ జాడ అంతుచిక్కడంలేదు. పలువురు జ్వరపీడిత రోగులకు స్వైన్ ఫ్లూ, కోవిడ్-19 రెండింటికి సంబంధించిన పరీక్షల ఫలితాలు ప్రతికూలంగా రావడంతోనే వైద్యులు వేరే గుర్తించని శ్వాసకోశ వైరస్ ప్రభావం ఉన్నట్లు సందేహిస్తున్నారు. ఇప్పటిదాకా అన్ని కేసులు వందశాతం రికవరీ రేటు సాధించడంతో భయపడాల్సిన అవసరం లేదంటున్నారు వైద్యులు.

గుర్తించాల్సి ఉంది..

నగర వైద్య నిపుణులు ప్రస్తుతం గాంధీ, ఫీవర్ హాస్పిటల్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్‌లో స్వైన్ ఫ్లూ, కోవిడ్-19, ఇన్‌ఫ్లుయంజా అన్‌ఇన్‌ఫ్లుయంజా వంటి వైరస్‌ల శ్రేణికి సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తున్నారు. 'ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. గత కొన్ని నెలలుగా, శ్వాసకోశ వ్యాధుల కేసులు వచ్చినప్పటికీ... పరీక్షల తర్వాత కరోనా వైరస్, స్వైన్ ఫ్లూ ఇన్ఫ్లుయంజాలకు ప్రతికూల ఫలితాలు వచ్చాయి. సాధారణంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తక్కువ ఆక్సిజన్ స్వీకరణ వంటి సమస్యలు ఆ తర్వాత స్వైన్ ఫ్లూ లేదా కోవిడ్-19 పాజిటివ్‌గా మారుతుంటాయి. అయితే, ఇక్కడ అలా జరగడం లేదు కాబట్టి ఇదీ మరో శ్వాసకోశ వైరస్ వల్ల కావచ్చునని సందేహిస్తున్నాం' అని గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం రాజారావు చెప్పారు.



భయం వద్దు...తీవ్రత లేదు

అంతుతెలియని వైరస్ తీవ్ర ప్రభావాలపై భయాలు అవసరం లేదని వైద్యులు అంటున్నారు.. ఇప్పటి వరకు, ఈ తరహా కేసులకు సంబంధించి 100% రికవరీ రేటు ఉంది. చికిత్స పొందిన అయిదు రోజుల్లోనే రోగులు కోలుకుంటున్నారు. అంతేకాకుండా ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గులు ఈ వైరస్‌ల మనుగడకు ప్రతికూల పరిస్థితులను సృష్టిస్తాయి, కాబట్టి ఈ సమయంలో భయాందోళన చెందాల్సిన అవసరం లేదని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ డైరెక్టర్ డాక్టర్ పి.శంకర్ అంటున్నారు. మనల్ని ప్రభావితం చేసే స్థాయిలో 200 కంటే ఎక్కువ శ్వాసకోశ వైరస్‌లు ఉన్నాయని నిపుణులు అంటున్నారు. వీటిలో ఇన్‌ఫ్లుయంజా వైరస్‌లు, రైనోవైరస్, ఎంట్రోవైరస్, కరోనా వైరస్‌లు, శ్వాసకోశ సిన్సిటియల్ వైరస్, పారాఇన్ఫ్లుయంజా వైరస్ వంటివి ఉన్నాయి. ఈ వైరస్‌లు అయిదు నుంచి ఏడు రోజులలోపు తగ్గిపోతాయి. పరీక్షల అవసరం కూడా రాదంటున్నారు ఆయన.

భారీగా లేదు...

మరోవైపు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో స్వైన్ ఫ్లూ కేసులు సమోదవుతున్నప్పటికీ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కేసుల సంఖ్య భారీగా ఏమీ లేదని అంటున్నారు. ఏదేమైనా ఈ సీజన్‌లో వైరస్‌ల విజృంభణకు పూర్తి ఆస్కారం ఉంది కాబట్టి.. జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

శుభ్రత శూన్యం!



సంప్‌ల క్లీనింగ్‌లో నిర్లక్ష్యం

- భద్రతలో సైతం డొల్లతనం
- రిజర్వాయర్ల వద్ద కుక్కల సంచారం
- ట్యాంకుల్లో పావురాల తిష్ట
- నీటి స్వచ్ఛత అనుమానమే

సాక్షి, సిటీబ్యూరో: నగర వాసులకు తాగునీటిని సరఫరా చేసే రిజర్వాయర్ల శుభ్రత లేమి ఆందోళన కలిగిస్తోంది. రిజర్వాయర్ల క్లీనింగ్‌లో జలమండలి నిర్లక్ష్యం వహిస్తోందనే ఆరోపణలున్నాయి. ఒకవైపు ప్రతినిత్యం ఎగువ వైపు నుంచి నీటి ప్రవాహంలో కలిసి వచ్చే ఒండ్రు మట్టి, ఇతరత్రా వ్యర్థాలు పేరుకుపోవడం, మరోవైపు ట్యాంకుల చుట్టూ సరైన రక్షణ కవచం మెయింటెన్ చేయకపోవడంతో అందులోని జలాలు ఎంత వరకు సురక్షితమన్న ప్రశ్న తలెత్తుతోంది. నిత్యం పలు రిజర్వాయర్ల వద్ద కుక్కలు స్వైరవిహారం, పావురాలు తిష్ట వేయడం బెంబేలెత్తిస్తోంది. జలమండలి ప్రధాన జలాశయాల నుంచి రోజువారీగా నీటిని సర్వీస్ రిజర్వాయర్లకు తరలించి అక్కడి నుంచి పైపులైన్ల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తోంది. కొన్ని రిజర్వాయర్లలోని వ్యర్థాలతో కలుషిత నీరు నల్లాల ద్వారా చేరుతూ ప్రజల అనారోగ్యానికి హేతువులుగా మారుతున్నాయి.

అడుగు భాగంలో వ్యర్థాలు..

ప్రధాన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల క్లీనింగ్ దేవుడెరుగు.. కనీసం చివరిగా నీటిని నిల్వ చేసే సర్వీస్ రిజర్వాయర్ల క్లీనింగ్‌పై నిర్లక్ష్యమే కనిపిస్తోంది. బీఐఎస్ నిబంధనల ప్రకారం ప్రతి ఆరు నెలలకోసారి గ్రౌండ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్, అండర్ లెవల్ సంప్‌లు, ట్యాంకులు తప్పనిసారిగా క్లీనింగ్ చేయాలి. అందులోని మొత్తం నీటిని ఖాళీ చేసి ఒండ్రు మట్టి, వ్యర్థాలను బయటికి తీసి పూర్తి స్థాయిలో శుభ్రం చేయాలి. కనీసం ఏడాదికి ఒకసారి కూడా శుభ్రపర్చని పరిస్థితి దాపురించింది. దీంతో అడుగు భాగంలో పేరుకుపోయిన వ్యర్థాలతో సూక్ష్మక్రిములు అభివృద్ధి చెంది నీటిని కలుషితం చేసి ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. కొన్నిసార్లు అభివృద్ధి చెందిన క్రిములు పైపులైన్ల ద్వారా నల్లా నీటిలో సరఫరా కావడం ఆందోళన కలిగిస్తోంది. పాత బస్తీలో పలు ప్రాంతాలకు నీటిని సరఫరా చేసే అత్యంత పురాతన మిస్రిగంజ్ రిజర్వాయర్ దీర్ఘకాలికంగా క్లీనింగ్ జరగని పరిస్థితి నెలకొంది. ఈ రిజర్వాయర్ పరిధిలోని నల్లా నీటిలో అప్పుడప్పుడు పురుగులు రావడం షరామామూలైంది.



సాక్షి రిపోర్ట్

భద్రత అంతంతే...

- పలు సర్వీస్ రిజర్వాయర్లు, సెక్షన్ల వద్ద భద్రత లేమి మరింత ఆందోళన గురిచేస్తోంది. ఫలితంగా కుక్కల సంచారం, ట్యాంకులో ప్రమాదాలు, సాధారణంగా మారాయి. ఉదాహరణకు బోజగుట్ట, చిలకల గూడ, భోలక్‌పూర్, మిస్రిగంజ్, ఆటోనగర్, రెడ్‌హిల్స్, రాజేంద్రనగర్ టీచర కాలనీ రిజర్వాయర్ల వద్ద కుక్కలు స్వైర విహారానికి అడ్డూ అదుపూ లేకుండా పోయింది.
- సరిగా ఆరు నెలల క్రితం చంచల్‌గూడ జైలు సమీపంలో ఉన్న రిజర్వాయర్‌లో ప్రమాదవశాత్తు ఓ కుక్క పడి చనిపోయింది. అది కుళ్లిపోయి.. నీరు దుర్వాసన వెదజల్లుతుండటంతో శాంపిల్ టేకర్ టెక్నీషియన్‌కు అనుమానం వచ్చి పరీక్షించగా అసలు విషయం బయటపడింది.
- రెండేళ్ల క్రితం ముషీరాబాద్ రిసాలగడ్డ రిజర్వాయర్‌లో కుళ్లిపోయిన ఓ వ్యక్తి మృతదేహం బయట పడింది. దాదాపు వారం రోజుల పాటు ఆ ప్రాంత ప్రజలు మృతదేహం పడి ఉన్న నీటినే తాగారు. నీటిని తాగిన వారు వాంతులు, విరేచనాలు చేసుకున్నారు. దుర్వాసన వస్తోందని ఆరోపణలు రావడం, నీటి నమూనాలు తీసిచూడటంతో అందులో మానవ అవశేషాలు బయటపడ్డాయి. ట్యాంక్‌లో పరిశీలించగా మృతదేహం కనిపించింది. దీంతో అప్పట్లో అన్ని సర్వీస్ రిజర్వాయర్ల వద్ద రౌండ్ ది క్లాక్ నిఘా పెట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా.. నిర్వహణ లేక ప్రస్తుతం అలంకారప్రాయంగా మారాయి.

రక్షణ కవచం నిర్వహణ ఏదీ?

రిజర్వాయర్ల ట్యాంకుల్లో పక్షులు దూరకుండా కనీస రక్షణ కవచం లేకుండా పోయింది. వెంటిలేషన్ నుంచి పావురాలు ట్యాంక్‌లోకి రావడం వ్యర్థాలు, రెక్కలు వదలడం, ప్రమాదవశాత్తు పడి చనిపోవడం లాంటి ఘటనలు సర్వసాధారణంగా మారాయి. దీంతో సదరు రిజర్వాయర్ల నీరు ప్రాణాంతకంగా తయారవుతోంది. గతంలో భోలక్‌పూర్ ఘటన నేపథ్యంలో అన్ని రిజర్వాయర్లకు వెంటిలేషన్ కవర్స్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టగా ఆ తర్వాత నిర్వహణ లేకుండా పోయింది. ఉదాహరణకు.. మిస్రిగంజ్, రెడ్ హిల్స్, వైశాల్ నగర్, చంచలగూడ. ఆస్మాన్‌గఢ్, శివం, ఎలుగుగట్ట, బాలాపూర్, ఆటోనగర్, జహానుమా, ఉప్పల్ తదితర ప్రాంతాల్లోని రిజర్వాయర్ల ట్యాంకులో పావురాలు తిష్ట వేయడం ఆందోళనకు గురి చేస్తోంది.

కుళ్లిన పదార్థాలతో కుల్ఫీల తయారీ

ఉప్పల్: కుళ్లిన పదార్థాలే కాకుండా గడువు తీరిన తినుబండారాలతో కుల్ఫీలు తయారు చేస్తున్న స్థావరంపై మల్కాజిగిరి ఎస్‌వోటి పోలీసులు దాడి చేసి గుట్టు రట్టు చేశారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉప్పల్ పోలీసులు తెలిపిన మేరకు.. పారిశ్రామిక వాడకు అతి దగ్గరలో ఉన్న చిలుకానగర్ మల్లికార్జున నగర్ స్థావరంగా కుల్ఫీఐస్ క్రీంల తయారీ కేంద్రం నడుస్తోంది. పసి పిల్లలు ఎంతో ఇష్టంగా తినే కుల్ఫీ ఐస్ క్రీమ్‌ను కుళ్లిన పదార్థాలతో తయారు చేయడమే కాకుండా గడువు తీరిన కెమికల్స్, ఆహార పదార్థాలతో తయారు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న మల్కాజ్‌గిరి ఎస్‌వోటి పోలీసులు గత రెండు రోజుల క్రితం చిలుకానగర్‌లో స్థావరం పై దాడి చేశారు. దాడిలో పలు అంశాలు వెల్లడి అయినట్లు తెలిపారు. చిలుకానగర్ మల్లికార్జున నగర్‌లో నివాసమండే సుశీల్(24)కు ఫలూదా, ఐస్‌క్రీం వ్యాపారం ఉంది. తక్కువ ధరకు సేకరించిన గడువు తీరిన పదార్థాలను ఫ్రిడ్జిలో దాచి ఐస్ క్రీంలు తయారు చేస్తుంటాడు. స్కూల్స్ వద్ద బండ్లు పెట్టి విక్రయిస్తుంటాడు. సమాచారం అందుకున్న ఎస్‌వోటి పోలీసులు స్థావరంపై దాడి చేసి పదార్థాలతో పాటు కెమికల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని తదుపరి విచారణ నిమిత్తం ఉప్పల్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు తరలించారు.



నిందితుడు సుశీల్, చిత్రంలో స్వాధీనం చేసుకున్న పదార్థాలు

విద్యార్థులపై శ్రీనిధి సెక్యూరిటీ సిబ్బంది దాడి

ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

పోచారం: యమ్నంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కాలేజీలో కొందరు విద్యార్థులను హాజరు శాతం తక్కువగా ఉందన్న కారణంతో డిటెయిన్ చేశారు. వీరి పక్షాన యాజమాన్యంతో మాట్లాడేందుకు ఏబీవీపీ నాయకులు గురువారం కాలేజీకి వచ్చారు. సెక్యూరిటీ సిబ్బంది వారిని లోపలికి అనుమతించకపోవడంతో ఎందుకు ఆపుతున్నారని విద్యార్థులు ప్రశ్నించారు. మీకేంది చెప్పేదంటూ సెక్యూరిటీ సిబ్బంది దాడి చేశారు. ఈ దాడుల్లో ఎం.మనోహర్‌తో పాటు ఏబీవీపీ నాయకులు సచిన్ నాయక్, కె.ఆదిత్యకు గాయాలయ్యాయి. మనోహర్ పన్ను విరిగింది. దీంతో పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో మనోహర్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఐదుగురు సెక్యూరిటీ సిబ్బంది సందీప్, రాందాస్, ప్రశాంజిత్‌దాస్, నవీన్ రోకయా, అర్జున్ సింగ్, షేక్ అబ్దుల్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



శ్రీనిధి శ్రీనిధి ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులపై దాడి చేస్తున్న సెక్యూరిటీ

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: అప్పుల బాధతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన మేరకు.. జయరామ్‌నగర్‌కు చెందిన దొండే రామ్‌కు ఒక కుమార్తె, కుమారుడు శుభమ్ సాలుంకే (22)లు ఉన్నారు. కాగా శుభమ్ పలువురి వద్ద అప్పులు చేయడంతో ఇటీవల అప్పుల వారి ఒత్తిడి తీవ్రతరమైంది. దీంతో మనస్తాపానికి గురైన శుభమ్ ఈ నెల 31వ తేది అర్ధరాత్రి చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు నిద్రలేచి చూసేసరికి వేలుడుతూ కనిపించడంతో అతన్ని కిందకు దింపి పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



శుభమ్ (ఫైల్)

ఆర్టీసీ ఉద్యోగులూ..
ఆరోగ్యం జాగ్రత్త

- సిబ్బందిని వెంటాడుతున్న జీవనశైలి వ్యాధులు
- అదనపు పనిగంటలు, మానసిక ఒత్తిడితో అనారోగ్యం
- ఉద్యోగుల ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు హెల్త్ వలంటీర్లు
- ప్రతి డిపోలో స్వచ్ఛంద కార్యకర్తలుగా ఇద్దరు కండక్టర్లు

సాక్షి, సిటీబ్యూరో: ''లెక్క ప్రకారమైతే రోజుకు ఎనిమిది గంటలు బండి నడపాలి. కానీ సిటీ ట్రాఫిక్‌లో ఏ ఒక్క రోజు కూడా సకాలంలో డిపోకు చేరుకోవడం సాధ్యం కాదు. బస్సు నడిపినంత సేపు ఎవరో తరుముతున్నట్లుగానే ఉంటుంది''. నగరంలోని ఓ ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ ఆవేదన ఇది. గ్రేటర్‌లోని 28 డిపోలకు చెందిన అనేక మంది సిబ్బందిని జీవనశైలి వ్యాధులు వెంటాడుతున్నాయి.రక్తపోటు,మధుమేహం వంటి వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు, కొన్ని రకాల తీవ్రమైన జబ్బులతోనూ సిబ్బంది బాధపడుతున్నట్లు ఆర్టీసీ వైద్యుల సర్వేలో వెల్లడైంది. గతేడాది నిర్వహించిన మెగా ఆరోగ్యశిబిరంలో కండక్టర్లు, డ్రైవర్లు, వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది నుంచి సేకరించిన నమూనాలను విశ్లేషించి మొత్తం ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితిపై ఒక నివేదికను రూపొందించారు. మొత్తం సిబ్బందిలో సుమారు 30 శాతం మంది రక్తపోటుతో బాధపడుతుండగా, 18 శాతం మంది మధుమేహంతో ఉన్నారు.అలాగే వెన్నెముక సంబంధమైన జబ్బులు, స్థూలకాయం వంటి సమస్యలతో బాధపడుతున్నవాళ్లు కూడా ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారు. మరోవైపు కొందరు కనీసం రెండు వేల మంది వివిధ రకాల దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆర్టీసీ తార్నాక ఆసుపత్రి వైద్యుల అధ్యయనంలో వెల్లడైంది.

పని భారం పెరిగింది..

నగరంలోని పలు మార్గాల్లో ఫ్లై ఓవర్లు అందుబాటులోకి వచ్చాయి. పలుచోట్ల రోడ్లను విస్తరించారు.మెట్రో రైళ్లు వినియోగంలో ఉన్నాయి. అయినప్పటికీ వాహనాల రద్దీ ఏ మాత్రం తగ్గలేదు. లక్షలాది వాహనాల నడుమ బస్సులు నడపడం ఆర్టీసీ డ్రైవర్లకు ఒక సర్కస్‌ఫీట్‌గా మారింది.దీంతో సహజంగానే ఒత్తిడికి గురవుతున్నారు. 'మధ్యాహ్నం ఒంటిగంటకు డ్యూటీ అయిపోతుందనుకుంటాం. కానీ ఒక్కోసారి మధ్యాహ్నం రెండు దాటినా బస్సులోనే ఉండాల్సి వస్తుంది.' అని కంటోన్మెంట్ డిపోకు చెందిన కండక్టర్ ఒకరు విస్మయం వ్యక్తం చేశారు. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా నిర్దేశించిన రన్నింగ్ టైమ్ ప్రకారం బస్సులను నడుపలేకపోతున్నట్లు చెప్పారు. సకాలంలో బస్సును తీసుకెళ్లాలనే ఒత్తిడి వెంటాడుతూనే ఉంటుందని కొందరు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా వివిధ కారణాల వల్ల ఉద్యోగులపైన పెరిగిన అదనపు పని వారి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. ఒక్క హైదరాబాద్‌లోనే కాకుండా, దూరప్రాంతాలకు బస్సులు నడిపే సిబ్బంది కూడా ఒత్తిడికి గురవుతున్నారు. మొత్తం సిబ్బందిలో ఏకంగా 30 శాతం రక్తపోటు బారినపడడం గమనార్హం. అనారోగ్యానికి గురవుతున్న వారిలో కండక్టర్‌లు, ఇతర విభాగాలకు చెందిన వారి కంటే డ్రైవర్లే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు.14 శాతం మంది వెన్నెముక సంబంధమైన బాధలను ఎదుర్కొంటుండగా, 15 శాతం మంది స్థూలకాయంతో ఇబ్బంది పడుతున్నారు.



ప్రతి డిపోలో ఆరోగ్య కార్యకర్తలు...

సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ఆర్టీసీ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి డిపోలో ఆరోగ్యకార్యకర్తలను నియమించారు. సిబ్బంది ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తారు. అనారోగ్యంతో బాధపడేవారిని ఆసుపత్రికి తీసుకెళ్తారు. ప్రతి రోజు విధుల్లో చేరే సమయంలో వారి ఆరోగ్యం గురించి తెలుసుకుంటారు. గుండెసంబంధిత వ్యాధులతో బాధపడేవారు. ఇతరత్రా దీర్ఘకాలిక వ్యాధులను ఎదుర్కొంటున్న వారి విషయంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండి వారికి అవసరమైన వైద్యసేవలు సకాలంలో లభించేవిధంగా చర్యలు తీసుకుంటున్నారు. ''ప్రతి డిపోలో ఇద్దరు కండక్టర్లను ఇందుకోసం ప్రత్యేకంగా నియమించాం. సిబ్బందికి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడం, అవసరమైన సహాయ సహకారాలు అందించడం వీరి విధి.'' అని ఒక అధికారి తెలిపారు. వారు ప్రతి రోజు క్రమం తప్పకుండా మందులు వేసుకొనేవిధంగా, క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించేవిధంగా ఈ ఆరోగ్య కార్యకర్తలు అప్రమత్తం చేస్తారని చెప్పారు.

నార్సింగిలో 10 కిలోల గంజాయి పట్టివేత



పోలీసులు పట్టుకున్న గంజాయి ప్యాకెట్‌లు, సెల్‌ఫోన్‌లు

మణికొండ: ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులే టార్గెట్‌గా గంజాయిని తెచ్చి అమ్ముతున్న ముఠాను నార్సింగి పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అసోం రాష్ట్రానికి చెందిన పర్బల్ గోగాయి, రతన్ బార్వా, భారత్ గోగాయి, బిట్టు గోగాయి అనే యువకులు నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని మై హోం అవతార్ అపార్ట్‌మెంట్ జంక్షన్‌లో గంజాయి అమ్ముతున్నారు. ఆ సమాచారం అందిన వెంటనే నార్సింగి ఎస్సైలు మురళి, సుకేందర్‌రెడ్డి, సిబ్బంది అక్కడకు వెళ్లి వారిని అదుపులోకి వారి వద్దనుంచి 10 కేజీల గంజాయి, 6 మొబైల్ ఫోన్‌లు, పాలిథిన్ కవర్, పిన్స్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులంతా అస్సాం రాష్ట్రానికి చెందిన వారని , వారంతా గచ్చిబౌలిలో సెక్యూరిటీ ఉద్యోగాలు చేస్తున్నారని పోలీసులు తెలిపారు. వారిని గురువారం రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

సైబర్ మోసం.. రూ.10.70 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: ప్రముఖ కంపెనీ 'డాబర్' పేరుతో నగరానికి చెందిన ఓ డీలర్‌కు టోకరా వేశారు సైబర్ నేరగాళ్లు. డీలర్ అడిగిన ఉత్పత్తులను రెండు రోజుల్లో పంపుతామని చెప్పి అందినకాడికి దోచుకున్నారు. రోజులు గడిచినా ఉత్పత్తులు రాకపోవడంతో అనుమానం వచ్చి ఆరా తీయగా..మీ నుంచి డబ్బు రాలేదు మేం ఉత్పత్తులను పంపలేదనే సమాధానం 'డాబర్' కంపెనీ నుంచి వచ్చింది. దీంతో మోసపోయామని గ్రహించి సిటీ సైబర్ క్రైం ఏసీపీ ఆర్.జి.శివమారుతికి ఫిర్యాదు చేశాడు. నగరానికి చెందిన 'డాబర్' కంపెనీ డీలర్ ఢిల్లీలోని 'డాబర్' కంపెనీ నుంచి వివిధ ఉత్పత్తులను రవాణా చేసుకుంటాడు. గత నెలలో దాదాపు రూ. 10 లక్షల మేర ఉత్పత్తులు కావాలని కంపెనీ వారిని ఫోన్ ద్వారా కోరాడు. ఏఏ ఉత్పత్తులు కావాలనేది మెయిల్ ద్వారా తెలుపుతానన్నాడు. ఈలోపే మీరు అడిగిన ఉత్పత్తులను కేవలం రెండు రోజుల్లో హైదరాబాద్‌కు పంపుతాము ఇందులో ఉన్న అకౌంట్ నెంబర్లకు డబ్బును ట్రాన్స్‌ఫర్ చేయమంటూ మెయిల్ వచ్చింది. ఒక్క క్షణం ఆలోచించకుండా డబ్బు పంపి కావాల్సిన ఉత్పత్తుల లిస్టును మెయిల్ చేశాడు. రోజులు గడుస్తున్నాయి ఉత్పత్తులు మాత్రం ఇక్కడకు రావడం లేదు. ఫోన్‌లో కంపెనీ ప్రతినిధులను సంప్రదించగా..తామేమీ మెయిల్ పంపలేదని, ఎవరో మిమ్మల్ని మోసం చేసి ఉండొచ్చు చెక్ చేసుకోమన్నారు. ఆ మెయిల్‌ని పరిశీలించగా అనామకులు పంపినట్లు గుర్తించాడు. తనకు సరుకు పంపుతామంటూ రూ. 10.70లక్షలు గుర్తు తెలియన వ్యక్తులు కాజేశారంటూ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ ఆర్.జి.శివమారుతి తెలిపారు.

కాలేజ్ లాకర్ పగులగొట్టి రూ.12.84 లక్షలు చోరీ

నాగోలు: ఇంజినీరింగ్ కాలేజీలో దొంగలు పడి కాలేజీలో ఉన్న నగదు చోరీ చేసిన ఘటన నాగోలు పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని తట్టిఅన్నారంలోని శ్రేయాస్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులను నుంచి కాలేజీ ఫీజులు, ట్యూషన్ ఫీజుల డబ్బు రూ. 12, 84 లక్షల అకౌంటెంట్ కులవల్లి రమేష్‌రావు తీసుకుని కాలేజీలోని మూడో అంతస్తులో తన లాకర్‌లో మంగళవారం సాయంత్రం భద్రపరిచాడు. అదే రోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కాలేజీలో ప్రవేశించి నగదు ఉన్న లాకర్‌ను కటర్‌తో కట్ చేసి లాకర్‌లో ఉన్న రూ. 12. 84 లక్షల నగదు చోరీ చేసుకుని పారిపోయారు. బుధవారం కాలేజ్ వెళ్లిన అకౌంటెంట్ తన గదిలోకి వెళ్లి చూసేసరికి లాకర్ పగల గొట్టి అందులో ఉన్న రూ. 12.84 లక్షల నగదు కనిపించలేదు. దీంతో బుధవారం రమేష్‌రావు నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నాగోలు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనాల అక్రమ పార్కింగ్‌లకు కారణమైన పబ్‌పై కేసు

బంజారాహిల్స్: ఇష్టానుసారంగా రోడ్డుకు రెండువైపులా అక్రమ పార్కింగ్‌లు చేయడమే కాకుండా ఇతర వాహనాలకు న్యూసెన్స్ కలిగిస్తున్న ఘటనలో జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10లోని బేబీలాన్ పబ్‌పై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. బుధవారం అర్ధరాత్రి ఈ పబ్‌కు వచ్చిన కస్టమర్లు పార్కింగ్ చేసిన వాహనాలతో ఇక్కడ ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారంఅందుకున్న జూబ్లీహిల్స్ కానిస్టేబుల్ సురేష్ సింగ్ అక్కడికి వెళ్లి చూడగా పరిమితికి మించి కస్టమర్లను ఆహ్వానించడమే కాకుండా పార్కింగ్ సౌకర్యం తగినంత లేకుండానే పెద్ద ఎత్తున వాహనాలు రాగా వాటిని నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు పక్కన పార్కింగ్ చేయించారని పబ్ మేనేజర్ సెడ్రిక్‌పై ఈ కేసు నమోదైంది. ట్రాఫిక్ సజావుగా సాగకుండా ప్రజలకు ఇబ్బందులు కలిగించిన ఘటనలో ఆయనపై ఈ కేసు నమోదు చేశారు. పార్కింగ్ సౌకర్యం తగినంత లేకుండానే ఇష్టానుసారంగా కస్టమర్లను అనుమతిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హయత్‌నగర్: ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని వేగంగా వచ్చిన ఓ లారీ ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న వ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం హయత్‌నగర్ పోలీస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఎల్‌బీనగర్ శివగంగ కాలనీకి చెందిన వివిఎస్ ప్రసాదరావు(50) తన ద్విచక్ర వాహనంపై పెద్దఅంబర్‌పేట్ వద్ద ఔటర్ రింగురోడ్డు సర్వీసు రోడ్డు వద్ద రోడ్డును దాటుతున్నాడు. అదే సమయంలో ఔటర్ రింగురోడ్డు వైపు వెలతున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో లారీ.. ప్రసాదరావు వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో అతను తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందాడు. అతని సోదరుడు వీరభద్రరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ప్రసాదరావు మృతదేహం

బీజేపీ నాయకురాలు జూటూరి కీర్తిరెడ్డిపై కేసు నమోదు

బంజారాహిల్స్: తమ ఎమ్మెల్యేపై నిరాధారమైన ఆరోపణలతో సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టి తమ మనోభావాలు దెబ్బతీశారంటూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నేత మాధవ్ భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ బీజేపీ నేత జూటూరి కీర్తిరెడ్డిపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకృష్ణానగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నేత మాధవ్ భాస్కర్ రెండు రోజుల క్రితం సోషల్ మీడియా పోస్టింగ్‌లు చేస్తుండగా ట్విట్టర్‌లో కీర్తిరెడ్డి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను ల్యాండ్‌గ్రాబర్‌గా చిత్రీకరిస్తూ పోస్టు చేసినట్లు గుర్తించారు. దాచుకోవడం, దోచుకోవడం, రౌడీయిజం ఇది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాగంటి పనితీరు అంటూ తమ మనోభావాలు దెబ్బతీసే విధంగా నిరాధారమైన పోస్టు పెట్టారని వివరించారు. ఆమెపై చర్యలు తీసుకోవాలంటూ మాధవ్ భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కీర్తిరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు



నిందితుడు శ్రీకాంత్

అబ్దుల్లాపూర్‌మెట్: దళిత బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు కిడ్నాప్‌కు యత్నించిన ఓ యువకుడికి ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.20వేల జరిమానా విధిస్తూ 9వ అదనపు స్పెషల్ పోస్కో కోర్టు న్యాయమూర్తి గురువారం తీర్పునిచ్చారు. 2017వ సంవత్సరంలో హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మజీద్‌పూర్ గ్రామంలో చోటు చేసుకున్న సంఘటనకు సంబంధించి అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ మన్మోహన్ తెలిపిన వివరాలు.. మజీద్‌పూర్ గ్రామంలో దళిత సామాజికవర్గానికి చెందిన ఓ బాలిక స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తుండగా.. 4 జనవరి 2017న పాఠశాల నుంచి సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా గ్రామానికి సమీపంలో ఉన్న కల్లు గుడిసెల వద్దకు రాగానే అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్, రమేష్‌కుమార్ కారులో వచ్చి బాలికను అడ్డుకుని కిడ్నాప్‌కు యత్నించారు. ఆ బాలిక కేకలు వేయడంతో ఆమెను అక్కడే వదిలిపెట్టి పారిపోతుండగా.. స్థానికులు పట్టుకున్నారు. బాధితు రాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసు లు నిందితులను అరెస్టు చేసి అరెస్ట్ చేసి కోర్టు సూచనమేరకు జ్యుడీషియల్ కస్టడీకి తరలించి చార్జిషీట్ దాఖలు చేశారు. ఈనెల 30న విచారణ సందర్భంగా 9వ అదనపు స్పెషల్ పోస్కో కోర్టు న్యాయమూర్తి హరీష ఈ కేసులో ఏ-2 నింధితుడిగా మండలి శ్రీకాంత్‌కు ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.20వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కాగా ఏ-1గా ఉన్న పల్లెపాటి రమేష్‌కుమార్ కొన్నిరోజుల క్రితమే మృతిచెందినట్లు తెలిపారు.

బీమా టోకరా!

- కొత్త పాలసీలు, రెన్యూవల్ పేరిట మోసాలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: బీమా పాలసీలు, రెన్యూవల్ పేరుతో వచ్చే సందేశాలు, ఫోన్ కాల్స్, లింకులకు ముందు వెనకా చూసుకోకుండా స్పందిస్తే నిండా మునిగినట్టే. బహుమతులు, ఉద్యోగాలు, బీమా బదలాయింపులు, సాంకేతిక సమస్యల సాకుతో, రెన్యూవల్ పేరుతో సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నారు. ప్రముఖ బీమా కంపెనీల పేర్లతో నకిలీ ఈ-మెయిల్స్, సందేశాలు పంపి డబ్బు కొల్లగొడుతు సంఘటనలు ఇటీవల కాలంలో పెరిగిపోయాయని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు. బాధితుల్లో ఎక్కువ మంది విద్యా వంతులు, వృద్ధులు ఉండటం గమనార్హం.

ప్రొవైడర్ల నుంచి డేటా కొనుగోలు..

బీమా వివరాలు, వాటి గడువు, ఇతరత్రా సమాచారం ఇటు పాలసీదారులకు, అటు బీమా సంస్థలకు మాత్రమే తెలుస్తాయి. సైబర్ నేరగాళ్లు ఈ వ్యక్తిగత సమాచారాన్ని అడ్డదారుల్లో కొంటున్నారు. డేటా ప్రొవైడర్లు, బ్రోకింగ్ కంపెనీలు రూ.10 వేలు ఇస్తే.. లక్షలాది మంది బీమా వివరాలను అందిస్తున్నాయి. ఇందులో పాలసీ వివరాలు, వాటి గడువు, వాహనాల నంబర్లు, వాటి ఇన్సూరెన్స్ పాలసీలు ఇలా పూర్తిగా వ్యక్తిగత వివరాలు ఉంటున్నాయి. ఈ సమాచారంతో సైబర్ నేరగాళ్లు పాలసీదారులకు ఫోన్లు, మెసేజ్‌లు చేసి కొత్త బీమా, రెన్యూవల్‌తో అధిక లాభాలు, బహుమతులు అందుకోవచ్చని నమ్మించి బ్యాంకు ఖాతా వివరాలను సేకరిస్తున్నారు. వీటితో అకౌంట్లు ఖాళీ చేసేస్తున్నారు.

జాగ్రత్తలివే..

- రెన్యూవల్, పాలసీ బదలాయింపు పేరుతో వచ్చే ఈ-మెయిల్స్, సందేశాలను నమ్మకూడదు.
- ప్రస్తుతం ఉన్న బీమా పాలసీకి బదులుగా కొత్తది తీసుకుంటే అధిక లాభాలు వస్తాయని చెప్పే మాయమాటలను విశ్వసించకూడదు.
- బీమా పాలసీలో మార్పులు చేసుకోవాల్సి వస్తే సదరు బీమా సంస్థను సంప్రదించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి.
- ఇన్సూరెన్స్ వెరిఫికేషన్ కోసమని చెప్పి మీ పాన్, ఆధార్ నంబర్లు, బ్యాంకు వివరాలను అడిగితే.. అది సైబర్ మోసమేనని గుర్తించాలి.

క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



వెంగళరావునగర్: అక్బర్‌ఫాం 11కే వీ ఫీడర్ ఎల్లారెడ్డిగూడ సబ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు బ్యాంక్ ఆఫ్ బరోడా వెనుకవైపు, పోలీస్ కోర్టు పోస్ట్, దానం నాగేందర్ అపార్ట్ మెంట్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. ప్రసాద్ యాజీ, జూబ్లీహిల్స్, కమ్మరిబస్తీ 11కేవీ ఫీడర్లు జూబ్లీహిల్స్, అయ్యప్ప సొసైటీ సబ్‌స్టేషన్ల పరిధిల్లో జరుగుతున్న మరమ్మతుల కారణంగా జూబ్లీహిల్స్ రోడ్-36, 62, 63, 64, 65, 36, 41, 55, పెద్దమ్మ టెంపుల్, కుమ్మరిబస్తీ, వినాయకనగర్, విఠల్‌రావు నగర్, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3.30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. ఉడ్స్ 11కేవీ ప్రశాసన్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు హుడా ఎన్‌క్లేవ్, అశ్వినీ లే అవుట్, డి.కె.నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఆయన వివరించారు.

నేడు హ్యాండ్లూమ్ మేళా ప్రారంభం

మోతీనగర్: మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో సెప్టెంబర్ 1 నుంచి దసరా పండగ వరకు ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్స్ మేళాను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అక్బర్‌అలీ, తాయర్ అలీ, గంగాధర్‌లో తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో తయారు చేసిన ఖాదీ వస్త్రాలతో పాటు వివిధ రకాల చీరలు, గృహోపకరణాలు, వన్ గ్రామ్ గోల్డ్ అందుబాటులో ఉన్నాయి. రోజూ ఉదయం 10.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు మేళా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ మేళాను శుక్రవారం ఉదయం 10 గంటలకు మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

వినోద్‌రెడ్డికి రాఖీలు కట్టిన సోదరీమణులు



హిమాయత్‌నగర్: రాఖీ పౌర్ణమి సందర్భంగా టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.ఆర్.జి.వినోద్‌రెడ్డికి ఆయన సోదరీమణులు శైలజ, వనజ రాఖీలు కట్టారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని ఆయన నివాసంలో రాఖీ కట్టి ఆయన ఆశీర్వాదాన్ని తీసుకున్నారు.

ప్రేమకు ప్రతిరూపం రాఖీ

లిబర్టీ: ప్రేమకు ప్రతిరూపమే రాఖీ పర్వదినం అని చైతన్య మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు గుర్రం ఇందిరారెడ్డి అన్నారు. రాఖీ పౌర్ణమిని సమాఖ్య కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యోగితారెడ్డి తదితరులు పాలొన్నారు.

ఎన్నికలకు అధికారుల సమాయత్తం!

ఎన్నికలు సమీపిస్తుండటంతో పలు శాఖల అధికారులు పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై దృష్టి కేంద్రీకరించారు. ఒక వైపు జీహెచ్ఎంసీ అధికారులు ఓటరు జాబితా, నూతన ఓటర్ల నమోదుపై ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తుండగా మరో వైపు సంబంధిత అసెంబ్లీ పరిధిలోని పోలీసులు ఆయా పోలింగ్ స్టేషన్ల వద్ద సౌకర్యాలు, శాంతి భద్రతల పరిరక్షణపై దృష్టి కేంద్రీకరించారు.



సీఎంటీసీ పోలింగ్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న బంజారాహిల్స్ ఏసీపీ సుబ్బయ్య, ఇన్‌స్పెక్టర్

- పోలింగ్ స్టేషన్లను తనిఖీలు చేసిన పోలీసులు
- భద్రత ఇతరత్రా అంశాలపై సమీక్ష
- క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారంపై ఫోకస్
- ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా ఏర్పాట్లు

పోలీస్ స్టేషన్	పోలింగ్ స్టేషన్లు	లొకేషన్లు
బంజారాహిల్స్	84	31
జూబ్లీహిల్స్	72	27
ఫిలింనగర్	78	35
పంజగుట్ట	51	31
మధురానగర్	61	28
సైఫాబాద్	08	03
ఖైరతాబాద్	40	20
బోరబండ	125	44

బంజారాహిల్స్: ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో పోలీసులు ఆయా పోలింగ్ కేంద్రాలను తనిఖీలు చేశారు. పోలింగ్ స్టేషన్ల వద్ద ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలి? శాంతి భద్రతలపరంగా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించడమే కాకుండా ఉన్నతాధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. ఎక్కడెక్కడ ఎలాంటి అవసరాలు ఉన్నాయో పరిశీలించారు. వీటి జాబితాను సంబంధిత అసెంబ్లీ ఎన్నికల అధికారులకు పంపించనున్నారు.

- ఇప్పటికే అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలింగ్ బూత్‌ల తనిఖీలు చేపట్టడం పూర్తయింది. ఓటర్లకు దగ్గరగా పోలింగ్ బూత్‌లు ఉన్నాయో లేదో పరిశీలించిన తర్వాత ఎలక్టోరల్ అధికారికి నివేదికను సమర్పించనున్నారు.
- మరో వైపు పోలింగ్ బూత్‌లలో వెలుతురు సరిగ్గా ఉందా లేదా, గేట్లు ఉన్నాయో లేదో వాటి వివరాలను కూడా నమోదు చేసుకున్నారు. అసాంఘిక శక్తులు, రౌడీ మూకలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలు పోలింగ్ స్టేషన్ చుట్టూ ఉంటూ ఎక్కడెక్కడ ఎలాంటి భద్రత చేపట్టాలో పరిశీలించారు.
- జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్‌తో పాటు ఇన్‌స్పెక్టర్ రవీంద్ర ప్రసాద్ తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించడమే కాకుండా తగిన నివేదికలు కూడా తయారు చేశారు. బందోబస్తు ఎలా ఏర్పాటు చేయాలన్నదానిపై ఈ తనిఖీల ద్వారా తెలుస్తుందని వారు తెలిపారు.
- గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని పోలింగ్ స్టేషన్లకు దారితీసే రోడ్లు, ఇతరత్రా బిల్డింగ్‌లపై మ్యాప్‌లను కూడా రూపొందిస్తున్నారు.
- ఇదిలా ఉండగా జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పోలింగ్ బూత్‌లు వస్తుండగా బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఖైరతాబాద్, నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. మధురానగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో కేవలం జూబ్లీహిల్స్, పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో కేవలం ఖైరతాబాద్ నియోజకవర్గాలు మాత్రమే కవర్ అవుతాయి. అలాగే బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఒక్క జూబ్లీహిల్స్ నియోజకవర్గం వస్తుంది. ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్ నియోజకవర్గాలు వస్తాయి.



పోలింగ్ స్టేషన్‌లను పరిశీలిస్తున్న ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ

రాజకీయ పార్టీల నాయకులతో జెడ్‌సీ సమావేశం



నాయకులతో సమావేశం అయిన వెంకటేష్ దోత్రే

బంజారాహిల్స్: ఓటరు జాబితాలో అభ్యంతరాలు, తప్పొప్పుల సవరణ, కొత్త ఓటర్లు నమోదు, ప్రత్యేక ఓటరు శిబిరాలు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో మరింత అవగాహన కలిగించేందుకు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే ఖైరతాబాద్, నాంపల్లి, గోషామహల్, కార్వాన్ నియోజక వర్గాల రాజకీయ నాయకులతో సమావేశం అయ్యారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. నూతన ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించడం జరుగుతున్నదని ఇందుకు రాజకీయ నాయకులు సంపూర్ణ సహకారం అందించాలని, ముఖ్యంగా కొత్త ఓటర్ల నమోదుపై అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనాలని వివరించారు.

పనులన్నీ సత్వరమే పూర్తి చేయాలి: ఎమ్మెల్యే మాగంటి



పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి

వెంగళరావునగర్: నియోజకవర్గాన్ని నగరంలో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు మెరుగైన వసతులు కల్పిస్తున్నామని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ ఎల్ఎన్ నగర్, యూసుఫ్‌గూడ బస్తీ, వెంకటగిరి ప్రాంతాల్లో ఆయన గురువారం పాదయాత్ర చేశారు. ఆయా ప్రాంతాల్లో రూ. 74 లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పనులన్నీ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంతోష్, నర్సింగ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలను చైతన్యం చేస్తాం



అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

పంజగుట్ట: రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని... జనాభా ప్రాతిపదికన సీట్లు మాత్రం ఇవ్వడం లేదని తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్) సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మధుగౌడ్ కక్కెర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని బీసీలకు ఐక్యం చేసేందుకు ఇప్పటికే ప్రణాళిక రూపొందించామని వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ బీసీని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తుందో ఆ పార్టీకే బీసీల మద్దతు ఇచ్చేలా బీసీల్లో చైతన్యం తీసుకొస్తామని ఆయన పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీ కులాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం సేవా సంస్థగా కొనసాగుతున్న తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్)ను త్వరలోనే రాజకీయ పార్టీగా మార్చనున్నట్లు, వచ్చే ఎన్నికల నాటికి పార్టీ రిజిస్ట్రేషన్ పూర్తిచేసి ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి తీసుకుని అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని తెలిపారు. అధికార బీఆర్ఎస్ పార్టీ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు కేవలం 20 శాతం సీట్లు ఇచ్చి మోసం చేసిందని, తక్కువ శాతం ఉన్న అగ్రకులాలకు 50కి పైగా టిక్కెట్లు ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీలు అయినా స్పందించి బీసీలకు తగు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమావేశంలో బీసీ నాయకులు నర్సింగరావు, రాజ్ గణేష్, బింగి రాములు, పి.గణపతి, లక్ష్మణ్, హైమావతి, శివకృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దానంకు రాఖీలు కట్టిన మహిళలు



ఎమ్మెల్యే దానంకు రాఖీలు కడుతున్న మహిళలు

బంజారాహిల్స్: రాఖీ పౌర్ణమి వేడుకలు గురువారం జూబ్లీహిల్స్‌లోని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ క్యాంపు కార్యాలయంలో ఘనంగా జరిగాయి. నియోజకవర్గం నలుమూల నుంచి వందలాదిగా విచ్చేసిన మహిళలు అయనకు రాఖీ కట్టి తమ సోదరభావాన్ని చాటుకున్నారు. జూబ్లీహిల్స్ దుర్గా భవానీనగర్ బస్తీకి చెందిన గిరిజన మహిళలు భారీ సంఖ్యలో విచ్చేసి ఆటపాటలతో సందడి చేశారు.

మహిళలకు చీరల పంపిణీ

బంజారాహిల్స్: రాఖీపౌర్ణమి సందర్భంగా గురువారం జూబ్లీహిల్స్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్ రెడ్డి రక్షాబంధన్ వేడుకలు నియోజక వర్గ మహిళలతో ఘనంగా జరుపుకొన్నారు. తనకు రాఖీలు కట్టిన మహిళలకు ఆయన చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న రోహిణ్‌రెడ్డి

పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ హరిప్రసాద్

బంజారాహిల్స్: పండగలు, పర్వదినాలను ప్రజలకు కుల, మతాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవాలని జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్ విజ్ఞప్తిచేశారు. గురువారం మైత్రీ కమిటీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ హరిప్రసాద్ మాట్లాడుతూ... ఈ సంవత్సరం వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండగలు ఒకే రోజు రానున్నాయన్నారు. అన్ని మతాల ప్రజలు పరమత సహనాన్ని పాటిస్తూ తమ సంస్కృతి సంప్రదాయాల మేరకు పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రవీంద్రప్రసాద్, ఎస్ఐలు, సిబ్బందితోపాటు వివిధ వర్గాల ప్రముఖులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

లిబర్టీ: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 22 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని దళిత బహుజన విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర శాఖ కో ఆర్డినేటర్ ఇటికా గణేష్ ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించాలని కోరారు. గురువారం సమాఖ్య కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేవలం ఐదు వేల టీచర్ పోస్టులకు మాత్రమే ప్రభుత్వం భర్తీ చేస్తుందని పేర్కొన్నారు. ప్రధానంగా ఆంగ్ల, గణిత, సైన్స్ వంటి కీలక పోస్టులు చాలా కాలంగా ఖాళీగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులు అనేక సంవత్సరాలుగా ఖాళీగా ఉండటం వల్ల విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేటు, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా ఆచరణలో ఉపాధ్యాయ పోస్టులు ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. 30 మంది విద్యార్థులకు ఒక్క టీచర్ ఉన్నారని ఇది హేతుబద్ధం కాదని అన్నారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

వెంగళరావునగర్: ప్రమాదకర డ్రగ్స్ విక్రయిస్తున్న ఓ వ్యక్తిని గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. మధురానగర్ పోలీసుల సమాచారం మేరకు... నిజాంపేటకు చెందిన భరత్‌ఠాకూర్(48) అనే వ్యక్తి కొంతకాలంగా కొకైన్ తదితర డ్రగ్స్‌ను ఇతరుల నుంచి తీసుకొచ్చి విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో తనకు తెలిసిన వ్యక్తులకు మాత్రం రహస్యంగా విక్రయిస్తూ వ్యాపారం కొనసాగిస్తున్నాడు. దాదాపు ఏడాదిగా మధురానగర్‌కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో గది అద్దెకు తీసుకుని డ్రగ్స్ పంపిణీ చేస్తున్నాడు. విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం వలపన్ని అతనిని పట్టుకున్నారు. అనంతరం మధురానగర్ పోలీసులకు అప్పగించారు. అతని వద్ద దాదాపు 2 గ్రాముల డ్రగ్ ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఎక్కడ నుంచి డ్రగ్ తీసుకొస్తున్నాడు... ఎవరెవరు అతనికి ఫోన్లు చేస్తుంటారు, ఎక్కడ విక్రయిస్తున్నాడనే విషయాలపై పోలీసులు కూపీ లాగుతున్నారు. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని దైవ సన్నిధానంలో శ్రావణ మాసంలో పౌర్ణమి సందర్భంగా గురువారం శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు వైభవంగా జరిగాయి. ఆలయంలో ఆధ్యాత్మికత నెలకొంది. పెద్ద సంఖ్యలో భక్తులు వేడుకల్లో పాల్గొని సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆచరించారు.



ఆనందోత్సాహాల నడుమ రాఖీ సంబురాలు



రాఖీ సంబరాల్లో ఒకే కుటుంబానికి చెందిన 30 మంది



ఇన్‌స్పెక్టర్, ఎస్ఐలకు రాఖీ కడుతున్న మహిళా కానిస్టేబుల్స్



కార్పొరేటర్ సీఎన్ రెడ్డికి రాఖీ కడుతున్న మహిళలు

శ్రీనగర్‌కాలనీ/వెంగళరావునగర్: అన్నకు చెల్లెలు రాఖీ కట్టి ఆనందించడం, ఆశీర్వాదాలు పొందటం సర్వ సాధారణమైన విషయం. అన్నా చెల్లెల్లు ఎంతో ఆనందంగా జరుపుకోవడం ఈ పర్వదిన విశేషం. ఒకే ఇంట్లో దాదాపు 30 మంది వరకు అన్నాచెల్లెళ్ల రాఖీలు కట్టుకుని వేడుకలు జరుపుకోవడం ఇంకెంత ఆనందంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. కాంగ్రెస్ పార్టీ యూసుఫ్‌గూడ డివిజన్ అధ్యక్షుడు సురేందర్‌యాదవ్ గృహంలో దాదాపు 30 మంది కుటుంబ సభ్యులు కలిసి తమ సోదరులకు రాఖీలు కట్టడం విశేషం.

- జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డికి వెంగళరావునగర్ డివిజన్ సీనియర్ నాయకురాలు జింకా అలీస్ రాఖీ కట్టి, ఆయనకు స్వీట్లు తినిపించి ఆశీర్వాదం తీసుకున్నారు.
- మధురానగర్ పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐలు ఉదయ్, సాయినాథ్‌రెడ్డిలకు మహిళా కానిస్టేబుల్స్ రాఖీలు కట్టి ఆనందం వ్యక్తం చేశారు.
- వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య భర్త విజయ్ కుమార్‌కు వివిధ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ మహిళా నేతలు రాఖీలు కట్టి తన సోదరభావాన్ని చాటుకున్నారు.

రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో...

రహమత్‌నగర్: రక్షాబంధన్ పర్వదిన వేడుకలు రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో ఘనంగా జరిగాయి. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు బోరబండ డివిజన్‌కు చెందిన మహిళలు ఆయన కార్యాలయంలో రాఖీలు కట్టి మిఠాయి తినిపించారు. మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డికి బోరబండ డివిజన్ కాంగ్రెస్‌మహిళా నాయకురాలు హజీరా సుల్తన్ రాఖీ కట్టారు. రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఆయన కార్యాలయంలో పలువురు మహిళలు రాఖీలు కట్టారు.



మాజీ ఎమ్మెల్యే విష్ణుకు రాఖీ కడుతున్న జింకా అలీస్



ఉపేందర్‌రెడ్డికి రాఖీ కడుతున్న మహిళలు



బీఆర్ఎస్ నేత విజయ్‌ముదిరాజ్‌కు రాఖీ కడుతున్న మహిళలు



బస్ డ్రైవర్‌కి రాఖీ కడుతున్న బీజేపీ నాయకురాలు అనంతలక్ష్మి

గంజాయి విక్రేత అరెస్టు



అజ్మత్‌బాబా

రహమత్‌నగర్: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న యువకుడిని బోరబండ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ సమాచారం మేరకు... ఇందిరానగర్‌కు చెందిన పాత నేరస్తుడు మహ్మద్ అజ్మత్ బాబా గంజాయి విక్రయిస్తున్నాడనే సమాచారంతో వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ ఎస్ఐ రంజిత్‌కుమార్ సిబ్బందితో కలిసి బుధవారం రాత్రి దాడి చేశారు. అజ్మత్ నుంచి 840 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఎన్‌డీపీ యాక్ట్ కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష

రహమత్‌నగర్: ఓ యువతిని వేధిస్తున్న కేసులో నిందితుడికి న్యాయస్థానం మూడు రోజుల జైలు శిక్ష విధించింది. వివరాలివీ... ఎర్రగడ్డ నేతాజీ నగర్ ప్రాంతంలో నివాసముండే ఓ అమ్మాయి మదాపూర్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తుంది. ఎస్ఆర్‌నగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉండే చల్లగొండ రోహిత్ అనే యువకుడు కొంత కాలంగా ఆ యువతిని వేధిస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రోహిత్‌పై 70 సిటీ యాక్ట్ నమోదు చేసి న్యాయస్థానంలో హాజరు పర్చారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడు రోహిత్‌కు మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని బోరబండ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ఖైరతాబాద్: ఫ్రెండ్స్‌తో కలిసి ఉంటున్న ఓ యువకుడు గదిలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... మారుతీనగర్‌లో ఎం.కళ్యాణ్‌తోపాటు ఆరుగురు స్నేహితులు కలిసి ఓ గదిలో అద్దెకు ఉంటున్నారు. కళ్యాణ్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం ఉదయం అతని రూమ్మేట్ భరత్ అతని సోదరుడు ఎం.కార్తీక్‌కు ఫోన్ చేసి కళ్యాణ్ ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపాడు. పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా...

మొక్కుబడిగా 'స్థానిక' ధ్రువీకరణ పత్రాలిస్తారా?

- తహసీల్దార్ల తీరు ఆక్షేపణీయమన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్య (ఎంబీబీఎస్, బీడీఎస్) అడ్మిషన్ల భర్తీ కోసం 'స్థానిక' ధ్రువీకరణ పత్రాల జారీలో తహసీల్దార్ల తీరు ఆక్షేపణీయమని హైకోర్టు వ్యాఖ్యానించింది. స్థానికత ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థి తెలంగాణకు చెందిన వారో.. కాదో విచారణ చేసి సర్టిఫికెట్ ఇవ్వాలి తప్ప, మొక్కుబడిగా ఇస్తే ఎలాగని ప్రశ్నించింది. ఈ విషయంలో తహసీల్దార్లకు తగిన సూచనలు చేయాలని అడ్వొకేట్ జనరల్ (ఏజీ)కు చెప్పింది. ఇతర రాష్ట్రాల్లో చదివి తిరిగి తెలంగాణకు వచ్చిన విద్యార్థులకు 'స్థానిక' ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారని, ఇందులో ఫలానా చోట రెండేళ్లుగా నివాసం ఉంటున్నారని మాత్రమే జారీ చేయడంతో వాటిని కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ఆమోదించడం లేదని పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తెచ్చిన వైద్య విద్య అడ్మిషన్ల నిబంధనల కారణంగా తెలంగాణకు చెందిన వారైనప్పటికీ సీట్లు కోల్పోతున్నారని, తల్లిదండ్రుల ఉద్యోగ, ఇతర కారణాలతో ఒకట్రెండేళ్లు పక్క రాష్ట్రాల్లో చదువుకున్న వారికి స్థానిక కోటా కింద సీటు నిరాకరించడం తగదని ఇటీవల సీజే ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకుంటే.. ఎటూ తేల్చని విధంగా ఇస్తున్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాది చెప్పారు. దీంతో స్థానికతపై స్పష్టత ఇస్తూ సర్టిఫికెట్లు జారీ చేయాలని హైకోర్టు ఆదేశించింది.

సంక్షేమంపై ఖర్చు.. భవిష్యత్తు నిర్మాణమే

- 'సాక్షి'ఇంటర్వ్యూలో విఖ్యాత జర్నలిస్టు పాలగుమ్మి సాయినాథ్
- సంక్షేమంపై అంత వ్యయం ఎందుకనే వారికి ఐదేళ్లలో ఫలితాలు అర్థమవుతాయి
- అభివృద్ధికి అసలైన నిర్వచనం మానవాభివృద్ధి.. ఏపీ రోల్ మోడల్‌గా నిలుస్తుంది
- ఆకలి, అనారోగ్యం లేని జనాభాను నిర్మించడమే నిజమైన అభివృద్ధికి నిదర్శనం
- రైతులపై ఒత్తిడి తగ్గించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చర్యలు బాగున్నాయి

(ఎం.విశ్వనాథరెడ్డి, సాక్షి ప్రతినిధి)

పరిచయం అక్కర్లేని విఖ్యాత జర్నలిస్టు.. పాలగుమ్మి సాయినాథ్! గ్రామీణ అంశాలపై ఎన్నో విస్తృత కథనాలు రాసిన అనుభవం ఆయనది. పేదరిక నిర్మూలన, ఆకలి లేని సమాజం నిర్మాణం, పేదలకు మెరుగైన ఉపాధి కల్పన, వ్యవసాయ సంక్షోభ నివారణకు మార్గాన్వేషణ, మహిళా సాధికారత లక్ష్యంగా కృషి చేశారు. ఆసియా నోబెల్‌గా భావించే రామన్ మెగసెసే అవార్డు గ్రహీత. ఇక ఆయనకు లభించిన గౌరవ డాక్టరేట్లకు కొదవే లేదు. ఇటీవల విజయవాడ వచ్చిన పాలగుమ్మి సాయినాథ్ 'సాక్షి'కి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలు ఇవీ.. **సంక్షేమాన్ని అపహాస్యం చేసే వాళ్లు చరిత్రంతా కనపడతారు..**


సంక్షేమంపై ఎక్కువ ఖర్చు పెట్టడానికి నేను అనుకూలం. సంక్షేమ కార్యక్రమాల ప్రస్తావన రాగానే ఒక వర్గం ఎగతాళిగా చూడటం, మాట్లాడటాన్ని చరిత్రలో చాలాసార్లు చూశాం. ఎంజీ రామచంద్రన్ తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టారు. అప్పుడు చాలా మంది ఎగతాళిగా మాట్లాడారు. నాలుగేళ్ల తర్వాత మధ్యాహ్న భోజన పథకానికి తమిళనాడు గ్లోబల్ రోల్ మోడల్ అని యూనిసెఫ్ ప్రశంసించింది. దశాబ్దం తిరగక ముందే దేశంలోని అన్ని రాష్ట్రాలు స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేశాయి. మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత మెరుగుపరిచి విస్తరించాల్సిన అవసరం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో ఆ ప్రయత్నం జరగడం సంతోషం. భోజనం చేసే పిల్లలంతా మన పిల్లలనే భావన పాలకులకు ఉండాలి.

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ వంతు..

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభంలో ఎలా అపహాస్యానికి గురైందో ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ కూడా అంతే. సంక్షేమం మీద ఎక్కువ ఖర్చు పెడుతున్నారని వాపోతున్న వారికి కొన్నేళ్ల తర్వాత ఈ రాష్ట్రం.. 'హ్యూమన్ డెవలప్‌మెంట్'లో రోల్ మోడల్‌గా నిలిచాక అర్థమవుతుంది. 'అభివృద్ధి'ని ఎలా అర్థం చేసుకున్నారనే అంశం మీద మనం చేస్తున్న ఖర్చును నిర్వచించాల్సి ఉంటుంది. జీడీపీ (జాతీయ స్థూల ఉత్పత్తి) పెరిగి ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందిన సమయంలో ప్రజలు ఆకలి బాధతో అల్లాడిపోతే దాన్ని అభివృద్ధి అందామా?

ఏపీ సహా కోస్టల్ రాష్ట్రాలన్నీ తక్షణం స్పందించాలి

ఆంధ్రప్రదేశ్‌లో రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. అన్నదాతలకు అనుకూలమైన చాలా కార్యక్రమాలను అమలు చేస్తోంది. అయితే ఇప్పుడు దేశంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్య వాతావరణ మార్పుల దుష్ప్రభావం. మనం తక్షణం



స్పందించి వినూత్న విధానాలను రూపొందించి అమలు చేయడం అత్యావశ్యకం. ఆంధ్రప్రదేశ్ సహా కోస్టల్ రాష్ట్రాలన్నీ తక్షణం ఈ సమస్యపై దృష్టి సారించాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే వాతావరణ మార్పుల ప్రభావాన్ని అధిగమించడానికి ఏం చేయాలనే అంశంపై అధ్యయన బాధ్యతను యూనివర్సిటీలకు అప్పజెప్పాలి.

వైఎస్సార్ కార్యక్రమాలు వినూత్నం.. ముందడుగు వేసిన సీఎం జగన్

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వ్యవసాయ సంక్షోభం నుంచి రైతులను గట్టెక్కించడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించేందుకు జయతి ఘోష్ కమిటీని నియమించారు. రైతన్నలను ఆదుకునేందుకు వినూత్న, విభిన్న కార్యాచరణకు డాక్టర్ వైఎస్సార్ శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ వారసత్వాన్ని అందుకొని ముందడుగు వేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులు ఎదుర్కొంటున్న తీవ్రమైన ఒత్తిడి నుంచి బయట పడేయటానికి చాలా చర్యలు చేపట్టారు. దేశంలో ఏ రాష్ట్రాల్లోనూ అమలు చేయని ఎన్నో కార్యక్రమాలను సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టింది. ఆర్బీకేల ఏర్పాటు మొదలు రైతు భరోసా వరకు అన్ని కార్యక్రమాలు, పథకాలు రైతులకు అనుకూలమైనవే. వాటిని మరింత కన్సాలిడేట్ చేయడం ప్రభుత్వం ముందున్న సవాల్.

మాది స్లోగన్ సర్కార్ కాదు.. సొల్యూషన్ సర్కార్

- కాంగ్రెస్, బీజేపీలు కేవలం నినాదాల పార్టీలు..
- బీఆర్‌ఎస్ మాత్రమే నినాదాలను నిజం చేసే పార్టీ
- నిమ్స్‌లో ఆయుష్ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి హరీశ్‌రావు

లక్డీకాపూల్: మాది స్లోగన్ సర్కార్ కాదు.. సొల్యూషన్ సర్కార్ అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీలు కేవలం నినాదాల పార్టీలు .. బీఆర్‌ఎస్ మాత్రమే నినాదాలను నిజం చేసే పార్టీ అని పేర్కొన్నారు. గురువారం -నిమ్స్‌లో ఏర్పాటు చేసిన ఆయుష్ ఇంటిగ్రేటెడ్ వెల్‌నెస్ సెంటర్‌ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. నకిలీ హామీలు, వెకిలి చేష్టలతో ఆ రెండు పార్టీలు ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. అమిత్ షా, ఖర్గేలు పర్యాటకుల్లా వచ్చి.. అవగాహన లేమితో ఇక్కడి నేతలు రాసిచ్చిన స్క్రిప్ట్ చదివి వెళ్లిపోయారన్నారు. గుజరాత్లో బీజేపీ గుడ్డి పాలనను దారిలో పెట్టడం చేతగాని అమిత్ షా ఇక్కడికి వచ్చి అర్థం పర్థం లేని ఆరోపణలు చేసి వెళితే ఎవరు నమ్ముతారని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో మూడు నెలలకే కాంగ్రెస్ తీరేమిటో తేలిపోయిందని, ముందుగా ఖర్గే తన సొంత రాష్ట్రాన్ని చక్కదిద్ది ఇక్కడ కొచ్చి మాట్లాడాలని సూచించారు. వివిధ పార్టీల డిక్లరేషన్లు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని..బీఆర్‌ఎస్‌కు మూడోసారి అధికారం ఇవ్వాలని ఎపుడో సెల్ఫ్ డిక్లరేషన్ చేసుకున్నారని మంత్రి పేర్కొన్నారు.

నిమ్స్‌లో ఆయుష్ ఏర్పాటు రాష్ట్రంలోనే తొలిసారి

నిమ్స్‌లో ఆయుష్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందంటూ.. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిన సీఎస్ శాంతి కుమారికి హరీశ్‌రావు అభినందనలు తెలిపారు. ఈ తరహా వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసుకోవడం రాష్ట్రంలోనే తొలిసారన్నారు. ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, సిద్ధ, ప్రకృతి వైద్యం.. అన్ని వైద్య విధానాలు ఇక్కడ ఒకే వేదికగా అందుబాటులో ఉంటాయని చెప్పారు. వికారాబాద్, భూపాలపల్లి, సిద్దిపేటల్లో 50 పడకల కొత్త ఆయుష్ ఆసుపత్రుల నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. వచ్చే నెల రెండో వారంలో మరో 9 మెడికల్ కాలేజీల్లో తరగతులు ప్రారంభం కానున్నాయని మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. దీంతో కొత్తగా 900 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వస్తాయని వివరించారు. త్వరలో మరో 8 మెడికల్ కాలేజీలు ప్రారంభించి.. ప్రతి జిల్లాకూ ఒక మెడికల్ కాలేజీ ఉన్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డ్ సృష్టించబోతుందని హరీశ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీ నామా నాగేశ్వరరావు, నిమ్స్ సంచాలకులు నగరి బీరప్ప, ఆయుష్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ నేతలను తెలంగాణ జాతి నమ్మదు: హరీశ్

బీఆర్‌ఎస్‌లోకి ఎంఆర్‌పీఎస్ నేతల చేరిక

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్, బీజేపీ నాయకులను తెలంగాణ జాతి ఎన్నటికీ నమ్మదని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు యాతాకుల భాస్కర్ గురువారం తెలంగాణ భవన్‌లో హరీశ్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఎంపీ నామా నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రవీందర్‌రావు ఆధ్వర్యంలో చేరిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ పాలిస్తున్న రాష్ట్రాల్లో మత కలహాలు, కరెంటు, నీళ్ల కష్టాలతో కొట్టుమిట్టాడుతున్నాయని విమర్శించారు. అంబేడ్కర్ చూపిన మార్గంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పయనిస్తోందని, కాంగ్రెస్, బీజేపీలకు దళితులు, గిరిజనులపై ఏ మాత్రం ప్రేమలేదన్నారు. పార్టీలో చేరిన వారిలో ఎంఆర్‌పీఎస్ నాయకులు జే.ఆర్.కుమార్, శ్రీనివాసులు, సతీష్ ఉన్నారు.



హరీశ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న భాస్కర్. చిత్రంలో ఎంపీ నామా తదితరులు

రేపు ఆదిత్య-ఎల్1 ప్రయోగం

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): సూర్యుడిపై పరిశోధనల నిమిత్తం 'ఇస్రో' శనివారం తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి పీఎస్‌ఎల్‌వీ సీ57 రాకెట్ ద్వారా ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని ప్రయోగించబోతోంది. రెండో ప్రయోగ వేదిక నుంచి శనివారం ఉదయం 11.50 గంటలకు ఈ ప్రయోగాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం శుక్రవారం ఉదయం 11.50 గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియ ప్రారంభించనున్నారు. గురువారం షార్‌లోని బ్రహ్మప్రకాష్‌హాలులో మిషన్ సంసిద్ధత సమావేశం నిర్వహించారు. పీఎస్‌ఎల్‌వీ సీ57 రాకెట్‌కు అన్ని పరీక్షలు నిర్వహించి లాంచ్ ఆథరైజేషన్ బోర్డు(ల్యాబ్)కు అప్పగించారు. ల్యాబ్ చైర్మన్ రాజరాజన్ రాకెట్‌కు మరోసారి పరీక్షలు నిర్వహించి.. కౌంట్‌డౌన్, ప్రయోగ సమయాన్ని అధికారికంగా ప్రకటించారు. సూర్యుడు ఒక మండే అగ్నిగోళం.. అక్కడికి ఉపగ్రహాన్ని పంపిస్తే కాలిపోతుంది కదా.. అనే అనుమానం చాలా మందిలో ఉంటుంది. వాస్తవానికి ఈ ప్రయోగంలో భూమి నుంచి సూర్యుడి దిశగా 15 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న లాంగ్రేజియన్ బిందువు-1(ఎల్-1) చుట్టూ ఉన్న కక్ష్యలోకి దాదాపు 1,470 కిలోల బరువున్న ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టనున్నారు. దీనివల్ల గ్రహణాలతో సంబంధం లేకుండా సౌరగోళంపై నిరంతరం అధ్యయనం చేసేందుకు అవకాశం లభిస్తుంది.



సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్‌లో సిద్ధంగా ఉన్న పీఎస్‌ఎల్‌వీ సీ57

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- సిఫారసు లేఖలకు అనుమతి లేదు, ప్రివిలేజ్డ్ దర్శనాలు రద్దు
- 18న సీఎం పట్టువస్త్రాల సమర్పణ
- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి

తిరుమల: అధికమాసం కారణంగా ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో జరిగే రెండు బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో గురువారం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 18 నుంచి 26వ తేదీ వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 15 నుంచి 23 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయన్నారు. సెప్టెంబర్ 18న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని వెల్లడించారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయన్నారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామని, వారికి సంతృప్తికరంగా వాహనసేవల దర్శనంతోపాటు మూలమూర్తి దర్శనం కల్పిస్తామని చెప్పారు. బ్రేక్ దర్శనాలకు సిఫారసు లేఖలు స్వీకరించమని, స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులను మాత్రమే అనుమతిస్తామని వివరించారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు తదితర ప్రివిలేజ్డ్ దర్శనాలను రద్దు చేసినట్టు వెల్లడించారు. శ్రీవాణి ట్రస్టు నిధులతో ఆలయాలు నిర్మించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకార ప్రాంతాల్లోని భక్తులకు రోజుకు వెయ్యి మంది చొప్పున బ్రహ్మోత్సవ దర్శనం చేయిస్తామని తెలిపారు. భక్తుల భద్రత దృష్ట్యా సెప్టెంబరు 22న గరుడసేవ నాడు ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాల రాకపోకలు రద్దు చేస్తామన్నారు.

నేటి నుంచి ఖమ్మంలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

ఖమ్మం స్పోర్ట్స్: సైన్యంలో నియామకాల కోసం అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ శుక్రవారం నుంచి ఖమ్మం జిల్లాకేంద్రంలో జరగనుంది. సర్దార్ పటేల్ స్టేడియంలో ఎనిమిది రోజులపాటు సాగే ర్యాలీలో రాష్ట్రవ్యాప్తంగా రాతపరీక్షలో అర్హత సాధించిన 7,397 మంది అభ్యర్థులకు ఫిజికల్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఇందుకోసం స్టేడియంలో చేసిన ఏర్పాట్లను కలెక్టర్ వీపీ గౌతమ్, కల్నల్ కీట్స్‌దాస్ గురువారం పర్యవేక్షించారు. మొదటిదశ పరీక్షలో ఉత్తీర్ణులైనవారు అడ్మిట్ కార్డుతోపాటు కావాల్సిన సర్టిఫికెట్లు తీసుకుని నిర్ణీత తేదీలోనే రావాలని సూచించారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే అభ్యర్థుల కోసం ఖమ్మం రైల్వేస్టేషన్, బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.


నగర వార్తలు

కనులపండువగా శ్రీవారి అధ్యయనోత్సవాలు



వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి అధ్యయనోత్సవాలు గురువారం కనుల పండువగా ప్రారంభం అయ్యాయి. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకల్లో భాగంగా గురువారం సాయంత్రం శ్రీ స్వామివారి పల్లకీ సేవ, ఆళ్వార్ల సేవ అనంతరం అధ్యయనోత్సవం ప్రారంభమైంది. ఆరగింపుతో వేడుకలు ముగిశాయి. ఆలయ ఈవో ఎస్. లావణ్య కార్యక్రమంలో పాల్గొని శ్రీ వారికి విశేష పూజలు నిర్వహించారు.

ప్రొఫెసర్ నాగేశ్వర్‌కు వీడ్కోలు



ఉస్మానియా యూనివర్సిటీ: ఆర్ట్స్ కాలేజీ జర్నలిజం విభాగం అధ్యాపకులు ప్రొఫెసర్ నాగేశ్వర్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఓయూ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు ఆయనకు వీడ్కోలు పలికారు. గురువారం జరిగిన కార్యక్రమంలో జర్నలిజం విభాగం హెడ్ ప్రొఫెసర్ స్టీవెన్‌సన్, డీన్లు, ఇతర అధికారులు, పరిశోధన విద్యార్థులు, నాన్‌టీచింగ్ స్టాఫ్ ప్రొఫెసర్ నాగేశ్వర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువతో సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఓయూ అధ్యాపకుడిగానే కాకుండా మంచి వక్తగా, రాజకీయ విశ్లేషకుడిగా గుర్తింపు పొందిన నాగేశ్వర్ ఎమ్మెల్సీగా ప్రజలకు ఎంతో సేవ చేశారని పలువురు పేర్కొన్నారు.

30 వరకు ఓయూ దూరవిద్య ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, ఇతర కోర్సుల్లో ప్రవేశాలకు సెప్టెంబర్ 30వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ జి.బి.రెడ్డి గురువారం తెలిపారు. ఆగస్టు 31తో గడువు ముగియగా విద్యార్థుల అభ్యర్థన మేరకు గడువును పొడిగించినట్లు ఆయన వెల్లడించారు.

గురు విశ్వస్ఫూర్తి బోధనలు విశ్వవ్యాప్తం చేయాలి

- తెలుగు విశ్వవిద్యాలయం దృశ్య, శ్రవణ విభాగం సంచాలకులు ఐనంపూడి శ్రీలక్ష్మి



జ్యోతిని వెలిగిస్తున్న ఐనంపూడి శ్రీలక్ష్మి, ఎన్వీ హనుమంతరావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గురు విశ్వస్ఫూర్తి బోధనలు, ఆచారాలు, సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలుగు విశ్వవిద్యాలయం దృశ్యశ్రవణ విభాగం సంచాలకులు ఐనంపూడి శ్రీలక్ష్మి అన్నారు. గురువారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, మానవతా ధార్మిక సంస్థ స్ఫూర్తి కుటుంబం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక విశ్వగురువు, సైంటిఫిక్ సెయింట్ గురు విశ్వస్ఫూర్తి దివ్య ఆశీస్సులతో శ్రావణ పూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ ప్రొఫెసర్ వి.విష్ణుదేవ్, స్ఫూర్తి కటుంబ ట్రస్టీలు రాజేష్, డాక్టర్ నాగేశ్వరి, శివ, వెంకట్, చిలుకూరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీలక్ష్మి మాట్లాడుతూ... సర్వ మానవ సమానత్వం, సౌభ్రాతృత్వాలే ధ్యేయంగా ఆధ్యాత్మిక కుసుమాలను అందించిన అభినవ ఆధ్యాత్మిక ధన్వంతరి గురు విశ్వస్ఫూర్తి అని అన్నారు. విశ్వస్ఫూర్తి ఆధ్యాత్మిక శక్తి ఎంతో గొప్పదని, ఆధునిక ఆధ్యాత్మికవేత్త చిన్నతనంలోనే ధ్యానాన్ని ఆచరిస్తూ అకుంఠిత దీక్షా తపస్సు కొనసాగించి, విశ్వమూలాన్ని చేరి, నేడు విశ్వజ్ఞానాన్ని సమాజానికి అందించిన గొప్ప వ్యక్తి అని అన్నారు. సనాతన ధర్మంలోని విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. దూరదర్శన్ కేంద్రం విశ్రాంత అధికారి, సాహితీవేత్త ఎన్వీ హనుమంతరావు ధ్యానం మనిషి ఆ పరమాత్మవైపు దృష్టిని మళ్లించేలా చేస్తుందన్నారు. చిన్ననాటి నుంచే పిల్లల్లో ఆధ్యాత్మిక భావాలను నేర్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ ప్రొఫెసర్ వి.విష్ణుదేవ్ మాట్లాడుతూ... ఆధ్యాత్మిక శక్తితో జీవితాన్ని ఎంతో శక్తివంతంగా మార్చుకోవచ్చన్నారు. విశ్వగురు విశ్వస్ఫూర్తి చేసిన రచనలను అందరికీ తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పుస్తకాలన్ని అందరినీ ఆలోచింపచేసే 40పైచిలుకు గ్రంథాలున్నాయని, ఇవి నేటి తరానికి ఎంతో స్ఫూర్తివంతంగా నిలుస్తాయన్నారు.

ఆదిభట్ల కళాపీఠం వార్షికోత్సవాలు ప్రారంభం





కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం, హరికథ చెపుతున్న సినీ నటి కరాటే కళ్యాణి

పంజగుట్ట: శ్రీ ఆదిభట్ల కళాపీఠం ఆధ్వర్యంలో, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసరవేణ్యుల 159వ జయంతి, శ్రీ ఆదిభట్ల కళాపీఠం 12వ వార్షికోత్సవం సందర్భంగా హరికథా త్రిరాత్ర మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పంజగుట్టలోని టోపాజ్ బిల్డింగ్‌లోని వైస్సో ప్రొఫెషనల్ అసోసియేషన్‌లో శనివారం వరకు కార్యక్రమం కొనసాగుతుందని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. పడాల ధీరజ్ చంద్ర, పడాల విజయలక్ష్మీ బృందంచే సంకీర్తనా గానం నిర్వహించగా ఆదిభట్ల నారాయణదాస విరచిత యదార్థ రామాయణ మండలి విశ్వామిత్ర యాగరక్షణ బాలకాండ హరికథా గానం విశేషంగా ఆకట్టుకుంది. మధ్యాహ్నం అభిషేక్, షణ్ముఖ్, రమేష్ బృందంచే సంకీర్తనాగానం, ఆధ్యాత్మికవేత్తలు రాధామనోహర్ స్వామి, స్వామి కమలేష్ మహారాజ్ల ఆతీ్మయ ధర్మసమ్మేళనం, రుక్మిణీ కల్యాణం హరికథాగానం నిర్వహిస్తున్నట్లు ఆదిభట్ల కళాపీఠం వ్యవస్థాపకురాలు, సినీ నటి పడాల కళ్యాణి తెలిపారు. అంతకుముందు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ మాల్యాద్రి, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, కార్యదర్శి పండరీనాథ్, ప్రచార ప్రముఖ్ పడాకుల బాలస్వామి, మా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ప్రముఖ నటుడు రఘుబాబు, హిందూ సేవా సమితి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు రాధాకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మన సంస్కృతి, సంప్రదాయలు కాపాడేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.

సైఫాబాద్ సైన్స్ కాలేజీకి 50 కంప్యూటర్ల వితరణ

బంజారాహిల్స్: సైఫాబాద్ సైన్స్ కాలేజీకి ఆ కళాశాల పూర్వ విద్యార్థి, టీఎస్ఐఐసీ వైస్ చైర్మన్ వెంకట్ నర్సింహారెడ్డి 50 కంప్యూటర్లను విరాళంగా అందించారు. రూ. 30 లక్షల విలువ చేసే ఈ కంప్యూటర్లను గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.లక్ష్మణ్ నాయక్‌కు అందజేశారు. ఓయూ వీసీ రవీందర్ చొరవతో కళాశాలలో ఈ విద్యా సంవత్సరం మూడు కొత్త కోర్సులు ప్రవేశ పెట్టారు. రానున్న కాలంలో ఆయా కోర్సులకు మంచి భవిష్యత్ ఉండటంతో వెంకట్ నర్సింహారెడ్డి విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సదరు కంప్యూటర్లను అందజేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని విరాళాలు సేకరించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తామని లక్ష్మణ్ నాయక్ వెల్లడించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవనీత, డాక్టర్ జగదీష్, బాలకృష్ణ, డాక్టర్ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



నర్సింహారెడ్డిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్

మధుశేఖర్‌కు ప్రతిష్టాత్మకమైన పదవి భేష్

- మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, హరీష్‌రావు



మధుశేఖర్‌ను అభినందిస్తున్న మంత్రులు హరీష్‌రావు, ప్రశాంత్‌రెడ్డి

వెంగళరావునగర్: రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన పదవి డాక్టర్ మధుశేఖర్‌కు రావడం ఎంతో అభినందించదగ్గ విషయమని రాష్ట్ర మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, హరీష్‌రావు పేర్కొన్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్‌గా డాక్టర్ మధుశేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి హాజరైన మంత్రులు హరీష్‌రావు, ప్రశాత్‌రెడ్డిలు తొలుత ఆయనను చాంబర్‌లో అభినందించారు. అనంతరం జరిగిన సభలో మంత్రులు మాట్లాడుతూ... కొందరికి పదవులు వన్నె తెస్తాయని, మరికొంత మంది వల్ల పదవులకే వన్నె వస్తుందని ఇలాంటి అరుదైన వ్యక్తుల్లో శేఖర్ ఒకరని అన్నారు. డాక్టర్ మధుశేఖర్ మాట్లాడుతూ... తనకు చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించిన సీఎంతోపాటు సహకరించిన మంత్రులు, ఎమ్మెల్యేలకు రుణపడి ఉంటానన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు మధుశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వరరావు, మహిళా సాధికారిత ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఆకుల లలిత, మార్క్‌ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి, నిజామాబాద్ జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



నిమ్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన ఆయుష్ ఇంటిగ్రేటెడ్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభోత్సవానికి హాజరైన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు రాఖీ కడుతున్న నర్సు


దత్తాత్రేయ నివాసంలో రాఖీ సంబురాలు

ముషీరాబాద్: యుద్ధంలో విజయం సాధించి ఇంటికి వచ్చిన రాజుకు మహిళలు రాఖీ కట్టి దేశాన్ని, ధర్మాన్ని రక్షించమని కోరేవారని నేటి ఆధునిక మహిళలు కూడా దేశాన్ని రక్షించడంలో, ధర్మాన్ని కాపాడటంలో ప్రధాన పాత్ర పోషించాలని హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆకాంక్షించారు. కూతురు బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో రాంనగర్‌లోని ఆయన నివాసం వద్ద రాఖీ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన బండారు దత్తాత్రేయకు హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ హైమావతి, కాచిగూడ కార్పొరేటర్ ఉమా, నల్లకుంట డివిజన్ కార్పొరేటర్ వై.అమృతలతో పాటు సీనియర్ బీజేపీ నాయకులు పుష్పల శారద, మంత్రి కళావతి, విజయలక్ష్మి, పద్మజలతోపాటు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ... అన్ని రంగాల్లో మహిళలను ప్రోత్సహించి అభివృద్ధి పథంలో పయనింపజేయాలని కోరారు.



సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 1-9-2023


ఫ్యాషన్


* ఆభరణం

ముక్కున సింగారం

ఆభరణాలు ఎన్ని ఉన్నా
ఆ ఒక్క అలంకారం తక్కువైతే
అందానికి పరిపూర్ణత చేకూరదు.
ఆ ఒక్కటే ముక్కుపుడక లేదా ముక్కెర.
వేడుకలలో ప్రత్యేకంగా వెలిగిపోతూ
నోస్‌పిన్‌గా స్టైల్‌లో తనదైన శైలిని చూపుతూ
మురిపెంగా మెరిసిపోయే
ముక్కున సింగారపు వేడుకలకు ప్రత్యేకం.



వ్యక్తిగత శైలికి బలమైన ప్రతిబింబంగా నిలిచే ముక్కెర ఎంపిక కోసం కొన్ని కసరత్తులు చేయాల్సిందే. గుండ్రని ముఖం ఉన్న మహిళలు పొడవుగా ఉండే నోస్‌రింగ్ ఎంచుకోవడం మంచిది. అలాగే, ముఖం కోలగా ఉండేవారు గుండ్రని నోస్పిన్ డిజైన్స్ ఎంచుకుంటే మరింత ప్రత్యేకంగా కనిపిస్తారు.

■ సంప్రదాయంలో మెరుపు

బ్రైడల్ కలెక్షన్‌లో భాగంగా స్వచ్ఛమైన బంగారు, డైమండ్ ముక్కు ఆభరణాలను ఎంచుకుంటుంటారు. అయితే గ్రాండ్‌గా ఉండేందుకు బంగారం, డైమండ్, ముత్యాలు, ఇతర రత్నాలతో ఉండే ముక్కెరలను ఎంచుకోవచ్చు. ఇటీవల బ్రైడల్ నోస్ రింగ్స్‌లో డిజైన్స్ సందర్భానికి తగ్గట్టుగా ఉంటున్నాయి.



❁ ఆధునిక శైలి

వృత్తి, ఉద్యోగాలలో ఉంటున్న మహిళలైతే ఎలాంటి హంగులూ లేని సింపుల్ డిజైన్స్ ఇష్టపడుతుంటారు. అయితే, ఇటీవలి కాలంలో డ్రెస్సులకు తగినట్టు మార్చుకోగలిగే ట్రెండింగ్ డిజైన్స్‌ను ఎంచుకుంటున్నారు. వీటిలో అన్ని రకాల స్టోన్స్‌కు మాత్రమే కాదు సిల్వర్, స్టీల్ నోస్‌రింగ్స్‌కు ఓటేస్తున్నారు. వీటిలో సెంట్రల్ నోస్ రింగ్స్ మరింత ట్రెండీగా మారాయి.



❁ రాష్ట్రాల వారీగా...

మహారాష్ట్రీయుల ముక్కెర చంద్రవంక లేదా జీడిపప్పు ఆకారాన్ని పోలి ఉంటుంది. ముత్యాలూ, వజ్రాలు, రాళ్లు, పూసలు జత చేసి ఉంటాయి. మహారాష్ట్ర పెళ్లికూతురు కేవలం ముక్కెర కోసమే వధువు కావాలని కోరుకునేంత అందంగా ఉంటుంది. హిమాలయ ప్రాంతాల మహిళలు బులక్ అనే పేరున్న వెడల్పాటి నోస్ రింగ్స్‌ను ఎంచుకుంటారు. పంజాబీయుల నథ్ అనే పేరు గల ముక్కు ఉంగరాలు చాలా తేలికగా ఉంటాయి. గుజరాత్, రాజస్థాన్ మహిళల నోస్ రింగ్స్ కూడా నథ్ లేదా నాథూరి అని పిలిచే నోస్ రింగ్స్‌ను పోలి ఉంటాయి. ఇవి బంగారం లేదా వెండితో ఉంగరంలా తయారుచేస్తారు. వీటిలో విలువైన రత్నాలను పొదుగుతారు. వేడుకలలో ధరించేవి పెద్దవిగా ఉంటాయి. ముక్కు నుంచి జుట్టుకు జత చేసే గొలుసు ఉన్న నోస్ రింగ్స్‌ను కూడా వాడుతుంటారు. ఇవి బ్రైడల్, ప్రత్యేక సంప్రదాయ వేడుకల అలంకారాలలో కనిపిస్తుంటాయి. ప్రాచీన భారతీయ రాజకుటుంబీకులు వీటిని ధరించేవారు. ఆ తర్వాతి కాలాల్లో పెళ్లి కూతురు అలంకరణలో భాగమైంది. ఉత్తరాఖండ్ మహిళల ఆభరణాల్లో నోస్ రింగ్‌ను టిహ్రీ నథ్ అని పిలుస్తారు. దీని అలంకారం అద్భుతంగా చెప్పుకుంటారు. ఈ నోస్ రింగ్‌లో విలువైన కెంపులు, ముత్యాలతో పొదిగిన వెడల్పాటి బంగారు తీగ ఉంటుంది. నెమలి డిజైన్స్ కూడా ఇందులో చూస్తాం. ఇక్కడి వివాహిత మహిళలు ఈ నోస్ రింగ్‌ను శుభప్రదంగా భావిస్తారు. ఆభరణాల కళాత్మకతలో ఈ నోస్ రింగ్‌ను ప్రత్యేకంగా చెప్పుకుంటారు. తామర పువ్వు, హంస ఆకారంలో ఉన్న ముక్కెరలు గోవా, కోంకణ్ ప్రాంతాల వధువులు ఎంపిక చేసుకుంటారు. ఈ డిజైన్స్ కర్నాటక, కేరళలో కూడా ధరిస్తారు.





❁ దక్షిణాన శాశ్వతం

తెలుగు, తమిళ, కన్నడ రాష్ట్రాలలో ముక్కు ఉంగరాల కన్నా స్టడ్స్‌కే ప్రాధాన్యత. డైమండ్స్, కెంపులు, బంగారంతో తయారు చేసినవి ఉంటాయి. దక్షిణ భారత దేశాన ముక్కుపుడక ఒక శాశ్వత ఎంపికగా ఉంటుంది. ముక్కుపుడక అందం వారి అనుభవంతో కలిసి ప్రకాశిస్తుందా అన్నట్టుగా ఉంటుంది.



లీడర్



యువ బృందంతో భాగ్యశ్రీ

గూడేనికి వెలుతురు నువ్వమ్మా

'ఇరవై ఏళ్ల వరకూ మా ఇంట్లో బల్బు చూడ్లేదు' అంటుంది భాగ్యశ్రీ. మహారాష్ట్రలో నక్సల్ ప్రభావిత గడ్చిరోలి జిల్లాలోని తమ గూడేనికి చాలా కాలం పాటు సర్పంచ్‌గా ఎవరూ నిల్చునే ధైర్యం చేయలేదు. సమస్యలు తీర్చేవారూ లేరు. 'చివరకు నేనే సర్పంచ్ అవుదామని నిశ్చయించుకున్నా' అంది భాగ్యశ్రీ. 24 ఏళ్ల ఈ గిరిజన నాయకురాలు తన వారి కోసం పని చేస్తున్న తీరు ప్రతి అణగారిన సమూహానికి చూపుతున్న మార్గం చాలానే ఉంది.



గ్రామస్తులను చైతన్యవంతం చేస్తూ...

మహారాష్ట్రలో ముంబై, పూణె వంటి నగరాలది ఒక ప్రపంచమైతే గడ్చిరోలి వంటి నక్సల్ ప్రభావిత గిరిజన ప్రాంతాలది మరో ప్రపంచం. 'మహారాష్ట్రకు ఊపిరితిత్తి' అని పిలిచే ఈ ప్రాంతమంతా దట్టమైన అడవి, గిరిజన ఆవాసాలతో ఉంటుంది. అయితే నక్సలైట్ల ప్రభావం వల్ల, గిరిజనులనే నిర్లక్ష్యం వల్ల దారుణమైన వెనుకబాటుతనం ఇక్కడ ఉంటుంది. 'మా గూడెంలో నాకు ఇరవై ఏళ్లు వచ్చే వరకూ కరెంటు లేదు. మా ఇంట్లో బల్బు వెలగడం చూడ్లేదు' అంటుంది 24 ఏళ్ల భాగ్యశ్రీ లక్ష్మి. గడ్చిరోలి అడవుల్లో అత్యధిక సంఖ్యలో ఉండే మడియా తెగకు చెందిన ఈ చదువుకున్న అమ్మాయి తన సొంతగూడెం 'కొటి' పంచాయితీ కింద ఉన్న 9 గ్రామాలకు సర్పంచ్. ఈ ప్రాంత గిరిజనుల జీవితాలకు ఒక ఆశాదీపం.

> **గిరిజనులకు కొన్ని విశ్వాసాలుంటాయి. వారు అన్ని మాటలు వినరు. వారిని ఒప్పించి అభివృద్ధివైపు నడిపించడమే పెద్ద సవాలు. బయటవారు నాయకులు కావడం కంటే లోపలివారు నాయకులైతేనే అది సులభం. ఎవరి సమూహాల మేలు వారే చూసుకోవాలి.**

■ సర్పంచ్ లేని ఊరు

భాగ్యశ్రీ లక్ష్మి పుట్టి పెరిగిన 'కొటి' గూడేనికి 2003 నుంచి సర్పంచ్ లేడు. ఎందుకంటే నక్సల్ ప్రభావం వల్ల ఏ సమస్యో అని ఎవరూ నిలబడలేదు. దాంతో ఆ ప్రాంతమంతా అనేక సమస్యలు పేరుకుపోయాయి. బాల్య వివాహాలు, చదువు మానేయడం, నక్సల్ అనే అనుమానంతో అమాయక గిరిజన యువకులను ఏళ్ల తరబడి జైళ్లల్లో పడేయడం.. ఇదీ అక్కడ జరుగుతున్నది. డాక్టర్లు పొరపాటున కూడా రారు. అదేమంటే రోడ్లు లేవంటారు. రోడ్లు వేయమని అధికారుల దగ్గరకు వెళితే వారు మరేవో సమస్యలు చెప్తారు. 'ఇవన్నీ చూసి చూసి విని విని నేనే సర్పంచ్‌గా మారి ఏదో ఒకటి చేద్దామని బయలుదేరాను' అంటుంది భాగ్యశ్రీ లక్ష్మి.

■ నేనొచ్చాను

భాగ్యశ్రీ లక్ష్మి తల్లి అంగన్‌వాడి టీచర్. తండ్రి ప్రభుత్వ టీచర్. అందుకే భాగ్యశ్రీని చదివించారు. 'చంద్రాపూర్‌లో బి.ఏ. ఫిజికల్ ఎడ్యుకేషన్ చదివాను. మంచి వాలీబాల్ ప్లేయర్‌ని నేను. టీచింగ్ రంగంలోకి వెళదామనుకున్నాను. కాని నా చదువు నాకు మాత్రమే ఉపయోగపడితే ఎలా? నా వారికి ఏదైనా చేయాలని సర్పంచ్ అయ్యాను. ఏకగ్రీవంగా నన్ను ఎన్నుకున్నారు' అంది భాగ్యశ్రీ. అయితే ఆమెకు పదవి రావడాన్ని ఊహించని కొంతమంది మగవారు భాగ్యశ్రీ పదవీ స్వీకారం రోజు ఆమెతో దురుసుగా వ్యవహరించారు. మైక్ తీసుకొని మాట్లాడబోతే మాట్లాడనివ్వలేదు. అసభ్యంగా ప్రవర్తించారు. 'నేను ఇంటికొచ్చి చాలా ఏడ్చాను. అయితే మా అమ్మ– నువ్వు ఇక మీదట మామూలు భాగ్యశ్రీగా ఉండకు. ఒక నాయకురాలు ఎలా ఉంటుందో అలా ఉండు' అని ధైర్యం చెప్పింది. ఆ క్షణమే నేను గట్టిగా నిలబడాలనుకున్నాను' అంటుంది భాగ్యశ్రీ.

■ బైక్ మీద తిరుగుతూ...

ప్రతి ఉదయం టీ తాగి బైక్ మీద తిరుగుతూ తన అజమాయిషీలో ఉన్న గ్రామాల సమస్యలు పరిష్కరిస్తోంది భాగ్యశ్రీ. ఆమె సర్పంచ్ అయ్యాక గూడేల్లోని తల్లిదండ్రులతో పోట్లాడి మొదటగా చేసిన పని బాల్యవివాహాలు మాన్పించడం... బాలికలను హాస్టళ్లకు పంపి చదివించడం... స్కూళ్లలో తిరిగి చేరేలా చేయడం, టాయిలెట్లు నిర్మించడం... 'నా కింద తొమ్మిది గ్రామాల్లో ఆరింటికి కరెంటు తెప్పించాను' అని తెలిపిందామె. 'అధికారులు ఏది అడిగినా నక్సల్స్ సమస్యను సాకుగా చూపుతారు. ప్రజల సమస్యలను నిజంగా పరిష్కరిస్తే నక్సల్స్ అడ్డుపడరు' అంది. 'గిరిజనులకు కొన్ని విశ్వాసాలుంటాయి. వారు అన్ని మాటలూ వినరు. వారిని ఒప్పించి అభివృద్ధి వైపు నడిపించడమే పెద్ద సవాలు. బయటవారు నాయకులు కావడం కంటే లోపలివారు నాయకులైతేనే అది సులభం. ఎవరి సమూహాల మేలు వారే చూసుకోవాలి' అంటుంది భాగ్యశ్రీ.

న్యూస్ మేకర్

విశ్వవిద్యాలయంలో ఉన్నత చదువును మాత్రమే కాదు... సమాజాన్ని కూడా లోతుగా చదివే వారే ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా గెలుపు జెండా ఎగరేయగలరని నిరూపించారు 'కలైడోఫిన్' కో-ఫౌండర్, సీయివో సుచరిత ముఖర్జీ, 'అప్నాక్లబ్' సీయీవో శ్రుతి. తాజాగా... ఫోర్బ్స్ ఆసియా '100 టు వాచ్' వార్షిక జాబితాలో ఆరు భారతీయ కంపెనీలు చోటు చేసుకున్నాయి. వాటిలో 'కలైడోఫిన్''అప్నాక్లబ్'లు ఉన్నాయి..

సుచరిత సుమధుర శ్రుతి



'కలైడోఫిన్' కో-ఫౌండర్, సీయీవో సుచరిత 'అప్నా క్లబ్' సీయీవో శ్రుతి

అయిదుగురు కుటుంబ సభ్యుల పోషణ బాధ్యతను తలకెత్తుకున్న చెన్నైకి చెందిన రమణీ శేఖర్ దినసరి కూలీ. రోజుకు రెండు వందల రూపాయల వరకు సంపాదిస్తుంది. కంటిచూపు కోల్పోవడంతో భర్త ఇంటికే పరిమితం అయ్యాడు. కొడుకు, కూతురు కాస్తో కూస్తో చదువుకున్నారు గానీ ఏ ఉద్యోగమూ చేయడం లేదు. వీరితో పాటు తల్లి పోషణ భారం కూడా తనదే. ఒక విధంగా చెప్పాలంటే నెలాఖరుకు పైసా మిగలడం కష్టం. ఇలాంటి పరిస్థితుల్లో కూడా 'కలైడోఫిన్' పేరు మీద అయిదు వందల రూపాయలు పొదుపు చేయడం మానలేదు రమణి.

'అత్యవసర పరిస్థితుల్లో వైద్య అవసరాల కోసం ఈ డబ్బును ఉపయోగిస్తాను' అంటున్న రమణి కొంత డబ్బును సెల్ఫ్–హెల్ప్ గ్రూప్ సేవింగ్ స్కీమ్స్‌లో కూడా పెడుతుంది.

'రమణిలాంటి ఎంతోమంది పేదవాళ్లకు కష్ట సమయంలో కలైడోఫిన్ అండగా ఉంది' అంటుంది ఫిన్‌టెక్ కంపెనీ 'కలైడోఫిన్' కో–ఫౌండర్, సీయీవో సుచరిత ముఖర్జీ.

దీర్ఘకాల, మధ్యకాల, స్వల్పకాల లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని ఉదాన్, లక్ష్య, ఉమ్మీద్ అనే ప్యాకేజీలను లాంచ్ చేసింది కలైడోఫిన్.

'కలైడోఫిన్' ప్యాకేజీలలో ఒకటైన 'లక్ష్య'ను పేద ప్రజల ఆరోగ్యం, చదువు, వివాహాన్ని దృష్టిలో పెట్టుకొని రెండు నుంచి నాలుగు సంవత్సరాల కాలపరిమితితో రూపొందించారు. ఈ ప్యాకేజీలో మరణం లేదా అంగవైకల్యానికి బీమా ఉంటుంది.

'తమ ఆర్థిక స్థాయిని బట్టి ఎవరైనా సరే వెల్త్ మేనేజ్‌మెంట్ సర్వీసులతో యాక్సెస్ కావచ్చు' అంటూ దిగువ మధ్యతరగతి, పేదవర్గాలకు భరోసాతో బయలుదేరింది కలైడోఫిన్. చెన్నై కేంద్రంగా ప్రారంభమైన ఈ ఫిన్‌టెక్ కంపెనీ అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందింది.

వ్యాపారవేత్తకు కేవలం వ్యాపార దృష్టి మాత్రమే కాదు సాధ్యసాధ్యాలకు సంబంధించి వినియోగదారుల దృష్టి నుంచి కూడా ఆలోచించాలి. ఈ విషయంలో తగిన అధ్యయనం చేసింది సుచరిత.

ఢిల్లీ యూనివర్శిటీలో ఎకనామిక్స్‌లో డిగ్రీ, ఐఐఎం, అహ్మదాబాద్‌లో ఎంబీఏ చేసిన సుచరిత ఐఎఫ్‌ఎంఆర్ ట్రస్ట్ గ్రూప్ కంపెనీలలో ఉన్నత హోదాలలో పనిచేసింది. ఆ తరువాత 'కలైడోఫిన్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం ప్రారంభించింది.

• • •

శ్రుతి తండ్రి ఐఏఎస్ అధికారి. అయినప్పటికీ ఆయనకు ఆడపిల్లల విషయంలో 'అయ్యో!'లు తప్పలేదు.

'పాపం ఆయనకు ముగ్గురూ ఆడపిల్లలే' అని లేని బాధను కొని తెచ్చుకునేవారు చుట్టాలు, పక్కాలు.

స్కూల్ నుంచి కాలేజీ రోజుల వరకు ఎన్నోసార్లు లింగవివక్షతను ఎదుర్కొంది శ్రుతి.

ఆత్మవిశ్వాసం ఉన్నా తప్పే లేకున్నా తప్పే అన్నట్టుగా ఉండేది పరిస్థితి. ఆత్మవిశ్వాసం ఉంటే 'అంత వోవర్ కాన్ఫిడెన్సా?' అని వెక్కిరింపు. లేకపోతే'అంత ఆత్మన్యూనతా!' అని చిన్నచూపు. ఇలాంటి పరిస్థితులను తట్టుకొని పెద్ద ప్రయాణమే చేయాల్సి వచ్చింది శ్రుతి. అయితే ఆ ప్రయాణంలో ఆమె ఎప్పుడూ ఆగిపోలేదు. ఐఐటీ–ఢిల్లీలో ఎం.టెక్. పూర్తిచేసిన శ్రుతి ఉద్యోగం చేయాలనుకుంది. ఆ తరువాత 'ఉద్యోగం చేయగలనా?' అని కూడా అనుకుంది. దీనికి కారణం... తన స్వతంత్ర వ్యక్తిత్వం.

'నీకు చాలా కోపం' అనే మాట చాలాసార్లు విన్నది.

'ఆవేశంతో కనిపించే వాళ్లకు సాధించాలనే కసి ఎక్కువగా ఉంటుంది' అనే మాట కూడా విన్నది. 'అప్నాక్లబ్' రూపంలో అది తన విషయంలో నిజమైంది.

వ్యాపారంలో రాణించాలనుకున్న శ్రుతి హార్వర్డ్ బిజినెస్ స్కూల్(హెచ్‌బీఎస్)లో ఎంబీఏ చేసింది. ఇండియాకు తిరిగి వచ్చిన తరువాత 'సైర్' పేరుతో ట్రావెల్ స్టార్టప్‌కు శ్రీకారం చుట్టింది. అయితే అది తనకు చేదు అనుభవాన్ని నేర్పించడమే కాకుండా తియ్యటి పాఠాలు నేర్పింది. చిన్న పట్టణాలకు చెందిన వాళ్లు ఎఫ్ఎంసీజీ(ఫాస్ట్–మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్) ప్రొడక్ట్స్ కొనడానికి ఆసక్తి చూపిస్తున్నారనే విషయం గ్రహించిన శ్రుతి 'అప్నాక్లబ్' పేరుతో ఎఫ్ఎంసీజీ హోల్‌సేల్ ప్లాట్‌ఫామ్‌ను మొదలు పెట్టింది. సెమీ–అర్బన్, గ్రామీణ ప్రాంతాల కస్టమర్‌ల నుంచి మంచి స్పందన వచ్చింది.

'ఫరవాలేదు' అనుకుంటున్న సమయంలో కంపెనీ వేగంగా దూసుకుపోవడం మొదలైంది. టైగర్ గ్లోబల్, ట్రూ స్కేల్ క్యాపిటల్, ఫ్లోరిష్ వెంచర్స్, వైట్‌బోర్డ్ క్యాపిటల్... బ్యాకర్స్‌గా 'అప్నాక్లబ్' శక్తిమంతంగా తయారైంది. అంతర్జాతీయ స్థాయిలో మెరిసిపోతోంది.

'నీకున్న ఆవేశానికి ఉద్యోగం చేయడం కష్టం. వ్యాపారం చేయడం అంత కంటే కష్టం' అనే మాటను ఎన్నోసార్లు విన్నది శ్రుతి.

ఇప్పుడు అలాంటి మాటలు ముఖం చాటేశాయి.

'ఏదో సాధించాలనే గట్టి తపన, సంకల్పబలం ఉన్న మహిళ' అనే ప్రశంసపూర్వకమైన మాటలు 'అప్నాక్లబ్' సీయీవో శ్రుతి గురించి తరచు వినిపిస్తున్నాయి.

వంటిల్లు




వెన్న దొంగ రుచులు

కృష్ణుడు వెన్న దొంగ ఎందుకయ్యాడు?
వెన్న... రుచి అందర్నీ దొంగల్ని చేస్తుంది.
మరి... వెన్నతో చేసిన రుచులు?
కలాకండ్... మఖన్ మిశ్రీ...
కేసర్ శ్రీఖండ్... గోపాల్ కాలా.
కృష్ణాష్టమి వస్తోంది.
పాలు... పెరుగు... వెన్న...
మీగడలు సిద్ధం చేసుకోండి.
పాత్ర పెట్టండి... స్టవ్ వెలిగించండి.
వండే లోపు వెన్న మాయవుతుందేమో!
ఎక్కువ వెన్న తెచ్చుకోండి!!



గోపాల్‌కాలా

కావలసినవి: **అటుకులు** – కప్పు, **పెరుగు** – అర కప్పు, **కీర ముక్కలు** – కప్పు, **తాజా కొబ్బరి తురుము** – 3 టేబుల్ స్పూన్‌లు, **అల్లం తురుము** – టీ స్పూన్, **పచ్చి మిర్చి** – 1 (తరగాలి), **తరిగిన కొత్తిమీర** – అర కప్పు, **దానిమ్మ గింజలు** – టేబుల్ స్పూన్, **కిస్‌మిస్** – టేబుల్ స్పూన్, **ఉప్పు** – టీ స్పూన్ లేదా రుచిని బట్టి.
పోపు కోసం: **వెన్న** – టేబుల్ స్పూన్, **ఆవాలు** – అర టీ స్పూన్, **జీలకర్ర** – అర టీ స్పూన్, **కరివేపాకు** – 2 రెమ్మలు, **పచ్చి మిర్చి** – 1 (తరగాలి), **ఇంగువ** – చిటికెడు (టీ స్పూన్‌లో ఎనిమిదో వంతు).

తయారీ: అటుకులను నీటిలో వేసి కడిగి వెంటనే తీసి మరొక పాత్రలో వేసుకోవాలి. అందులో అడుగున చేరిన నీటిని కూడా పూర్తిగా వంపేయాలి. ● శుభ్రం చేసిన అటుకులు, కీర ముక్కలు, కొబ్బరి తురుము, పచ్చి మిర్చి ముక్కలు, అల్లం తరుగు, దానిమ్మ గింజలు, కిస్‌మిస్, కొత్తిమీర అన్నింటినీ పెద్ద పాత్రలో వేసి గరిటతో కలపాలి. అందులో పెరుగు, ఉప్పు వేసి మరోసారి కలిపి పక్కన పెట్టుకోవాలి.● పెనంలో వెన్న వేడి చేసి ఆవాలు, జీలకర్ర వేసి చిటపటలాడిన తర్వాత పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు, ఇంగువ వేసి కలిపి దించేయాలి. ఈ పోపును అటుకుల మిశ్రమంలో వేసి కలిపితే గోపాల్‌కాలా రెడీ.



కేసర్ శ్రీఖండ్

కావలసినవి: **చిక్కటి తాజా పెరుగు**– కేజీ, **చక్కెర** – వంద గ్రాములు (పొడి చేయాలి), **కుంకుమ పువ్వు** – కొద్దిగా, **వేడి పాలు** – టేబుల్ స్పూన్, **యాలకుల పొడి** – అర టీ స్పూన్, **పిస్తా పలుకులు** – టేబుల్ స్పూన్, **బాదం పలుకులు** – టేబుల్ స్పూన్.

తయారీ: ● వేడి పాలలో కుంకుమ పువ్వు వేసి పక్కన ఉంచాలి. ● పెరుగును పలుచని వస్త్రంలో వేసి మూటగట్టి వేలాడదీయాలి. మూడు గంటల పాటు ఉంచితే అందులోని నీరు పోయి మూటలో చిక్కటి పెరుగు మిగులుతుంది. ఆ పెరుగును ఒక పాత్రలో వేసి అందులో ముందుగా కుంకుమ పువ్వు వేసి ఉంచుకున్న పాలు పోసి, చక్కెర, యాలకుల పొడి వేసి సమంగా కలిసే వరకు చిలికితే కేసర్ శ్రీఖండ్ రెడీ. ● కేసర్ శ్రీఖండ్‌ను కప్పులో వేసి బాదం, పిస్తా పలుకులతో గార్నిష్ చేసి సర్వ్ చేయాలి.

గమనిక : మీ రుచిని బట్టి చక్కెర మోతాదును పెంచుకోవచ్చు.



కలాకండ్

కావలసినవి:
పనీర్ – 250 గ్రాములు (తురమాలి), **కండెన్స్‌డ్ మిల్క్** – 400 గ్రాములు, **చక్కెర** – టేబుల్ స్పూన్ (కండెన్స్‌డ్ మిల్క్‌తో వచ్చే తీపి సరిపోతుందనిపిస్తే చక్కెర అవసరం లేదు), **యాలకుల పొడి**– టీ స్పూన్, **నెయ్యి** – టేబుల్ స్పూన్, **బాదం, జీడిపప్పు, పిస్తా పలుకులు** – టేబుల్ స్పూన్.

తయారీ: మందపాటి బాణలిలో కండెన్స్‌డ్ మిల్క్, పనీర్ తురుము, చక్కెర వేసి కలపాలి. మిశ్రమం అడుగు పట్టకుండా గరిటెతో కలుపుతూ సన్న మంట మీద ఉడికించాలి. మిశ్రమం దగ్గరగా అయిన తర్వాత కలిపేటప్పుడు బాణలి అంచులను వదులుతూ ఉంటుంది. అప్పుడు యాలకుల పొడి వేసి కలపాలి. ఒక ట్రేకి నెయ్యి రాసి మిశ్రమాన్ని అందులో పోసి అట్లకాడతో సమంగా సర్దాలి. పైన బాదం, జీడిపప్పు, పిస్తా పలుకులు చల్లి అట్లకాడతో తేలికగా అద్దాలి. పదిహేను నిమిషాలకు వేడి తగ్గిన తర్వాత అట్లకాడతో మనకు కావల్సిన సైజులో, నచ్చిన ఆకారంలో గీతలు పెట్టాలి. పూర్తిగా చల్లారేటప్పటికి మరింతగా గట్టి పడుతుంది. అప్పుడు ట్రే నుంచి తీసి సర్వ్ చేయాలి. తేమ తగలకుండా నిల్వ చేస్తే కలాకండ్ నాలుగు రోజుల పాటు తాజాగా ఉంటుంది.



మఖన్ మిశ్రీ

కావలసినవి:
తాజా మీగడ– 2 కప్పులు, **కలకండ పలుకులు** – కప్పు, **పుదీన ఆకులు**– పది, **ఐస్ క్యూబ్స్**– కప్పు.

తయారీ: ఒక పాత్రలో మీగడ, నాలుగు ఐస్ క్యూబ్స్ వేసి బాగా చిలకాలి. ఐదారు నిమిషాలకు వెన్న పైకి తేలుతుంది. ఐస్ క్యూబ్ కరిగిన నీరు పలుచని పాలలా అడుగుకు చేరతాయి. వాటిని వంపేసి మరో నాలుగు ఐస్ క్యూబ్స్ వేసి మరో నిమిషం చిలికి ఆ నీటిని కూడా వంపేయాలి. ఇప్పుడు చిక్కటి వెన్న తయారవుతుంది. ఈ వెన్నలో కలకండ వేసి కలిసే వరకు చిలకాలి. ఈ మిశ్రమాన్ని కప్పులో వేసి పైన పుదీన ఆకులు అలంకరించాలి. ఈ వెన్న రుచి చూస్తే చాలు... శ్రీకృష్ణుడిలాగ అందరమూ వెన్నదొంగలమైపోతాం.

● టెక్.. టాక్

శాంసంగ్ గెలాక్సీ వాచ్ 6 క్లాసిక్



డిస్‌ప్లే: 1.50 అంగుళాలు
వోఎస్: ఆండ్రాయిడ్ వేర్ వోఎస్4
రిజల్యూషన్: 480X480 పిక్సెల్స్
బ్యాటరీ: 425 ఎంఏహెచ్
● వాటర్ రెసిస్టెంట్
● స్క్రాచ్ రెసిస్టెంట్ గ్లాస్

వివో వి29ఇ



సైజ్: 6.78 అంగుళాలు వోఎస్:ఆండ్రాయిడ్ 13
ఇమేజ్ రిజల్యూషన్: 9000x7000 పిక్సెల్స్
కలర్స్: ఆర్టిస్టిక్ రెడ్, బ్లూ
ఫ్రంట్ కెమెరా: 50 ఎంపి
బ్యాటరీ: 5,000 ఎంఏహెచ్
బరువు: 180.5 గ్రా.

వాట్సాప్‌లో ఏఐ జనరేటెడ్ స్టిక్కర్స్ కోసం...



● ఓపెన్ ఎనీ చాట్–క్లిక్
● స్టిక్కర్స్ విండోను ఓపెన్ చేయడానికి పేజీ బాటమ్‌లోని స్మైలీ ఐకాన్‌ను క్లిక్ చేయాలి
● 'క్రియేట్ ఏఐ స్టిక్కర్స్'తో యాక్సెస్ అయిన తరువాత 'జెనరేట్ యువర్ వోన్ ఏఐ స్టిక్కర్' ట్యాబ్–క్లిక్
● 'క్రియేట్' సెలెక్ట్ చేసుకొని మనం ఎంచుకున్న స్టిక్కర్‌కు టెక్ట్స్ లేదా వాయిస్ ప్రాంప్ట్ ఎంటర్ చేయాలి.

ఐఫోన్‌లో సబ్‌టైటిల్స్ కోసం...

మీరు ఐ ఫోన్ యూజర్? పరదేశ సినిమాలు, వీడియోలు ఐ ఫోన్ లేదా ఐ ప్యాడ్‌లో చూస్తున్నప్పుడు సబ్ టైటిల్స్ కావాలనుకుంటే ఇలా చేయండి...
● ప్లే బ్లాక్ ఆప్షన్స్‌ను ఓపెన్ చేయడానికి స్క్రీన్‌పై క్లిక్ చేయాలి.
● దిగువన త్రీడాట్స్‌పై ట్యాప్ చేయాలి.
● లాంగ్వేజ్–సబ్ టైటిల్స్ కనిపిస్తాయి. మీరు కోరుకునే ఆడియో లాంగ్వేజ్, సబ్ టైటిల్స్‌ను సెలెక్ట్ చేసుకోవాలి.



గాలి మాటలు మాట్లాడవద్దు అంటారు.
అయితే గాలిలో దూరిన విషం గురించి మాట్లాడడం తప్పేమీ కాదు.
ఇంజనీరింగ్ చదివే రోజుల్లో కాలేజీ క్యాంపస్‌లో
స్నేహితులతో కలిసి ఎన్నో చర్చలు చేసేవాడు కుశాగ్ర శ్రీవాస్తవ.
అవి టైమ్‌పాస్ చర్చలు కావు.
'ఏదో చేయాలి' అనే తపన ఉన్న చర్చలు.
చర్చల ప్రభావం, అధ్యయనంతో
వాయు కాలుష్యాన్ని తగ్గించే పరికరాల
తయారీ కోసం 'చక్ర్ ఇనోవేషన్'
కంపెనీ ప్రారంభించి విజయపథంలో
దూసుకుపోతున్నాడు శ్రీవాస్తవ...

● ఇనోవేషన్



చక్ర్‌వర్తి

అధ్యయనం అన్వేషణ ఆవిష్కరణ

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) సర్వే దిల్లీని 'ప్రపంచంలోనే అత్యంత కాలుష్యమైన రాజధాని'గా తేల్చింది. అప్పుడు దిల్లీకి చెందిన కుశాగ్ర శ్రీవాస్తవ ఐఐటీ–దిల్లీలో ఇంజనీరింగ్ స్టూడెంట్. వాయు కాలుష్యం తగ్గించే మార్గాలపై అతడి ఫ్యాకల్టీ మెంబర్స్ వివిధ ఎక్స్‌పర్ట్ కమిటీలు, ప్యానెల్స్‌లో పనిచేస్తున్నారు.

క్యాంపస్‌లో వాయు కాలుష్యం గురించి తరచుగా చర్చలు జరిగేవి.

ఆ చర్చల్లో చురుగ్గా పాల్గొనేవాడు శ్రీవాస్తవ.

గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణమైన కర్బన ఉద్గారాల నుంచి వాయు కాలుష్యం వల్ల తగ్గుతున్న ఆయుర్దాయం వరకు, ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్ నుంచి గాలి నాణ్యత ప్రమాదకరంగా ఉన్న నగరాల వరకు ఆ చర్చల్లో ఎన్నో విషయాలు చోటు చేసుకునేవి.

సమస్య గురించి బాధ పడే వారు ఒక రకం అయితే, బాధ పడడానికే పరిమితం కాకుండా ఆ సమస్య పరిష్కారానికి తమ వంతుగా ఆలోచించేవారు రెండో రకం. శ్రీవాస్తవ రెండో వర్గానికి చెందిన కుర్రాడు.

ఐఐటీ–దిల్లీలో చదువుకుంటూనే 'చక్ర్ ఇనోవేషన్' అనే కంపెనీని రిజిస్టర్ చేయించాడు.

వాయుకాలుష్యానికి సంబంధించి 'రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్'పై మూడు సంవత్సరాలు వెచ్చించాడు.

ఆ తరువాత కంపెనీ పట్టాలకెక్కింది.

'ది చక్ర్ షీల్డ్' అనే రెట్రో ఫిట్ ఎమీషన్ కంట్రోల్ డివైజ్(ఆర్ఈసీడి)ను తయారుచేసింది చక్ర్.

ఈ టెక్నాలజీని ఎన్నో ప్రాంతాలలో విజయవంతంగా ఉపయోగించింది చక్ర్. సెంట్రల్ పోల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సీపీసీబీ) నుంచి ఆమోదం పొందింది.

శ్రీవాస్తవతో కో–ఫౌండర్‌లుగా ప్రయాణం మొదలు పెట్టిన ఇద్దరు మిత్రులు మధ్యలోనే తప్పుకున్నారు. అయినా ధైర్యం కోల్పోకుండా ముందు అడుగు వేశాడు శ్రీవాస్తవ.

'చక్ర్ సింగిల్ ప్రాడక్ట్‌గా ఉన్నప్పుడు క్లైమెట్–ఫోకస్‌డ్ ప్రైవెట్ ఈక్విటీ ఫండ్ 'సీవ్ ఫండ్' ఇన్వెస్ట్ చేసింది.

'మల్టీ–ప్రాడక్ట్ కంపెనీగా చక్ర్ మారాలనుకున్నాం. ఎందుకంటే ఉద్గార నియంత్రణ పరికరాలకు పెద్ద మార్కెట్ ఉంది. అదనపు ఉత్పత్తులతో చక్ర్‌కు మల్టీ–ప్రాడక్ట్ కంపెనీగా మారే సమర్థత ఉంది' అంటున్నాడు 'సీవ్ ఫండ్' చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ అక్షయ్ పంత్. 'చక్ర్' గత మూడు సంవత్సరాలుగా స్వదేశి ఇంధన నిల్వల సాంకేతికతపై పని చేస్తోంది. ఈ టెక్నాలజీ ద్వారా లిథియం గురించి ఇతర దేశాలపై ఆధారపడడం తగ్గుతుందని చెబుతున్నాడు శ్రీవాస్తవ. తమ కస్టమర్‌లలో 150 కంపెనీలు ఉన్నాయి. వీటిలో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు కూడా ఉండడం విశేషం.

వికేంద్రీకృత శక్తి వనరుల అనుసంధానానికి క్లీన్ టెక్ స్టార్టప్ 'చక్ర్ సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేస్తోంది.

'నగరాలలో మంచి గాలి లక్ష్యంతో ప్రయాణం మొదలు పెట్టాం. వినూత్నమైన సాంకేతికతే మా బలం అనుకున్నాం. వాణిజ్యపరంగా బలోపేతం కావడానికి వరల్డ్–క్లాస్ కస్టమర్ బేస్‌ను విస్తరించడానికి వినూత్న సాంకేతికతనే నమ్ముకున్నాం' అంటున్నాడు కుశాగ్ర శ్రీవాస్తవ.

యువర్స్

● ఇంగ్లిష్ ఇడియమ్స్



మేక్ ఏ మౌంటెన్ ఔట్ ఆఫ్ ఏ మోల్ హిల్

చిన్న సమస్యను కూడా పెద్దగా ఊహించుకొని ఆందోళన పడే వారి విషయంలో వాడే మాట ఇది. ఉదా: యూ హ్యావ్ జస్ట్ గాట్ ఏ కోల్డ్. సో స్టాప్ మేకింగ్ ఏ మౌంటెన్ ఔట్ ఆఫ్ ఏ మోల్ హిల్. యూ ఆర్ నాట్ గోయింగ్ టు డై ఫ్రమ్ ఇట్.

ఆన్ ది బ్యాక్ బర్నర్

భవిష్యత్‌లో పట్టాలకెక్కించాలనుకుంటున్న లేదా ఉపయోగపడే ప్లాన్, ప్రాజెక్ట్‌లకు సంబంధించి ఉపయోగించే మాట ఇది. ఉదా: ప్లాన్స్ ఫర్ ది న్యూ ఫ్యాక్టరీ హ్యావ్ బీన్ పుట్ ఆన్ ది బ్యాక్ బర్నర్ అన్‌టిల్ ది ఎకనామీ ఇంప్రూవ్స్

● గేమింగ్



చీకటిని చీల్చే వెలుగు రవ్వ

సింగిల్–ప్లేయర్ అడ్వెంచర్ స్ట్రాటజీ గేమ్ 'గోర్డ్' విడుదల అయింది. ఆ చీకటి ప్రపంచంలో గెలవాలంటే, మీ వాళ్లను రక్షించుకోవాలంటే రెండు విషయాలు ఉన్నాయి. అవి ఆయుధాల కంటే విలువైనవి. ఒకటి...ధైర్యం, రెండోది ప్రతికూలపరిస్థితులలోనూ నిలదొక్కుకోవడం. శత్రువుల బలాలు,బలహీనతలను అంచనా వేయగలిగిన వారే విజేత. అదిగో యుద్ధభేరి వినిపిస్తోంది.

ఇంజిన్: అన్ రియల్ ఇంజిన్ 4 జానర్: స్ట్రాటజీ గేమ్, ఇండీ గేమ్ ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5, ప్లే స్టేషన్ 4, మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ ఎక్స్‌బాక్స్ వన్

● మ్యూజిక్ వరల్డ్

స్వరాల సందడి



హిందుస్థానీ సంగీతాన్ని నేర్చుకున్న మధుర కుంభర్ స్వరం తేనె జలపాతం. ముంబైకి చెందిన మధుర డ్యాన్స్‌కు సంబంధించి ఒక రియాల్టీ షో ద్వారా వెలుగులోకి వచ్చింది. యూట్యూబ్ మ్యూజిక్, స్పోటిఫై, జియో సావన్. హంగామాలలో తన గాత్రాన్ని వినిపించింది. నోట్స్ 'ఎన్' బీట్స్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకులలో మధుర ఒకరు. ప్రసిద్ధ డిస్నీ మూవీ 'బ్యూటీ అండ్ ది బీస్ట్' కోసం వాయిస్ ఇచ్చింది. జీ మరాఠీ పాపులర్ మ్యూజిక్ షో 'నక్షత్రాంచే'తో, మరాఠీ మ్యూజికల్ గేమ్ రియాల్టీ షో 'కలర్స్'తో సంగీత ప్రేమికులకు చేరువయ్యింది. సోని టీవి ఇండియన్ ఐడల్ సీజన్ 10కు జడ్జ్‌గా వ్యవహరించింది. జీ యువ 'సంగీత్ సామ్రాట్'లో తన గళంతో అలరించింది. రెండు సంవత్సరాల క్రితం మరాఠీ చిత్ర గీతానికి ఫిల్మ్ ఫేర్ అవార్డ్ అందుకుంది. 'కలలు అనేవి దాచుకునేవి కావు సాకారం చేసుకునేవి' అనే మాట అంటే ఈ స్వీట్ వాయిస్ సింగర్‌కు ఎంతో ఇష్టం. పాత, కొత్త సంగీతాలను మిక్స్‌డ్‌గా ఆస్వాదించం అంటే మరీ మరీ ఇష్టం.

● అవును... ఇది నిజమే!



● చంద్రయాణానికి సంబంధించి తొలి కలను కన్నాడు 'ది రాయల్ సొసైటీ ఆఫ్ లండన్' వ్యవస్థాపకులలో ఒకరైన జాన్ విల్కిన్స్. జాన్‌కు ఎన్నో శాస్త్రాలపై ఆసక్తి ఉండేది. తన విభిన్నమైన ఆసక్తులు, విభిన్నమైన కలలకు కారణమయ్యేవి. తన కలలో 'రెక్కల రథం' అనేది రూపుదిద్దుకుంది. ఇది మనుషులను చంద్రలోకానికి తీసుకువెళుతుంది. 'ఏ డిస్కోర్స్ కన్సర్నింగ్ ఏ న్యూ వరల్డ్ అండ్ అనదర్ ప్లానెట్' అనే పుస్తకాన్ని రాశాడు. ఈ పుస్తకంలో మనుషులు చంద్రగ్రహంతో సహా రకరకాల గ్రహాలకు వెళ్లడంలోని సాధ్యాసాధ్యాల గురించి చర్చించాడు. ఎన్నో సాహసోపేతమైన ప్రతిపాదనలు చేశాడు.

● 'ప్రపోజ్ చేయడం మంచిదేగానీ వోవర్ కాన్ఫిడెన్స్ కూడదు' అంటారు ప్రేమతాత్వికులు. ఇట్టి విషయం తెలిసో తెలియకో చైనాలో ఒక యువకుడు పప్పులో కాలేసి జారి పడి జాలి చూపులకు గురయ్యాడు. రెండు సంవత్సరాల తన పొదుపు మొత్తాలను వెచ్చించి 99 ఐఫోన్‌లను కొన్నాడు. సింగిల్స్ డే (బ్యాచ్‌లర్స్ స్పెషల్) సందర్భంగా ఈ ఐఫోన్‌లను లవ్ సింబల్‌గా ఎరెంజ్ చేసి ప్రియురాలికి ప్రపోజ్ చేశాడు. సదరు ఆమె మాత్రం 'నో' అంటూ షాక్ ఇచ్చింది.

సినిమా





రాఖీ పండగ సందర్భంగా సోదరుడి క్షేమాన్ని కోరుకుంటూ సోదరి రాఖీ కడితే... ఎప్పటికీ రక్షణగా ఉంటానంటూ సోదరుడు కట్టించుకుంటాడు. ఇలా పలువురు స్టార్స్ రాఖీ పండగ జరుపుకున్నారు. ఎప్పటిలానే తన ఇద్దరు చెల్లెళ్లు మాధవి, విజయ దుర్గలతో రాఖీ కట్టించుకున్నారు చిరంజీవి. చెల్లెళ్లకు బహుమతులు ఇచ్చారు. అలాగే తన సోదరుడికి, కజిన్స్‌కి రాఖీ కట్టి, మిఠాయి తినిపించారు పూజా హెగ్డే. తమ్ముడు ఆశీర్వదించమంటూ కాళ్ల మీద పడగానే.. ఓ యబ్బో అంటూ సరదాగా కన్ను కొట్టారు పూజా. 'బ్రదర్స్ రూపంలో మంచి స్నేహితులు ఉన్నారు' అంటూ సోదరులతో కలిసి దిగిన ఫొటోను షేర్ చేశారు పరిణీతీ చోప్రా. ఇంకా పలువురు స్టార్స్ రాఖీ పండగ చేసుకున్నారు.



కల్కికి అతిథిగా...


● రాజమౌళి

దర్శకుడిగా ఎక్కువగా కెమెరా వెనకాల ఉండే రాజమౌళి అప్పుడప్పుడూ నటుడిగా కెమెరా ముందుకు వస్తుంటారు. ఆయన దర్శకత్వంలోనే వచ్చిన 'సై', 'మగధీర', 'బాహుబలి: ది బిగినింగ్' ఇటీవల 'ఆర్ఆర్ఆర్' చిత్రాల్లో సిల్వర్ స్క్రీన్‌పై కనిపించారు రాజమౌళి. ఇతర దర్శకుల చిత్రాలైన 'రెయిన్ బో', 'మజ్ను'ల్లో అతిథి పాత్రల్లో కనిపించారు. తాజాగా 'కల్కి 2898ఏడీ' చిత్రంలో అతిథిగా కనిపించేందుకు రాజమౌళి అంగీకరించారని సమాచారం. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ఇది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. నేడు ప్రభాస్, రాజమౌళి కాంబినేషన్ సన్నివేశాలను చిత్రీకరించేలా నాగ్ అశ్విన్ ప్లాన్ చేశారని తెలిసింది. ఈ ఒక్క రోజుతో రాజమౌళి పాత్ర చిత్రీకరణ పూర్తవుతుందని భోగట్టా. ఇక దీపికా పదుకోన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ వచ్చే ఏడాది విడుదల కానుంది.

సక్సెస్ మీట్‌లో మాట్లాడి ఐదేళ్లయింది

- కార్తికేయ

''క్లాక్స్ నాకు 2009 నుంచి పరిచయం. అప్పట్నుంచి నాకు కథలు చెబుతుంటాడు. డిఫరెంట్ కాన్సెప్టుల్లో నటించడం, చేయడం కాస్త కష్టం.. నిర్మాతలు ముందుకు రారు, కమర్షియల్ ఫార్మాట్లో సినిమా చేయమని తనతో చెప్పాను. కానీ బెన్నీలాంటి నిర్మాతలు ఇప్పుడు కొత్త కథలను ప్రోత్సహిస్తున్నారు. ఇక కొత్త కొత్త పాత్రలు చేస్తున్న కార్తికేయకు పెద్ద హిట్ పడాలని అనుకున్నాను. ఇప్పుడు 'బెదురులంక'తో హిట్ కొట్టేశాడు'' అని హీరో శ్రీ విష్ణు అన్నారు. కార్తికేయ, నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం 'బెదురులంక 2012'. క్లాక్స్ దర్శకత్వంలో రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం గత వారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ నిర్వహించిన విజయోత్సవంలో హీరో శ్రీ విష్ణు, దర్శకుడు అజయ్ భూపతి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ''కార్తికేయకు హిట్ వస్తే నాకూ హిట్ వచ్చినట్టే'' అని అజయ్ భూపతి అన్నారు. కార్తికేయ మాట్లాడుతూ– ''ఈ సినిమా ప్రయాణంలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నాం. ఫస్ట్ డే ఫస్ట్ షో చూసి బాగుందని అందరూ చెప్పిన తర్వాత పెద్ద రిలీఫ్ అనిపించింది. ఇలా సక్సెస్ మీట్‌లో మాట్లాడి ఐదేళ్లయింది. 'ఆర్ఎక్స్ 100' తర్వాత నేను చేసిన సినిమాలు అనుకున్న రేంజ్‌కు వెళ్లలేదు. ఒక్క హిట్ వస్తే చాలనుకున్న టైమ్‌లోనే 'బెదురులంక' వచ్చింది'' అన్నారు. ''సినిమాను ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని. ఇంకా బీవీఎస్ రవి, నేహా శెట్టి తదితరులు మాట్లాడారు.


● బెన్నీ, శ్రీ విష్ణు, కార్తికేయ, నేహాశెట్టి

నేను వచ్చానని చెప్పు!

'నాన్ వందుట్టేన్ను సొల్లు' అంటూ నయనతార ఇన్‌స్టాగ్రామ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. అంటే.. 'నేను వచ్చానని చెప్పు' అని అర్థం. తన ఇద్దరు పిల్లలు ఉయిర్, ఉలగమ్‌లను ఎత్తుకొని, 'జైలర్' సినిమాలోని 'హుకుమ్' పాట బ్యాక్‌గ్రౌండ్‌తో, స్టయిలిష్‌గా నడుస్తూ వస్తున్న వీడియోను తొలి పోస్ట్‌గా షేర్ చేశారు నయనతార. అలాగే షారుక్ ఖాన్ కాంబినేషన్‌లో నటించిన 'జవాన్' ట్రైలర్‌ని షేర్ చేశారామె. ఈ నెల 7న ఈ చిత్రం విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఇక భార్య ఇన్‌స్టాలోకి ఎంటర్ అయిన సందర్భంగా 'మై ఉయిర్స్ (నా ప్రాణాలు) వెల్కమ్' అని పేర్కొన్నారు దర్శకుడు విఘ్నేష్ శివన్. ఇలా నయనతార సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లోకి రావడం ఆమె అభిమానులను ఆనందపరిచింది. నయనతార ఇన్‌స్టాలోకి ఎంటర్ కాగానే విఘ్నేష్ శివన్, షారుక్ ఖాన్, అనిరుధ్, తన రౌడీ పిక్చర్స్ బేనర్, మిచెల్లీ ఒబామాలను ఫాలో అయ్యారు.


● కుమారులతో నయనతార


● నయనతార

యాక్షన్.. థ్రిల్...

'సందీప్ మాధవ్ హీరోగా, కేథరిన్ హీరోయిన్‌గా ఓ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. అశోక్ తేజ దర్శకత్వంలో సోమా విజయ్ ప్రకాష్ నిర్మాణంలో దావులూరి జగదీష్, పల్లి కేశవరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తొలి షెడ్యూల్ పూర్తయిన సందర్భంగా దావులూరి జగదీష్ మాట్లాడుతూ – ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రంలో సందీప్ ఓ పవర్‌ఫుల్ పోలీస్ క్యారక్టర్ చేస్తున్నారు. రెండో షెడ్యూల్‌ని ఈ నెల 4న ఆరంభిస్తాం. ప్రముఖ దర్శకుడు సంపత్ నందిగారు మా కథ విని ఇంప్రెస్ అయి, ఓ క్రేజీ టైటిల్ సూచించారు. ఆ టైటిల్‌ని ఈ నెల 6న ప్రకటిస్తాం. చాలా గ్యాప్ తర్వాత 'ఆది' ఫేమ్ కీర్తీ చావ్లా ఈ చిత్రంలో ఓ ముఖ్యమైన పాత్ర చేస్తున్నారు'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: సతీష్ ముత్యాల.


● కేథరిన్, సందీప్

రీల్స్

ఘన్ను భాయ్ వినోదం

ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ అభిషేక్ నామా నిర్మిస్తున్న తాజా చిత్రం 'ఘన్ను భాయ్'. 'ఇస్మార్ట్ కా బాప్' అనేది ట్యాగ్ లైన్. ఈ సినిమా ద్వారా ఆదిత్య గంగసాని హీరోగా పరిచయమవుతున్నారు. ప్రణయ్ మైకల్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. ''పూర్తి వినోదాత్మకంగా రూపొందుతున్న చిత్రం 'ఘన్ను భాయ్'. ఈ సినిమాని వచ్చే ఏడాది మార్చి 8న విడుదల చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.


● ఆదిత్య

మ్యాడ్‌తో ఎంట్రీ!


● 'మ్యాడ్' పోస్టర్

నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, గౌరీ ప్రియా రెడ్డి, అనతిక సునీల్ కుమార్, గోపికా ఉద్యన్ ముఖ్య తారలుగా నటిస్తున్న చిత్రం 'మ్యాడ్. కల్యాణ్ శంకర్ దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రూపొందుతున్న ఈ సినిమా ద్వారా నిర్మాతలు చినబాబు కుమార్తె, నాగవంశీ సోదరి హారిక సూర్యదేవర నిర్మాతగా ఎంటర్ అవుతున్నారు. ఎస్. నాగవంశీ సమర్పణలో హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ''యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్, కెమెరా: షామ్‌దత్ సైనుద్దీన్, దినేష్ కష్ణన్ బి.

గ్రామీణ నేపథ్యంలో...

'సత్యం' రాజేష్, కామాక్షి భాస్కర్ల లీడ్ రోల్స్‌లో డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మా ఊరి పొలిమేర–2'. గౌరు గణబాబు సమర్పణలో గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రాన్ని నవంబరు 2న విడుదల చేయనున్నారు. డా. అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ– ''గ్రామీణ నేపథ్యంలో మర్డర్ మిస్టరీకి బ్లాక్ మ్యాజిక్ అంశాన్ని జోడించి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. 'మా ఊరి పొలిమేర ' కన్నా రెండో భాగం ఇంకా ఆసక్తిగా ఉంటుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: గ్యాని, కెమెరా: ఖుషేందర్ రమేష్ రెడ్డి.


● రాజేష్, కామాక్షి

అట్టా.. ఎట్టాగా పుట్టేసినావు...


● విషికా, రవి

రవి మహాదాస్యం, విషికా లక్ష్మణ్ జంటగా రాజశేఖర్ సుద్మూన్ దర్శకత్వం వహించిన చిత్రం 'సగిలేటి కథ'. నవదీప్ సి–స్పేస్ సమర్పణలో దేవీప్రసాద్ బలివాడ, అశోక్ మిట్టపల్లి నిర్మించారు. జశ్వంత్ పసుపులేటి సంగీతం అందించిన ఈ చిత్రంలోని ''అట్టా ఎట్టాగా పుట్టేసినావు..' అంటూ సాగే పాటని మ్యూజిక్ డైరెక్టర్ రథన్ రిలీజ్ చేశారు. రాజశేఖర్ సుద్మూన్, జశ్వంత్ పసుపులేటి రాసిన ఈ పాటను యశ్వంత్ నాగ్, కమల మనోహరి పాడారు. ''హీరో, హీరోయిన్ తొలి చూపులోనే ప్రేమలో పడే సీన్‌లో వచ్చే పాట ఇది. త్వరలోనే సినిమాను రిలీజ్ చేస్తాం'' అన్నారు దర్శక–నిర్మాతలు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
1-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 256	64,831
నిఫ్టీ ▽ 93	19,254

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	14,067	▲ 48
డోజోన్స్	34,858	▽ 32
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,439	▽ 35
డాక్స్	15,947	▲ 55
షాంఘై	3,120	▽ 17
నికాయ్	32,619	▲ 286

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,485	▲ 193
బంగారం (99.5 స్వచ్ఛత)	59,247	▲ 192
వెండి (కిలో)	74,645	▽ 16

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎంతు	81.90	83.57
£	బ్రిటన్ పౌండ్	ఎంతు	103.55	107.00
€	యూరో	ఎంతు	88.81	91.95
¥	జపాన్ ఎన్ (100)	ఎంతు	55.86	57.61
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎంతు	52.57	54.92
S$	సింగపూర్ డాలర్	ఎంతు	60.32	62.26
SAR	సౌదీ రియాల్	ఛాయిస్	21.15	22.71
UAE D	యూఏఈ దిర్హామ్	ఛాయిస్	21.67	23.41
¥	చైనా యువాన్	ఛాయిస్	10.24	12.24

వృద్ధి వేగంలో భారత్ టాప్!

- జూన్ త్రైమాసికంలో 7.8% పురోగతి
- వ్యవసాయం, ఫైనాన్షియల్ రంగాల చక్కటి పనితీరు



న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో (2023-24, ఏప్రిల్-జూన్) 7.8 శాతంగా నమోదయ్యింది. వ్యవసాయం, ఫైనాన్షియల్ రంగాలు మంచి పనితనాన్ని ప్రదర్శించాయి. జూన్ త్రైమాసికంలో ప్రపంచంలో మరే దేశమూ ఈ స్థాయి వృద్ధిని నమోదుచేసుకోలేదు. దీనితో వృద్ధి వేగంలో భారత్ మొదటి స్థానంలో నిలిచినట్లయ్యింది. 6.3 శాతం వృద్ధి రేటుతో భారత్ తర్వాత చైనా వృద్ధి వేగంలో రెండవ స్థానంలో నిలిచింది. అయితే క్యూ1లో 8 శాతం వృద్ధి రేటు నమోదవుతుందన్న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అంచనాలకన్నా తాజా లెక్క తక్కువగా ఉండడం గమనార్హం. ఈ నెల రెండవ వారంలో జరిగిన ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధాన సమీక్షలో 2023-24లో దేశ జీడీపీ 6.5 శాతం ఉంటుందని ఆర్‌బీఐ అంచనావేసింది. క్యూ1లో 8 శాతం, క్యూ2లో 6.5 శాతం, క్యూ3లో 6 శాతం, క్యూ4లో 5.7 శాతంగా అంచనా వేసింది. 2024-25 మొదటి త్రైమాసికంలో వృద్ధిరేటు 6.6 శాతంగా అంచనాకు వచ్చింది.

7.8 శాతం వృద్ధి అంటే...

2011-12ని బేస్ ఇయర్‌గా తీసుకుని ద్రవ్యోల్బణాన్ని సర్దుబాటు చేస్తూ లెక్కిస్తే, 2022-23 మొదటి త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి విలువ రూ.37.44 లక్షల కోట్లు. 2023-24 ఇదే కాలంలో ఈ విలువ రూ.40.37 లక్షల కోట్లకు ఎగసింది. అంటే వృద్ధి 7.8 శాతం పెరిగిందన్నమాట. కాగా ద్రవ్యోల్బణం సర్దుబాటు చేయని (ప్రస్తుత ధరల ప్రాతిపదిక) జీడీపీ వృద్ధి రేటు 8 శాతంగా ఉంది. విలువల్లో రూ.65.42 లక్షల కోట్ల నుంచి రూ.70.67 లక్షల కోట్లకు పెరిగింది.

- 2022-23 క్యూ1లో జీడీపీ వృద్ధి రేటు 13.1 శాతంగా ఉంది. అయితే దీనికి లో బేస్ ఎఫెక్ట్ ఒక కారణం. అంటే కరోనా కష్టకాలం 2021-22 ఇదే కాలంలో చేటుచేసుకున్న అతి తక్కువ గణాంకాలు 2022-23 క్యూ1లో అధిక రేటు (శాతాల్లో) నమోదుకు దోహదపడ్డాయి.
- తాజా గణాంకాలకు ముందు త్రైమాసికం అంటే జనవరి-మార్చి మధ్య జీడీపీ విలువ 6.1% కాగా, అంతక్రితం త్రైమాసికంలో (అక్టోబర్-డిసెంబర్)ఈ రేటు 4.5%. అంటే సమీక్షా కాలం సహా అంతక్రితం గత 3 త్రైమాసికాల్లో వృద్ధి రేటు పెరుగుతూ వచ్చిందన్నమాట.

జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్ఓ) విడుదల చేసిన జీవీఏ (గ్రాస్ వ్యాల్యూ యాడెడ్- స్థూల విలువ జోడింపు అనేది ఆర్థిక వ్యవస్థలోని పరిశ్రమ, రంగం, తయారీదారు, ప్రాంతం లేదా ప్రాంతం ద్వారా ఉత్పత్తి అయిన వస్తువులు, సేవల విలువ. ఉత్పత్తి వ్యయాలను ఇందులో చేర్చరు) ప్రకారం వివిధ రంగాల వృద్ధి తీరును పరిశీలిస్తే..

వర్షాభావం ఉన్నా 6.5 % వృద్ధి



వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 6.5% వృద్ధి సాధించే సత్తా భారత్‌కు ఉంది. ధరల కట్టడికి ప్రభుత్వం, ఆర్‌బీఐ తగిన చర్యలు తీసుకుంటున్నాయి. అందు వల్ల ద్రవ్యోల్బణం భయాలు అక్కర్లేదు.

– వి. అనంత నాగేశ్వరన్, చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్

ఏప్రిల్-జూన్ (గణాంకాలు శాతాల్లో)


రంగం	2023-24	2022-23
వ్యవసాయం	3.5	2.4
ఫైనాన్షియల్, రియల్టీ, ప్రొఫెషనల్ సేవలు	12.5	8.5
తయారీ	4.7	6.1
మైనింగ్, క్వారీయింగ్	5.8	9.5
ఎలక్ట్రిసిటీ, గ్యాస్, నీటి సరఫరా, ఇతర యుటిలిటీ సేవలు	2.9	14.9
నిర్మాణం	7.9	16
ట్రేడ్, హోటెల్, రవాణా, కమ్యూనికేషన్, బ్రాడ్‌కాస్టింగ్	9.2	25.7

జూలైలో మౌలిక రంగం ఓకే...

ఎనిమిది రంగాల భారత్ మౌలిక పరిశ్రమ జూలైలో మంచి పనితీరును కొనసాగించింది. బొగ్గు, క్రూడ్ ఆయిల్, సహజ వాయువు, స్టీల్, సిమెంట్, విద్యుత్, రిఫైనరీ ప్రొడక్టులు, ఎరువుల రంగాలు వీటిలో ఉన్నాయి. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ)లో వీటి వెయిటేజ్ 40.27 శాతం. ఐఐపీ జూలై డేటా సెప్టెంబర్ రెండవ వారం మొదట్లో వెలువడుతుంది. ఇక ఏప్రిల్ నుంచి జూలై వరకూ మౌలిక పరిశ్రమ వృద్ధి రేటు 6.4 శాతంగా ఉంది. కాగా, జూన్‌లో మౌలిక రంగం వృద్ధి రేటు 8.3 శాతం కావడం గమనార్హం. 2022 ఏప్రిల్-జూలై మధ్య ఈ రేటు 11.5 శాతం.

అదానీ గ్రూప్‌పై అవే ఆరోపణలు

- హిండెన్‌బర్గ్ బాటలో ఓసీసీఆర్‌పీ
- అక్రమ పెట్టుబడులతో షేర్ల ర్యాలీ
- తోసిపుచ్చిన అదానీ గ్రూప్ ప్రమోటర్లు



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌పై మరోసారి అక్రమ పెట్టుబడుల ఆరోపణలు తలెత్తాయి. అదానీ ప్రమోటర్ కుటుంబం వెలుగులోలేని మారిషస్ ఫండ్స్ ద్వారా కోట్లాది డాలర్లను గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీలలో ఇన్వెస్ట్ చేస్తున్నట్లు ఆర్గనైజ్‌డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్(ఓసీసీఆర్‌పీ) తాజాగా ఆరోపించింది. యూఏఈకి చెందిన నాసెర్ అలీ షాబాన్ అలీ, తైవాన్‌కు చెందిన చాంగ్ చుంగ్-లింగ్ ఏళ్లపాటు మారిషస్ ఫండ్స్ ద్వారా కోట్లాది డాలర్ల పెట్టుబడులతో అదానీ గ్రూప్ స్టాక్స్‌లో లావాదేవీలు నిర్వహించినట్లు ఓసీసీఆర్‌పీ తాజా ఆరోపణలకు తెరతీసింది. వినోద్ అదానీకి చెందిన వ్యక్తి నిర్వహణలోని దుబాయ్ సంస్థ ఈ ఫండ్స్‌ను నిర్వహిస్తుందని పేర్కొంది. కాగా.. ఇంతక్రితం ఈ ఏడాది జనవరిలోనూ అదానీ గ్రూప్ కంపెనీలలో అకౌంటింగ్ అవకతవకలు జరుగుతున్నట్లు యూఎస్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ ఆరోపించిన సంగతి తెలిసిందే. దీంతో గ్రూప్‌లోని లిస్టెడ్ కంపెనీలలో అమ్మకాలు వెల్లువెత్తి గ్రూప్ మార్కెట్ విలువలో 150 బిలియన్ డాలర్లమేర ఆవిరైంది. అయితే ఆపై గ్రూప్ వీటిని ఖండించింది. ఆపై షేర్ల ధరల్లో అవకతవకలకు ఆధారాలు లేవంటూ సుప్రీం కోర్టు నియమిత కమిటీ ఆరోపణలను కొట్టివేసింది. తాజాగా ఓసీసీఆర్‌పీ ఆరోపణల నివేదికలో పేర్కొన్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లను ఇప్పటికే సుప్రీం కోర్టు నియామక కమిటీ దర్యాప్తులోనూ పరిగణించిన విషయాన్ని ఈ సందర్భంగా అదానీ గ్రూప్ ప్రస్తావించింది. ఇవన్నీ రీసైకిల్ చేసిన ఆరోపణలుగా కొట్టిపారేసింది. ఇన్వెస్టర్ జార్జ్ సోరోస్ పెట్టుబడులున్న సంస్థల లబ్ధి కోసం ఆరోపణలను తిరగతోడుతున్నట్లు వ్యాఖ్యానించింది. కొన్ని విదేశీ మీడియా వర్గాలు పసలేని హిండెన్‌బర్గ్ నివేదికను మరోసారి హైలైట్ చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలుగా వీటిని తోసిపుచ్చింది.

తాజా ఆరోపణలు ఇలా..

2013-2018 మధ్య కాలంలో ప్రమోటర్ కుటుంబం తమ నిర్వహణలోని మారిషస్ ఫండ్స్ ద్వారా గ్రూప్ కంపెనీలలో కోట్లాది డాలర్ల నిధులను రహస్యంగా ఇన్వెస్ట్ చేశాయని ఓసీసీఆర్‌పీ పేర్కొంది. తద్వారా గ్రూప్ షేర్ల ధరలలో భారీ ర్యాలీకి కారణమైనట్లు ఆరోపించింది. ఈ కాలంలో షేర్ల ధరల్లో భారీ ర్యాలీ ఫలితంగా అదానీ గ్రూప్ దేశంలోనే అత్యంత శక్తివంతమైన బిజినెస్ గ్రూప్‌లలో ఒకటిగా ఆవిర్భవించినట్లు పేర్కొంది. ఓసీసీఆర్‌పీ ఆరోపణలను అదానీ ఖండించినప్పటికీ అదానీ గ్రూప్‌లోని పలు షేర్లు 4.4-2.2% మధ్య క్షీణించాయి.

అదానీపై విచారణకు జేపీసీ వేయాలి

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ డిమాండ్



అదానీ గ్రూప్‌పై తాజా ఆరోపణల విషయంలో ప్రధాని మోదీ తగు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. జీ20 శిఖరాగ్ర సదస్సు జరుగుతున్న వేళ దేశం ప్రతిష్ట మసకబారకుండా ఉండాలంటే అదానీ గ్రూప్‌పై జేపీసీ (సంయుక్త పార్లమెంటరీ కమిటీ)తో పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని కోరారు. ఈ అంశంపై ప్రతిపక్ష పార్టీలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. అదానీ విషయంలో ఇండియా కూటమిలో ఎలాంటి విబేధాలు లేవన్నారు. 'భారత్‌లో అందరికీ సమానావకాశాలుంటాయి. పారదర్శకత ఉంటుంది, అవినీతికి తావులేదని మనం చెప్పుకుంటున్నాం. కానీ, అదానీపై వస్తున్న ఆరోపణలు దేశ ప్రతిష్టను, ప్రధాని మోదీ పనితీరును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రధానికి సన్నిహితుడైన ఈ పెద్ద మనిషి బిలియన్ డాలర్లతో షేర్ ధరలను పెంచేలా ఎలా చేయగలిగారు? ఆ సొమ్ము ఎవరిది? దీని వెనుక గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీ హస్తం ఉందా?. ఇందులో మరో ఇద్దరి ప్రమేయం కూడా ఉంది. వారు నాసిర్ అలీ షాబాన్, చైనా వాసి చాంగ్‌చుంగ్ లింగ్. ఈ విదేశీయులను ఈ వ్యవహారంలోకి ఎలా అనుమతించారు? వీటిపై విచారణ ఎందుకు జరిపించడం లేదు? ఎందుకు మౌనంగా ఉంటున్నారు? వీటన్నిటిపైనా ప్రధాని మోదీ వివరణ ఇవ్వాలి'అని రాహుల్ డిమాండ్ చేశారు. 'రుజువులు ఇచ్చినా సెబీ అదానీకి క్లీన్ చిట్ ఇచ్చింది. క్లీన్‌చిట్ ఇచ్చిన సెబీలోని ఆ పెద్దమనిషి ఇప్పుడు అదానీ ఎన్‌డీ టీవీలో డైరెక్టర్. ఎలాంటి విచారణ జరిగిందో దీన్నిబట్టి అర్థమవుతోంది' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

సిమ్ నిబంధనలు ఉల్లంఘిస్తే రూ. 10 లక్షల జరిమానా: డాట్



న్యూఢిల్లీ: నమోదు చేసుకోని డీలర్ల ద్వారా సిమ్ కార్డులను విక్రయించి, కొత్త నిబంధనలను ఉల్లంఘిస్తే రూ. 10 లక్షల జరిమానా చెల్లించాల్సి ఉంటుందని టెల్కోలను టెలికం శాఖ (డాట్) హెచ్చరించింది. ఈ మేరకు గురువారం ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. సిమ్ కార్డుల మోసపూరిత విక్రయాలను కట్టడి చేసేందుకు ఉద్దేశించిన కొత్త నిబంధనలు అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయి. ఈ నేపథ్యంలో టెలికం సంస్థలు అన్ని పాయింట్ ఆఫ్ సేల్స్‌ను (పీవోఎస్) సెప్టెంబర్ 30లోగా రిజిస్టర్ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత పీవోఎస్‌లు తగు పత్రాలను సమర్పించి, రిజిస్టర్ చేయించుకోవాలి.

బ్యాంకులు, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో అమ్మకాలు

- సెన్సెక్స్ నష్టం 256 పాయింట్లు
- మళ్లీ 19,300 దిగువకు నిఫ్టీ
- మూడు రోజుల లాభాలకు బ్రేక్



ముంబై: స్టాక్ సూచీల 3 రోజుల వరుస లాభాలకు గురువారం బ్రేక్ పడింది. ఆగస్టు ఎఫ్అండ్ఓ కాంట్రాక్టుల ముగింపు సందర్భంగా బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ, ఇంధన షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. దేశీయ తొలి త్రైమాసికం జీడీపీ వృద్ధి డేటా వెల్లడికి ముందు అప్రమత్తత చోటు చేసుకుంది. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందాయి. ఫలితంగా సెన్సెక్స్ 256 పాయింట్లు పతనమై 64,831 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 65,277 వద్ద కనిష్టాన్ని, 64,724 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 93 పాయింట్లు నష్టపోయి 19,254 వద్ద నిలిచింది. రోజంతా 19,224 - 19,388 శ్రేణిలో ట్రేడైంది. ఐటీ, రియల్టీ, వినిమయ షేర్లు రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,973 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.4,383 కోట్ల ఈక్విటీలను కొన్నారు. చైనా ఏప్రిల్-జూన్ క్వార్టర్ వృద్ధి 0.8% క్షీణతతో ఆసియా మార్కెట్లు నష్టపోయాయి. ఏరోఫ్లెక్ ఇండస్ట్రీస్ షేరు లిస్టింగ్ రోజే 51% లాభాలు పంచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.108)తో పోలిస్తే 83% శాతం భారీ ప్రీమియంతో రూ.197 వద్ద లిస్టయ్యింది. బంపర్ లిస్టింగ్ నేపథ్యంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. చివరికి 51% లాభంతో రూ.163 వద్ద ముగిసింది. కంపెనీ విలువ రూ.2,110 కోట్లుగా నమోదైంది.

ఇండియా పోస్ట్‌తో అమెజాన్ జట్టు

ఎస్ఎంఈ ఎగుమతిదారులకు తోడ్పాటు



న్యూఢిల్లీ: చిన్న సంస్థలకు (ఎస్ఎంఈ) ఎగుమతులను సులభతరం చేసే దిశగా ఇండియా పోస్ట్‌తో అమెజాన్ ఒప్పందం కుదుర్చుకుంది. సంభవ్ సమ్మిట్ 2023 సందర్భంగా కంపెనీ ఈ విషయం తెలిపింది. అలాగే అమెజాన్, ఇండియా పోస్ట్ మధ్య దశాబ్ద కాలపు భాగస్వామ్యానికి గుర్తుగా కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ స్మారక స్టాంపును ఆవిష్కరించినట్లు వివరించింది. తమ విక్రేతలకు తోడ్పాటు అందించేందుకు సహ్-ఏఐ పేరిట కృత్రిమ మేథ ఆధారిత డిజిటల్ అసిస్టెంట్‌ను ప్రవేశపెట్టినట్లు అమెజాన్ తెలిపింది.

రెండు గేముల్లో ఓడిన హంపి



కోల్‌కతాలో జరుగుతున్న టాటా స్టీల్ ఇండియా ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి రెండు గేముల్లో ఓడిపోయి, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకుంది. అర పాయింట్‌తో చివరిదైన పదో ర్యాంక్‌లో ఉంది. జు వెన్‌జున్ (చైనా)తో జరిగిన తొలి గేమ్‌ను 67 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్న హంపి... ఇరీనా క్రుష్ (అమెరికా)తో జరిగిన రెండో గేమ్‌లో 48 ఎత్తుల్లో... వంతిక (భారత్)తో జరిగిన మూడో గేమ్‌లో 24 ఎత్తుల్లో ఓటమి పాలైంది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఒక పాయింట్‌తో 8వ ర్యాంక్‌లో ఉంది. తొలి రౌండ్‌లో దివ్య (భారత్) చేతిలో 57 ఎత్తుల్లో ఓడిన హారిక... నినో బత్సియాష్‌విలి (జార్జియా)తో 26 ఎత్తుల్లో, సవితాశ్రీ (భారత్)తో 56 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. తొమ్మిది రౌండ్లపాటు జరుగుతున్న ఈ టోర్నీలో మూడు రౌండ్ల తర్వాత దివ్య, వంతిక 2.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు.



ప్రపంచకప్ చెస్ టోర్నీలో రజత పతకం నెగ్గిన భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానందను అభినందిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ. చిత్రంలో ప్రజ్ఞానంద తల్లిదండ్రులు రమేశ్ బాబు, నాగలక్ష్మి కూడా ఉన్నారు.

రూడ్‌కు చుక్కెదురు

రెండో రౌండ్‌లోనే ఓడిన ఐదో సీడ్


రూడ్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో గురువారం సంచలన ఫలితాలు నమోదయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో గత ఏడాది రన్నరప్, ఐదో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే), ఏడో సీడ్ సిట్సిపాస్ (గ్రీస్) రెండో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టారు. ప్రపంచ 67వ ర్యాంకర్ జీజెన్ జాంగ్ (చైనా) 3 గంటల 19 నిమిషాల్లో 6-4, 5-7, 6-2, 0-6, 6-2తో రూడ్‌ను ఓడించగా... ప్రపంచ 128వ ర్యాంకర్ డొమినిక్ స్ట్రికర్ (స్విట్జర్లాండ్) 4 గంటల 4 నిమిషాల్లో 7-5, 6-7 (2/7), 6-7 (5/7), 7-6 (8/6), 6-3తో సిట్సిపాస్‌పై సంచలన విజయం సాధించాడు. మరో మ్యాచ్‌లో రెండో సీడ్ జొకోవిచ్ (సెర్బియా) 6-4, 6-1, 6-1తో మిరాలెస్ (స్పెయిన్)పై నెగ్గి మూడో రౌండ్‌కు చేరాడు. మహిళల సింగిల్స్‌లో మాజీ నంబర్‌వన్ వొజ్నియాకి (డెన్మార్క్) 7-5, 7-6 (7/5)తో 11వ సీడ్ క్విటోవా (చెక్ రిపబ్లిక్)పై, టాప్ సీడ్ స్వియాటెక్ (పోలాండ్) 6-3, 6-4తో దరియా సావిల్లె (ఆస్ట్రేలియా)పై గెలిచి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.

పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 6-4, 6-2తో క్రిస్టోఫర్ ఒకానెల్-వుకిచ్ (ఆస్ట్రేలియా) జంటను ఓడించగా... సాకేత్ మైనేని (భారత్)-కరత్‌సెవ్ (రష్యా) ద్వయం 7-6 (7/4), 3-6, 2-6తో హుస్లెర్ (స్విట్జర్లాండ్)-లాస్లో జెరె (సెర్బియా) జోడీ చేతిలో ఓటమి పాలైంది.

'వయాకామ్ 18' చేతికి భారత క్రికెట్

మనం ఇంట్లో కూర్చున్నా... షాపుల్లో టీవీ ఆన్ చేసినా... టీమిండియా క్రికెట్ మ్యాచ్‌లు చూడాలంటే టీవీ రిమోట్‌తో ట్యూన్ చేసుకునేది స్టార్ స్పోర్ట్స్ చానెళ్లనే! అంతగా భారత్‌లో స్టార్ నెట్‌వర్క్ క్రికెట్ ప్రియుల మదిలో 11 ఏళ్లుగా (2012 నుంచి) తిష్ట వేసుకుంది. అయితే ఇప్పుడీ ట్రెండ్ మారనుంది. రిమోట్ తీసుకొని వయాకామ్ 18 నెట్‌వర్క్ చానెల్ 'స్పోర్ట్స్ 18'కు మారాల్సిందే!

రూ. 5,963 కోట్లతో మీడియా హక్కులు వశం

ముక్కోణపు పోటీలో రిలయన్స్ ధాటికి స్టార్ స్పోర్ట్స్, సోనీ స్పోర్ట్స్ అవుట్



న్యూఢిల్లీ: భారతీయ కార్పొరేట్ దిగ్గజ సంస్థ రిలయన్స్ గ్రూప్ క్రికెట్ హక్కుల్ని కైవసం చేసుకొంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) గురువారం నిర్వహించిన ఇ-వేలం (ఆన్‌లైన్)లో స్వదేశంలో జరిగే అంతర్జాతీయ, జాతీయ మ్యాచ్‌ల్ని ప్రత్యక్ష ప్రసారం చేసుకొనే మీడియా హక్కుల్ని 'వయాకామ్ 18' దక్కించుకుంది. 2023-28 ఈ ఐదేళ్ల కాలానికి గాను సుమారు రూ. 6,000 కోట్లు చెల్లించేందుకు బిడ్ గెలిచింది. డిస్నీప్లస్ స్టార్, సోనీ నెట్‌వర్క్‌లతో ముక్కోణపు పోటీలో పాల్గొన్న వయాకామ్ 18... టీవీ, డిజిటల్ రైట్స్ కోసం అత్యధికంగా రూ.5,963 కోట్లు (720.60 మిలియన్ డాలర్లు)తో బిడ్ దాఖలు చేసింది. దీంతో పోటీ ప్రసార సంస్థలకు రిలయన్స్ చేతిలో చుక్కెదురైంది.

- మీడియా రైట్స్‌లో టెలివిజన్, డిజిటల్ (ఓటీటీ యాప్స్) హక్కులున్నాయి. ఈ రెండింటి కోసం వేర్వేరు బిడ్‌లను స్వీకరించారు. టీవీ హక్కులకు రూ.2,862 కోట్లు (345.90 మిలియన్ డాలర్లు), డిజిటల్ హక్కులకు రూ.3,101 కోట్లు (374.70 మిలియన్ డాలర్లు) చెల్లించేందుకు వయాకామ్ 18 బిడ్‌లు వేసింది.
- గత 2018-23 కాలానికి 'స్టార్ నెట్‌వర్క్' రూ. 6,138 కోట్లు చెల్లించింది. అయితే గత ఐదేళ్లలో సొంతగడ్డపై భారత్ 102 మ్యాచ్‌లు ఆడింది. కానీ వచ్చే ఐదేళ్లలో 88 మ్యాచ్‌లే ఆడబోతోంది.
- గత మీడియా హక్కులతో పోలిస్తే ఇది 12.92 శాతం ఎక్కువ. అప్పుడు మ్యాచ్‌కు రూ. 60 కోట్లు చెల్లించారు. ఇకపై మ్యాచ్‌కు రూ.67.75 కోట్లు చెల్లించాలి.
- క్రితంసారి మూడు విభాగాల్లో బిడ్‌లను స్వీకరించారు. భారత ఉపఖండపు టీవీ రైట్స్-రెస్టాఫ్ వరల్డ్ డిజిటల్ రైట్స్, భారత ఉపఖండపు డిజిటల్ రైట్స్, గ్లోబల్ కన్సాలిడేటెడ్ రైట్స్‌గా వర్గీకరించారు. కానీ ఇప్పుడు అవుట్ రైట్‌గా టీవీ రైట్స్, డిజిటల్ రైట్స్ అని రెండు రకాల గ్లోబల్ రైట్స్‌ను అందుబాటులోకి తెచ్చారు!
- ఈ నెల 22 నుంచి భారత్, ఆస్ట్రేలియాల మధ్య జరిగే సిరీస్‌తో 2023-28 సైకిల్ మొదలవుతుంది.
- ఈ ఐదేళ్ల సైకిల్‌లో టీమిండియా 25 టెస్టులు, 27 వన్డేలు, 36 టి20లు కలిపి మొత్తంగా 88 మ్యాచ్‌లు ఆడనుంది. ఆస్ట్రేలియాతో 21 మ్యాచ్‌లు, ఇంగ్లండ్‌తో 18 మ్యాచ్‌లు, కివీస్‌తో 11 మ్యాచ్‌లు, దక్షిణాఫ్రికాతో 10 మ్యాచ్‌ల్లో తలపడుతుంది.
- 'వయాకామ్ 18'కు స్పోర్ట్స్ హక్కులు కొత్తేం కాదు. ఇంతకుముందే ఐపీఎల్ డిజిటల్ హక్కుల్ని పొందింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్), పారిస్ ఒలింపిక్స్, దక్షిణాఫ్రికా మ్యాచ్ లు, దక్షిణాఫ్రికా లీగ్, టి10 లీగ్ (అమెరికా), రోడ్‌సేఫ్టీ వరల్డ్ సిరీస్, ఎన్‌బీఏ, డైమండ్ లీగ్ తదితర ప్రపంచవ్యాప్త క్రీడల హక్కుల్ని కైవసం చేసుకుంది.
- 'వయాకామ్ 18' మీడియాలోని స్పోర్ట్స్ 18 టీవీ చానెల్‌లో, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌కు సంబంధించి జియో సినిమా యాప్‌లో క్రికెట్ మ్యాచ్‌లు ప్రసారం అవుతాయి.

'స్టార్ స్పోర్ట్స్'కు శుభం కార్డు!

రిలయన్స్ గ్రూప్ మీడియా హక్కులు దక్కించుకోవడంతో 'స్టార్ స్పోర్ట్స్'కు శుభం కార్డు పడినట్లయింది. 2012 నుంచి ఇప్పటివరకు అంటే 11 ఏళ్లుగా భారత్‌లో జరిగిన అంతర్జాతీయ, జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు డిస్నీ ప్లస్ స్టార్ నెట్‌వర్క్‌లోనే ప్రసారమయ్యాయి. ఐపీఎల్ మ్యాచ్‌ల టీవీ ప్రసార హక్కులు మాత్రం 'స్టార్ స్పోర్ట్స్' వద్దే ఉన్నాయి.

మార్ష్ మెరుపులు

తొలి టి20లో ఆసీస్ ఘనవిజయం



డర్బన్: దక్షిణాఫ్రికాతో మూడు టి20 మ్యాచ్‌ల సిరీస్‌ను ఆస్ట్రేలియా జట్టు ఘనవిజయంతో ప్రారంభించింది. భారత కాలమానం ప్రకారం బుధవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 111 పరుగుల తేడాతో గెలిచింది. ముందుగా ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 226 పరుగులు సాధించింది. కొత్త కెప్టెన్ మిచెల్ మార్ష్ (49 బంతుల్లో 92 నాటౌట్; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) కళ్లు చెదిరే ఇన్నింగ్స్ ఆడాడు. టిమ్ డేవిడ్ (28 బంతుల్లో 68; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు)తో కలిసి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మార్ష్ ఐదో వికెట్‌కు 97 పరుగులు జోడించాడు. అనంతరం దక్షిణాఫ్రికా 15.3 ఓవర్లలో 115 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. ఓపెనర్ రీజా హెండ్రిక్స్ (43 బంతుల్లో 56; 5 ఫోర్లు, 2 సిక్స్) మినహా మిగతావారు విఫలమయ్యారు. తొలి అంతర్జాతీయ టి20 మ్యాచ్ ఆడిన లెగ్ స్పిన్నర్ తన్వీర్ సంఘా (4/31), స్టొయినిస్ (3/18) దక్షిణాఫ్రికాను దెబ్బ తీశారు. రెండో టి20 మ్యాచ్ నేడు జరుగుతుంది.

ఇంగ్లండ్‌దే తొలి టి20


బ్రైడన్ కార్స్

చెస్టర్ లీ స్ట్రీట్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న ఇంగ్లండ్ జట్టు న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో ఏడు వికెట్ల తేడాతో నెగ్గింది. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ముందుగా న్యూజిలాండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 139 పరుగులు చేసింది. గ్లెన్ ఫిలిప్స్ (38 బంతుల్లో 41; 4 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బ్రైడన్ కార్స్ (3/23), ల్యూక్ వుడ్ (3/37) న్యూజిలాండ్‌ను కట్టడి చేశారు. అనంతరం ఇంగ్లండ్ దూకుడుగా ఆడి కేవలం 14 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 143 పరుగులు చేసి గెలిచింది. డేవిడ్ మలాన్ (42 బంతుల్లో 54; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), హ్యారీ బ్రూక్ (27 బంతుల్లో 43 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరిపించారు. రెండో మ్యాచ్ నేడు జరుగుతుంది.

శ్రీలంక శుభారంభం

- బంగ్లాదేశ్‌పై ఐదు వికెట్లతో విజయం
- పతిరనకు 4 వికెట్లు
- రాణించిన అసలంక, సమరవిక్రమ


పతిరన

పల్లెకెలె: ఆసియా కప్ వన్డే క్రికెట్ టోర్నీలో శ్రీలంక 5 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన బంగ్లాదేశ్ ముందుగా బ్యాటింగ్ ఎంచుకొని 42.4 ఓవర్లలో 164 పరుగులకే ఆలౌటైంది. నజ్ముల్ హొసేన్ (122 బంతుల్లో 89; 7 ఫోర్లు) ఒంటరి పోరాటం చేశాడు. కెప్టెన్ షకీబ్ (5) సహా ఇంకెవరూ చెప్పుకోదగ్గ స్కోర్లే చేయలేదు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మతీశా పతిరన (4/32) బంగ్లాదేశ్ వెన్నువిరిచాడు. తీక్షణకు 2 వికెట్లు దక్కాయి. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన శ్రీలంక 39 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసి గెలిచింది. చరిత్ అసలంక (92 బంతుల్లో 62 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్), సమరవిక్రమ (77 బంతుల్లో 54; 6 సిక్స్‌లు) రాణించారు. ఇద్దరు నాలుగో వికెట్‌కు 78 పరుగులు జోడించారు. నేడు మ్యాచ్‌లకు విశ్రాంతి దినం. శనివారం ఇదే మైదానంలో భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ జరుగుతుంది.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: నయీమ్ (సి) నిసాంక (బి) ధనంజయ 16; తాన్‌జిద్ హసన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) తీక్షణ 0; నజ్ముల్ (బి) తీక్షణ 89; షకీబ్ (సి) కుశాల్ (బి) పతిరన 5; తౌహిద్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షనక 20; రహీమ్ (సి) కరుణరత్నే (బి) పతిరన 13; మిరాజ్ (రనౌట్) 5; మెహిదీ హసన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) వెలలగె 6; తస్కిన్ (సి) తీక్షణ (బి) పతిరన 0; ఇస్లామ్ (నాటౌట్) 2; ముస్తాఫిజుర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) పతిరన 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (42.4 ఓవర్లలో ఆలౌట్) 164. వికెట్ల పతనం:** 1-4, 2-25, 3-36, 4-95, 5-127, 6-141, 7-162, 8-162, 9-164, 10-164. **బౌలింగ్:** కసున్ రజిత 7-0-29-0, తీక్షణ 8-1-19-2, ధనంజయ 10-0-35-1, పతిరన 7.4-0-32-4, వెలలగె 7-0-30-1, షనక 3-0-16-1.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) రహీమ్ (బి) ఇస్లామ్ 14; కరుణరత్నే (బి) తస్కిన్ 1; కుశాల్ (బి) షకీబ్ 5; సమరవిక్రమ (స్టంప్డ్) రహీమ్ (బి) మెహదీ హసన్ 54; అసలంక (నాటౌట్) 62; ధనంజయ (బి) షకీబ్ 2; షనక (నాటౌట్) 14; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (39 ఓవర్లలో 5 వికెట్లకు) 165. వికెట్ల పతనం:** 1-13, 2-15, 3-43, 4-121, 5-128. **బౌలింగ్:** టస్కిన్ 7-1-34-1, ఇస్లామ్ 4-0-23-1, షకీబ్ 10-2-29-2, ముస్తఫిజుర్ 3-0-12-0, మిరాజ్ 5-0-26-0, మెహదీ హసన్ 10-0-35-1.



పెద్దపెద్ద గుండ్రటి కళ్లు, ఒంటినిండా జూలు, చిట్టి చెవులు, మూతితో చిటారు కొమ్మన కూర్చొని తదేకంగా చూస్తున్న దీన్ని దేవాంగ పిల్లి అంటారు. మినీ వానరంలా కనిపిస్తున్న దీన్ని తిరుమల శేషాచలం అడవుల్లో 'సాక్షి'కెమెరా ఇలా క్లిక్‌మనిపించింది. 6 నుంచి 15 అంగుళాల పొడవుండే దేవాంగ పిల్లులు 275 నుంచి 348 గ్రాముల వరకు బరువుంటాయి. ఆకుల్ని, పురుగుల్ని తినే ఈ చిన్న జీవుల సగటు జీవితకాలం 12 నుంచి 15 ఏళ్లు. వాటికి నంగనాచి, పిగ్మీ, నైట్ మంకీ, మూడు జానల మనిషి అనే పేర్లు కూడా ఉన్నాయి. దేవాంగ పిల్లి స్ట్రెప్‌సిర్హైన్ ప్రైమేట్స్ అనే ఒక రకమైన వానర జాతిలో లోరిస్డే కుటుంబానికి చెందినది. దేవాంగ పిల్లుల్లో రెడ్ స్లెండర్ లోరిస్, గ్రే స్లెండర్ లోరిస్ రకాలు శ్రీలంకతోపాటు దక్షిణ భారత దేశంలోని ఆగ్నేయమూల శేషాచలం అటవీశ్రేణుల్లో కనిపిస్తాయి. వాటిలో లోరిస్ టార్డిగ్రేడస్ మలబారికస్ అనే ఉపజాతి కేవలం తిరుమల శేషాచలం అడవుల్లోనే జీవిస్తోంది. దేవాంగ పిల్లుల్లో ఔషధ గుణాలు, శక్తులున్నాయని కొందరు గిరిజనులు విశ్వసిస్తున్నారు. ఇటీవల కొందరు అక్రమార్కులు వాటిని 'లిల్లీపుట్స్'పేరుతో విదేశాలకు అమ్ముతున్నారని... భారతీయ అటవీ చట్టం ప్రకారం వాటిని కలిగి ఉండటం, అమ్మడం నేరమని అటవీశాఖ పేర్కొంది. – తిరుపతి

శ్రీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్ సొమ్ము జప్తు

- రూ. 90 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు అటాచ్ చేసిన ఈడీ

సాక్షి, హైదరాబాద్: శ్రీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్‌కు చెందిన రూ.90 లక్షల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు గురువారం అటాచ్ చేశారు. పీఎంఎల్‌ఏ (ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్) చట్టాల కింద సదరు మొత్తాన్ని అటాచ్ చేసినట్టు ఈడీ అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. శ్రీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్ ప్రమాదకరమైన వ్యర్థాలను నిబంధనలకు విరుద్ధంగా నీటిలోకి వదులుతున్నట్టు తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ) మేడ్చల్‌లోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు చేసింది. టీఎస్‌పీసీబీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈడీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. సదరు పరిశ్రమ ప్రమాదకరమైన వ్యర్థాలను హైదరాబాద్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాజెక్టుకు పంపకుండా.. ఇటుకల తయారీ కంపెనీలకు ఇచ్చినట్టు గుర్తించారు. ఇలా నిబంధనలు పాటించకుండా సదరు కంపెనీ రూ.90 లక్షల మేర లబ్ధి పొందినట్టు ఈడీ అధికారులు గుర్తించారు. ఈ మొత్తాన్ని తాత్కాలికంగా అటాచ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

జైళ్లశాఖలో పదోన్నతులు

ఐజీగా బాధ్యతలు స్వీకరించిన మురళీబాబు



ఎం.సంపత్ (డీఐజీ)

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర జైళ్ల శాఖలో ఉన్నతాధికారులకు పదోన్నతులతోపాటు నూతన పోస్టింగ్‌లు లభించాయి. ఇటీవలే పదోన్నతి పొందిన మురళీబాబు గురువారం ఐజీగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఐజీగా పనిచేస్తున్న రాజేశ్ కుమార్‌తోపాటు మరో ఐజీ పోస్టును ప్రభుత్వం ఇటీవలే ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అదేవిధంగా వరంగల్ సెంట్రల్ జైలు ఎస్పీగా పనిచేస్తున్న ఎం.సంపత్ డీఐజీగా పదోన్నతి పొందారు. వరంగల్ రేంజ్ డీఐజీగా గురువారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం వరంగల్ రేంజ్ డీఐజీగా పనిచేస్తున్న శ్రీనివాస్ హైదరాబాద్ రేంజ్ డీఐజీగా నియమితులయ్యారు. కాగా, దేశంలోని అన్ని జైళ్లశాఖల్లోనూ అతి తక్కువ వయసులో డీఐజీగా పదోన్నతి పొందిన అధికారిగా సంపత్ రికార్డు సృష్టించారు.


సంతకాన్ని ఫోర్జరీ చేసి.. అపాయింట్‌మెంట్లు ఇచ్చేసి...

- విద్యుత్ సీఎండీ ప్రభాకర్‌రావు సంతకం ఫోర్జరీ
- మణుగూరులో నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చిన వ్యక్తి

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగాలపేరుతో ఓ వ్యక్తి ఏకంగా విద్యుత్ సంస్థల సీఎండీ ప్రభాకర్‌రావు సంతకాన్ని ఫోర్జరీ చేసి మోసం చేశాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడుకు చెందిన ఓ వ్యక్తికి మణుగూరులో ఉద్యోగం ఇస్తామని చెప్పి అతడి నుంచి డబ్బులు వసూలు చేశాడు. ఆయనకు ఉద్యోగం ఇస్తున్నట్లు అపాయింట్‌మెంట్ లెటర్ కూడా తయారు చేసి దానిపై విద్యుత్ సంస్థల సీఎండీ ప్రభాకర్‌రావు సంతకాన్ని కూడా ఫోర్జరీ చేశాడు. ఇలా చాలామంది నిరుద్యోగులకు గాలం వేసి వారి నుంచి భారీ ఎత్తున డబ్బులు దండుకున్నట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన తమ దృష్టికి వచ్చిందని, ఇటువంటి మోసాలకు పాల్పడే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ట్రాన్స్‌కో, జెన్‌కోలు సూచించాయి. ఈ మేరకు సీఎండీ ప్రభాకర్‌రావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'విద్యుత్ సంస్థల్లో ప్రస్తుతం ఎలాంటి నోటిఫికేషన్లు లేవు. తప్పుడు ప్రచారాలు నమ్మొద్దు. నకిలీ అపాయింట్‌మెంట్స్‌పై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబితే పోలీసులకు ఫిర్యాదు చేయండి. కేసులు పెట్టండి. ఏ ఉద్యోగమైనా పరీక్షలు, అర్హతలు, ఇంటర్వ్యూల ఆధారంగానే వస్తుంది.'అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

8న విచారణ అధికారికి వివరాలివ్వండి

- రిట్ పిటిషనర్‌కు ఉన్నత న్యాయస్థానం ఆదేశం
- తప్పుడుపత్రాలకు ఎన్‌ఓసీ కేసులో హైకోర్టు విచారణ



సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా నానల్‌నగర్‌లోని 5200 చదరపు గజాలకు ఎలాంటి ఆధారాలు పరిశీలించకుండానే నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) ఇవ్వడంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి(నాటి హైదరాబాద్ కలెక్టర్) నవీన్ మిత్తల్ పాత్రపై విచారణాధికారికి వివరాలు అందజేయాలని రిట్ పిటిషన్‌లో పిటిషనర్లను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు సెప్టెంబర్ 8న కమిటీ ముందు హాజరుకావాలని శాంతిఅగర్వాల్, ఆమె కుమారుడు అతుల్‌కుమార్ అగర్వాల్‌ను ఆదేశించింది. మొత్తం ప్రక్రియ అంతా డిసెంబర్ 31లోగా పూర్తి చేయాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. తదుపరి విచారణను వచ్చే జనవరికి వాయిదా వేసింది. శాంతిఅగర్వాల్ కొనుగోలు చేసిన స్థలానికి కొందరు తప్పుడు పత్రాలు సమర్పించగా, వారికి అప్పటి హైదరాబాద్ కలెక్టర్ నవీన్‌మిత్తల్ కమిటీ ఎన్‌ఓసీ ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ శాంతి 2011లో హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సింగిల్ జడ్జి ఎన్‌ఓసీ రద్దు చేస్తూ తీర్పు ఇచ్చారు. నవీన్ మిత్తల్, జాయింట్ కలెక్టర్ వీవీ.దుర్గాదాస్, తహసీల్దార్లు మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ తీర్పుపై 2017లో ప్రైవేటు వ్యక్తులతోపాటు అధికారులు అప్పీళ్లు వేశారు. ఈ అప్పీళ్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్‌అరాధే, జస్టిస్ వినోద్‌కుమార్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. అప్పీల్‌లో ప్రతివాదుల(రిట్ పిటిషన్‌లో పిటిషనర్) తరఫు సీనియర్ న్యాయవాది జె.ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. శాంతి అగర్వాల్ భర్త చనిపోయారని, ఆమె కుమారుడిని కూడా అదే రోజు విచారణకు హాజరయ్యే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అడ్వొకేట్ జనరల్ బీఎస్.ప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. ఇప్పటికే శాఖాపరంగా నలుగురు సాక్ష్యులను విచారణ చేశామన్నారు. శాంతిఅగర్వాల్‌ను కూడా సెప్టెంబర్ 8న విచారించనున్నట్టు చెప్పారు. ఆరువారాల్లో విచారణ ముగిసే అవకాశం ఉందని వెల్లడించారు. వాదనలు విన్న ధర్మాసనం.. కేసు ప్రక్రియంతా డిసెంబర్ 31లోగా పూర్తి చేయాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

సిటీలో రేవ్ పార్టీ.. రంగుల తెరకు డ్రగ్స్ మరక

- ఇండియన్ నేవీ మాజీ ఉద్యోగిని పట్టుకుంటే కదిలిన డొంక
- మాదాపూర్‌లోని అపార్ట్‌మెంట్‌లో ఫిల్మ్ ఫైనాన్షియర్ సహా ముగ్గురి అరెస్ట్
- అక్కడే ఇద్దరు యువతులను గుర్తించిన పోలీసులు
- సినీరంగ ప్రముఖులకు మాదకద్రవ్యాలు సరఫరా
- ఆ 18 మంది కస్టమర్ల కోసం గాలింపు



పోలీసులు స్వాధీనం చేసుకున్న డ్రగ్స్



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

సాక్షి, హైదరాబాద్: టీఎస్–నాబ్ అధికారులకు గుడిమల్కాపూర్‌లో దొరికిన డ్రగ్స్ తీగ లాగితే... మాదాపూర్ విఠల్‌నగర్‌లో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో జరుగుతున్న రేవ్ పార్టీ డొంక కదిలింది. ఈ వ్యవహారంలో ఓ ఫిల్మ్ ఫైనాన్షియర్ సహా ముగ్గురిని పట్టుకున్నారు. కేసుకు సంబంధించి పరారీలో ఉన్న 18 మంది కస్టమర్లు, నలుగురు డ్రగ్ పెడ్లర్స్ కోసం గాలిస్తున్నట్టు టీఎస్–నాబ్(తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో) ఎస్పీ (వెస్ట్) డి.సునీతరెడ్డి గురువారం వెల్లడించారు.

నేవీ నుంచి బాలాజీ బయటకొచ్చాక...

నెల్లూరుకు చెందిన బి.బాలాజీ ఇండియన్ నేవీలో పనిచేస్తుండగా, కంటికి తీవ్రమైన గాయమైంది. మెడికల్లీ అన్‌ఫిట్ కావడంతో నేవీ నుంచి బయటకు వచ్చి వ్యాపారిగా మారాడు. తరచూ హైదరాబాద్‌కు వచ్చి వెళ్లే బాలాజీ తన స్నేహితులతో కలిసి మాదాపూర్ అపార్ట్‌మెంట్‌లోని సర్వీస్ ఫ్లాట్‌లో జరిగే రేవ్ పార్టీలకు హాజరయ్యేవాడు. ఇలా హైదరాబాద్‌తోపాటు బెంగుళూరులో ఉన్న డ్రగ్ పెడ్లర్స్‌తో సంబంధాలు ఏర్పడ్డాయి. ఆపై రేవ్ పార్టీలు ఏర్పాటు చేయడం బాలాజీకి వ్యాపకంగా మారింది. స్నేహితులతో పాటు పరిచయస్తుల కోసం నగరంతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల్లోని ఫామ్‌హౌస్‌లు, గెస్ట్ హౌస్‌ల్లో వీటిని నిర్వహించేవాడు. ఈ క్రమంలోనే బెంగళూరులో ఉన్న నైజీరియన్లతో సంబంధాలు ఏర్పాటు చేసుకొని, వారి నుంచి మాదకద్రవ్యాలు ఖరీదు చేసేవాడు. ఆపై పార్టీలు నిర్వహిస్తూ, విక్రయాలు ప్రారంభించాడు. బాలాజీ ఖాతాదారుల్లో సినీరంగానికి చెందిన ప్రముఖులు కూడా ఉన్నారు.

ఫిల్మ్ ఫైనాన్షియర్ కూడా...: గుంటూరులోని నెహ్రూనగర్‌కు చెందిన కె.వెంకటరమణారెడ్డి గతంలో జూబ్లీహిల్స్ పరిధిలో ఓ గెస్ట్‌హౌస్ లీజుకు తీసుకున్నాడు. ఇందులో వ్యభిచారం జరుగుతోందనే సమాచారంతో అప్పట్లో పోలీసులు దాడి చేయగా, నిర్వాహకులు పరారయ్యారు. ఈ కేసులో చిక్కిన వెంకటరమణారెడ్డి ఆపై అమెరికా వెళ్లాడు. అక్కడ నుంచి తిరిగిన వచ్చిన తర్వాత తన సన్నిహితులకు సంబంధించిన ప్రొడక్షన్ సంస్థ నిర్వహిస్తూ ఫిల్మ్ ఫైనాన్షియర్‌గా మారాడు. డమరుకం, కిక్, బిజినెస్‌మ్యాన్, లవ్లీ, ఆటోనగర్ సూర్య వంటి చిత్రాలకు ఫైనాన్స్ చేశాడు. ఈ క్రమంలోనే రేవ్ పార్టీలకు వెళ్లడం అలవాటైంది. రేవ్ పార్టీలు నిర్వహించే వారికి ఫైనాన్స్ చేయడం మొదలుపెట్టాడు. ఇలా బాలాజీతో కూడా పరిచయం ఏర్పడింది. బెంగళూరుకు చెందిన ముగ్గురు నైజీరియన్లతో పాటు విశాఖపట్నానికి చెందిన మరో వ్యక్తి నుంచి డ్రగ్స్ ఖరీదు చేసిన బాలాజీ వీటిలో కొన్నింటిని వెంకటరమణారెడ్డికి అందించాడు. ఈ మాదకద్రవ్యాలతో బుధవారం రాత్రి మాదాపూర్‌లోని అపార్ట్‌మెంట్‌లో రేవ్ పార్టీ ఏర్పాటు చేశాడు.

గుడిమల్కాపూర్‌లో చిక్కిన బాలాజీ: రేవ్ పార్టీకి హాజరుకావడానికి మరికొన్ని మాదకద్రవ్యాలను తీసుకొని వస్తున్న బాలాజీ కదలికలపై టీఎస్–నాబ్‌కు సమాచారం అందింది. ఏసీపీ కె.నర్సింగ్‌రావు, ఇన్‌స్పెక్టర్ పి.రాజేష్‌లతో కూడిన బృందం వలపన్ని పట్టుకుంది. బాలాజీ వద్ద నుంచి కొన్ని డ్రగ్స్ స్వాధీనం చేసుకుని ప్రశ్నించగా, సర్వీస్ ఫ్లాట్ విషయం చెప్పాడు. దీంతో గురువారం తెల్లవారుజామున పోలీసులు ఆ ఫ్లాట్‌పై దాడి చేశారు. అక్కడ వెంకటరమణారెడ్డితో పాటు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఐజీ వద్ద సీనియర్ స్టెనోగా పనిచేస్తున్న డి.మురళి పట్టుబడ్డాడు. మద్యంమత్తులో మ్యూజిక్ పెట్టుకుని చిందులు వేస్తున్న వీరు డైనింగ్ టేబుల్‌పై ప్లేట్‌లో ఉంచిన కొకైన్‌ను కరెన్సీ నోటు సాయంతో ముక్కులోకి పీలుస్తున్నారు. వీరి వద్ద టీఎస్–నాబ్ బృందం 2.8 గ్రాముల కొకైన్, ఆరు ఎల్‌ఎస్‌డీ బోల్ట్స్, 25ఎక్స్‌టసీ పిల్స్, రెండు ప్యాకెట్ల గాంజా, రూ.72,500 నగదు, రెండు కార్లు, ఐదుసెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.32.89 లక్షలుగా నిర్ధారించారు.

స్నాప్‌చాట్‌లో కోడ్ నేమ్స్

డ్రగ్ పెడ్లర్‌గా మారిన బాలాజీ కస్టమర్లలో సినీరంగానికి చెందిన డైరెక్టర్లు, ప్రొడ్యూసర్లతో పాటు కొందరు నటీనటులు ఉన్నట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. వీళ్లందరితో బాలాజీ సోషల్‌మీడియా యాప్ స్నాప్‌చాట్ ద్వారా సంప్రదింపులు జరిపేవాడు. సందేశాలు, కాల్స్ అన్నీ దీని ద్వారానే చేసేవాడు. ఇందులో వారివారి కాంటాక్ట్స్ ర్యాంబో, కిమ్స్, కింగ్, క్యాచీ, సూపర్ వంటి కోడ్ నేమ్స్‌తో ఉన్నాయి. ఆ కాంటాక్ట్స్‌లో ఫోన్‌నంబర్లు సహా ఇతర వివరాలు కనిపించకపోవడంతో వారిని గుర్తించడానికి లోతుగా విశ్లేషిస్తున్నారు. ప్రాథమిక వివరాలను బట్టి 18 మందిని కస్టమర్లుగా గుర్తించి వారి కోసం గాలిస్తున్నారు. పరారీలో ఉన్న ముగ్గురు నైజీరియన్లతో సహా నలుగురు పెడ్లర్స్ కోసం ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. వెంకట రమణారెడ్డి ఇద్దరు ఢిల్లీ యువతులను సినిమాల్లో అవకాశాలు ఇప్పిస్తానంటూ తీసుకొచ్చాడు. వీళ్లిద్దరూ సైతం ఆ అపార్ట్‌మెంట్‌లోని సర్వీస్ ఫ్లాట్‌లో పోలీసులు చిక్కారు.

సికింద్రాబాద్–కాకినాడ మధ్య ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్–కాకినాడ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్–కాకినాడ (07071/07072) ప్రత్యేక రైలు సెప్టెంబర్ 2వ తేదీ రాత్రి 8.50 గంటలకు బయల్దేరి 3వ తేదీ ఉదయం 8.45 గంటలకు కాకినాడకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సెప్టెంబర్ 3న రాత్రి 9 గంటలకు బయల్దేరి మర్నాడు ఉదయం 8.50 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

'చైల్డ్ పోర్న్' పేరిట సైబర్ నేరగాళ్ల మోసాలు!

సాక్షి, హైదరాబాద్: 'మీరు ఆన్‌లైన్‌లో చిన్న పిల్లల అశ్లీల దృశ్యాలు చూస్తున్నారు. మీ ఐపీ అడ్రస్‌తో సహా మాకు పూర్తి ఆధారాలు లభించాయి. మీపై పోక్సో యాక్ట్ కింద, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది.. మేం పంపిన నోటీసులకు సమాధానం ఇవ్వకపోతే చర్యలు తప్పవు. పూర్తి వివరాలు మీడియాకు వెల్లడిస్తాం'అంటూ సైబర్ నేరగాళ్లు కొత్త తరహా బెదిరింపులకు, మోసాలకు తెరతీస్తున్నారు. ఇండియన్ సైబర్ క్రైం కో–ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ)సీఈఓ రాజేశ్‌కుమార్ పేరిట పలువురికి ఈ–మెయిల్స్ రూపంలో ఓ ఫేక్ నోటీసును పంపుతున్నట్టు సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు. ఇలాంటి నకిలీ ఈమెయిల్స్‌కు ఎవరైనా స్పందించి ఆ ఈ–మెయిల్ పంపిన వారిని సంప్రదిస్తే అప్పుడు బెదిరింపులకు దిగి ఆన్‌లైన్‌లో డబ్బులు వసూలు చేస్తున్నట్టు తేలింది. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ సిబ్బంది సైతం ఇవి ఫేక్ నోటీసులు అని నిర్ధారించారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్)లోనూ ఈ మేరకు ఓ ట్వీట్ పెట్టారు. ఇలాంటి నకిలీ నోటీసులతో కూడిన ఈ–మెయిల్స్ వస్తే వాటిని నమ్మవద్దని, ఆన్‌లైన్‌లో సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైం సిబ్బంది సూచించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.